thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

సంపుటి - 20 సంచిక - 149 | కరీంనగర్ గురువారం, 7 ఆగష్టు 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## 'తుంగభద్ర'పై కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం..

బెంగళూరు : తుంగభద్ర డ్యాం కు గతేడాది కొట్టుకుపోయిన 19వ క్రస్ట్ గేటు స్థానంలో కొత్త గేటును అమర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని బీజేపీ నాయకులు ఆరోపించారు. టీబీడ్యాంపై కొప్పళ జిల్లా బీజేపీ బృందం పర్యటించింది. ప్రతిపక్ష నాయకుడు దొడ్డనగౌడ పాటిల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బసవరాజ్ కావటూర్, రమేష్, గణేష్, మంజునాథ్, మల్లికార్జున తదితర నాయకులు బృందంలో ఉన్నారు. దెబ్బతిన్న 19వ క్రస్ట్ గేటు స్తానంలో కొత్త గేటు అమర్చేందుకు రూ.2 కోట్ల వ్యయంతో టెండర్ పిలిచారని, కానీ మళ్లీ రద్దు చేశారన్నారు. ఇక మిగిలిన గేట్లకు ఎప్పుడు టెండర్ పిలుస్తారో.. ఎప్పుడు మరమ్మత్తుచేస్తారో ఆయోమయంగా ఉందని మండిపడ్డారు. డ్యాంకు నీరు వస్తున్న తరుణంలో గేట్లు పటిష్టంగా లేకుంటే నీరు ఎలా నిలుస్తాయని ప్రశ్నించారు. ఇది పూర్తీగా సర్కార్ వైఫల్యమేనన్నారు. పలువురు బీజేపీ నాయకులు డ్యాంను పరిశీలించారు.

# చైనా పర్యటనకు ప్రధాని మోదీ షెడ్యూల్ ఖరారు..!




## 'గల్వాన్' ఘటన తర్వాత తొలిసారి!

ఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ త్వరలో చైనాలో పర్యటించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారైంది. తియాంజిన్ వేదికగా ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో జరగనున్న షాంఘై సహకార సదస్సులో ఆయన పాల్గొననున్నారు. గల్వాన్ ఘటన తర్వాత ప్రధాని మోదీ చైనాలో పర్యటనకు వెళ్లడం ఇదే తొలిసారి. ఈ పర్యటనలో రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లతో మోదీ ప్రత్యేకంగా భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతేడాది కజాన్‌లో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో జిన్‌పింగ్‌తో మోదీ భేటీ అయిన విషయం తెలిసిందే. తొలిసారిగా 2015లో బీజింగ్‌కు వెళ్లిన భారత ప్రధాని.. ఇప్పటివరకు ఐదుసార్లు ఆ దేశంలో పర్యటించారు. 2019లో చివరిసారిగా చైనాలో పర్యటించారు. ఆ తర్వాత 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్-చైనా సైనికుల మధ్య ఘర్షణతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటి పునరుద్ధరించేందుకు సైనిక, దౌత్యాధికారుల మధ్య అనేక దఫాల్లో చర్చలు జరిగ్గా ఇటీవలే కొంత పురోగతి కనిపిస్తోంది. చైనాలో ఈ ఏడాది జూన్‌లో జరిగిన 'షాంఘై సహకార సంస్థ' సభ్యదేశాల రక్షణ మంత్రుల సదస్సులో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. పాక్ ప్రేరేపిత సీమాంతర ఉగ్రవాదం, పహల్గాం ముష్కర దాడులను ప్రస్తావించకపోవడంపై తీవ్రంగా పరిగణించిన భారత్.. ఉమ్మడి ప్రకటనపై సంతకం చేసేందుకు నిరాకరించింది. దీంతో ఎలాంటి ఉమ్మడి ప్రకటన లేకుండానే నాటి చర్చలు ముగిశాయి.

అనంతరం జులైలో జరిగిన విదేశాంగ మంత్రుల సదస్సులో భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పాల్గొన్న సంగతి తెలిసిందే. మరోవైపు భారత్‌పై సుంకాలు విధించిన ట్రంప్.. రష్యాతో ముడిచమురు కొనుగోలును తీవ్రంగా వ్యతిరేకిన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని విధిస్తామంటూ హెచ్చరిస్తున్నారు. ఇదే సమయంలో రష్యా మాత్రం భారత్‌కు మద్దతుగా నిలుస్తోంది. ఇదే సదస్సులో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మోదీ భేటీ అయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ తాజా పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.




## డీకే శివకుమార్‌తో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి భేటీ..

హైదరాబాద్ : కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హోటల్లో.. ఇరువురు భేటీ అయ్యారు. రాజగోపాల్ రెడ్డి, డీకే శివకుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. అయితే తాజాగా రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.

మంత్రి పదవి ఇస్తానంటేనే కాంగ్రెస్‌లోకి వచ్చా అని తెలిపారు. కాంగ్రెస్‌లో తనని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భువనగిరి ఎంపీని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ పెద్దలు చెప్పారని కుండబద్దలు కొట్టారు. ప్రజల కోసం మరోసారి పదవీ త్యాగానికైనా రెడీ అని సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే గత కొన్నిరోజులుగా.. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీపై రాజగోపాల్ రెడ్డి అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో డీకే శివకుమార్, రాజగోపాల్ రెడ్డిల భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే రేపు డీకే శివకుమార్, సీఎం రేవంత్ రెడ్డిని కలవనున్నట్లు సమాచారం.



## నిర్మలా సీతారామన్‌కు మంత్రి తుమ్మల విజ్ఞప్తి..

ఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకం తగ్గింపుపై పునరాలోచన చేయాలని నిర్మలా సీతారామన్‌ను కోరినట్లు మంత్రి తెలిపారు. ముడి పామాయిల్‌పై 2018లో 44 శాతం ఉన్న దిగుమతి సుంకాన్ని 27 శాతం వరకు తగ్గిస్తూ.. వచ్చారని మంత్రి తుమ్మల వివరించారు. ఇటీవల 27.5 శాతం నుంచి 16.5 శాతానికి సుంకం తగ్గించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సుంకాల తగ్గింపు ప్రభావం తెలంగాణ ఆయిల్ పామ్ రైతులపై తీవ్రంగా పడుతుందని చెప్పుకొచ్చారు. దేశంలో అత్యధికంగా తెలంగాణలో 78,870 హెక్టార్లలో ఆయిల్ ఫామ్ సాగవుతోందని మంత్రి తుమ్మల తెలిపారు. 56,231 మంది రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని చెప్పారు. ఈ ఏడాది మరో 50 వేల హెక్టార్లలో ఆయిల్ ఫామ్ సాగుకు 18,185 మంది రైతులు ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని వివరించారు. తిరిగి 44 శాతం దిగుమతి సుంకం విధించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.




ఢిల్లీ: ప్రధాని మోదీ, భాజపా నేతలు బీసీ రిజర్వేషన్ బిల్లులను అడ్డుకొని బలహీనవర్గాలకు అన్యాయం చేస్తున్నారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు ఇస్తామంటే గుజరాత్ వారికి కడుపుమంట ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేశారు. దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన బీసీ ధర్నాలో సీఎం మాట్లాడారు. గల్లీలో ఉండలేక దిల్లీలోనే తేల్చుకుందామని 'చలో దిల్లీ' చేపట్టామని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఎలాగైనా సాధిస్తామన్నారు.

దిల్లీలో ధర్నాకు వంద మంది ఎంపీలు, ఇండియా కూటమి పార్టీలు మద్దతు ఇచ్చాయన్నారు. "బీసీ రిజర్వేషన్ల కోసం 4 కోట్ల మంది ముక్త కంఠంతో విజ్ఞప్తి చేశారు. జంతర్ మంతర్ వేదికగా మోదీ, ఎన్డీయేకు సవాల్ విసురుతున్నా. మా డిమాండ్‌ను ఆమోదిస్తారా? మిమ్మల్ని గద్దె దించాలా? మా ఆలోచనలు, బిల్లులను తుంగలో తొక్కే అధికారం మీకు ఎవరిచ్చారు? మోదీ మన బద్ధశత్రువు.. బలహీనవర్గాలకు న్యాయం చేసే ఆలోచన ఆయనకు లేదు.

ఆయన మోచేతి నీళ్లు తాగే కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రామచంద్రరావుకు ఏమైంది? తెలంగాణలో మీరు బలహీనవర్గాలను ఓట్లు అడగలేదా? ప్రజలతో మీ అవసరం తీరిపోయిందా? పేరు బంధం తెగిన తెరాస (ప్రస్తుతం భారత రాష్ట్ర సమితి).. పేగు బంధం కూడా తెలంగాణతో తెగిందా?"అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

## బీసీ రిజర్వేషన్లతో బీజేపీకి సంబంధం లేదు..

ఢిల్లీ : నగరంలో తెలంగాణ కాంగ్రెస్ నాయకులు చేస్తున్న బీసీ ధర్నాపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. జంతర్‌మంతర్‌లో కాంగ్రెస్ పార్టీ పెట్టుకున్న సభ.. గాంధీ కుటుంబాన్ని పొగడటానికే సరిపోయిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రాజకీయంగా ఎదురవుతున్న ఒత్తిడిని తట్టుకునేందుకు.. గాంధీ కుటుంబం అనుగ్రహం పొందాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ సభ పెట్టుకున్నారని ఆరోపించారు.

**కాంగ్రెస్ పార్టీ దే బాధ్యత..** సీఎం రేవంత్ రెడ్డి 31 నిమిషాల ప్రసంగంలో.. 50 శాతం కంటే ఎక్కువ సమయం రాహుల్, సోనియా జపం చేయడానికే సరిపోయిందని కిషన్ రెడ్డి విమర్శించారు. బీసీ



రిజర్వేషన్లు ఇస్తామని తెలంగాణ ప్రజలకు హామీ ఇచ్చారు.. దాన్ని పూర్తిచేసుకోవాల్సిన బాధ్యత కూడా కాంగ్రెస్ దే అని ఆయన ఉద్ఘాటించారు. అందుకోసం న్యాయపరమైన, చట్టపరమైన అంశాలపై దృష్టిసారించి, చిత్తశుద్ధితో పనిచేయాలని హితవు పలికారు.

**కామారెడ్డి డిక్లరేషన్ సంగతేంటి..** కాంగ్రెస్ ప్రభుత్వం అది చేయలేక.. బట్టకాల్చి బీజేపీ మీద వేస్తామంటే చూస్తు ఊరుకోమని కిషన్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. చట్టపరమైన, న్యాయపరమైన ప్రణాళిక లేకుండా.. కామారెడ్డి డిక్లరేషన్‌ను రాహుల్ గాంధీ ప్రకటించారని గుర్తు చేశారు. 18 నెలలు గడుస్తున్న సీఎం రేవంత్ రెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొన్న అంశాల అమలు ఊసెత్తడం లేదని ఆయన ప్రశ్నించారు.

# దళిత ఓటు ఎటు ఉంటే... అతడే...

# బీహార్ కా బాద్‌షా!






## బీహార్‌ను డిసైడ్ చేసే దళిత ఓటు బ్యాంకు: సర్వేలో సంచలన విషయాలు..!!

త్వరలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం ఇప్పటికే అన్ని పార్టీలు సమాయత్తమయ్యాయి. ప్రధాని మోదీ కొద్ది రోజుల క్రితం బీహార్‌లో పర్యటించి ఎన్నికల వేడిని మరింత పెంచారు. ఇక అక్కడి స్థానిక జాతీయ పార్టీలు కూడా మాటల యుద్ధానికి దిగాయి.ఇక సందులో సడేమియా అన్నట్లుగా సర్వేలు కూడా తమ అభిప్రాయాలను వెల్లడిస్తున్నాయి. బీహార్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందు విడుదలైన తాజా సర్వే నివేదిక సంచలనం సృష్టిస్తోంది. రాష్ట్రంలోని దళిత ఓటర్లలో 27.4% మందికి భారత ఎన్నికల సంఘంపై "నమ్మకం లేదని" ఈ సర్వే వెల్లడించింది. అంతేకాదు, షెడ్యూల్డ్ కులాల ఓటర్లలో 58% మందికి పైగా రాబోయే ఎన్నికల్లో "నిరుద్యోగమే" తమకు అతిపెద్ద సమస్యగా భావిస్తున్నారని స్పష్టం చేసింది.

**సర్వే నేపథ్యం, వివరాలు:** దేశవ్యాప్తంగా వందలాది దళిత, ఆదివాసీ సంఘాల సమాఖ్య అయిన నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ దళిత అండ్ ఆదివాసీ అసోసియేషన్స్ ఈ సమగ్ర సర్వేను నిర్వహించి విడుదల చేసింది. NACDAOR చైర్మన్ అశోక్ భారతి ప్రముఖ జాతీయ ఆంగ్ల పత్రిక 'ది హిందూ'కు ఇచ్చిన వివరాల ప్రకారం, జూన్ 10 నుండి జూలై 4 మధ్య రాష్ట్రవ్యాప్తంగా 18,581 మంది SC ఓటర్లను నేరుగా సంప్రదించి ఈ సర్వేను చేపట్టారు. కాగా, 2022 బీహార్ కుల సర్వే ప్రకారం, రాష్ట్ర జనాభాలో 19.65% మంది షెడ్యూల్డ్ కులాలకు చెందినవారే.

**ఓటు హక్కుపై భయం,ఈసీ విశ్వసనీయతపై అనుమానాలు:** సర్వే జరుగుతున్న సమయంలోనే ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ప్రారంభించడంతో, మధ్యలో ఒక కొత్త ప్రశ్నను జోడించాల్సి వచ్చిందని భారతి వివరించారు. ఈ ప్రశ్నకు సుమారు 8,500 మంది మాత్రమే స్పందించగలిగారు. "కొత్త ఓటర్ల జాబితాలో మీ ఓటును కోల్పోతారని మీరు భయపడుతున్నారా?" అనే ప్రశ్నకు, 71% మంది 'అవును' అని బదులివ్వడం గమనార్హం. కేవలం 23.4% మంది మాత్రమే 'లేదు' అని చెప్పగా, 5% మంది తమ అభిప్రాయాన్ని వెల్లడించలేదు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరిస్తుందా అనే సాధారణ ప్రశ్నకు, 27% మందికి పైగా 'లేదు' అని, సుమారు 51% మంది 'అవును' అని, మిగిలిన 21% మంది 'తెలియదు' అని సమాధానం ఇచ్చారు. ఈ ఫలితాలు ఎన్నికల ప్రక్రియపై దళిత సమాజంలో నెలకొన్న విశ్వాస లోపాన్ని ప్రతిబింబిస్తున్నాయి.

**రాజకీయ నాయకుల ప్రాధాన్యతలు,కులగణన ఘనత:** ఈ సర్వేలో "తమకు ఇష్టమైన జాతీయ,రాష్ట్ర స్థాయి రాజకీయ నాయకులు ఎవరు?","ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ పనితీరు ఎలా ఉంది?", "ఇప్పుడు జరగనున్న కుల గణన ఘనత ఎవరికి దక్కుతుంది?" వంటి 11 కీలక ప్రశ్నలు అడిగారు. జాతీయ స్థాయిలో, 47.5% మంది ప్రధాని నరేంద్ర మోడీ తమకు ఇష్టమైన నాయకుడని పేర్కొనగా, 40.3% మంది ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని, సుమారు 12% మంది ఇతర రాజకీయ నాయకులను ఎంచుకున్నారు. కుల గణన ఘనత విషయానికి వస్తే, 33.15% మంది నరేంద్ర మోడీకి, 30.81% మంది రాహుల్ గాంధీకి, 27.57% మంది బీహార్ ప్రతిపక్ష నాయకుడు తేజస్వి యాదవ్‌కు ఆ ఘనత దక్కుతుందని అభిప్రాయపడ్డారు. నితీష్ కుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం పనితీరును సుమారు 48% మంది "బాగాలేదు" అని చెప్పగా, 45% మంది "మంచి" అని పేర్కొన్నారు.

**"దళితులచే,దళితుల కోసం" నిర్వహించిన సర్వే:** "చాలామంది షెడ్యూల్డ్ కులాలపై సర్వేలు చేస్తారు, కానీ చాలా తక్కువమంది మాత్రమే నిజంగా మాతో నేరుగా మాట్లాడతారు. ఈ సర్వే దళితుల కోసం, దళితులచే చేయబడింది," అని అశోక్ భారతి గట్టిగా నొక్కి చెప్పారు. బీహార్‌లోని కోసి, మిథిలాంచల్, సీమాంచల్, భోజ్‌పూర్, చంపారన్, మగధ్ పటాలిపుత్ర అనే ఆరు ప్రాంతాల్లో విస్తరించి ఉన్న సుమారు 49 అసెంబ్లీ నియోజకవర్గాల్లో SC ఓటర్లతో నేరుగా మాట్లాడేందుకు తమ ఎన్యూమరేటర్‌లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామని ఆయన వివరించారు. NACDAOR ఈ సర్వేను రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ 'ది కన్వర్జెంట్ మీడియా' సహకారంతో నిర్వహించింది. ఇది వారు విడుదల చేసిన రెండవ సర్వే. ఈ సంవత్సరం ప్రారంభంలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కూడా వారు ఇదే తరహా సర్వేను నిర్వహించారు.



# అందువల్లే మోదీ ట్రంప్ వ్యాఖ్యలకు అడ్డు చెప్పట్లేదు: రాహుల్

భారత్‌పై గణనీయంగా టారిఫ్‌లు పెంచుతానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులకు దిగిన సంగతి తెలిసిందే. వీటిపై ప్రధాని మోదీ మౌనంగా ఉండటంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. ఈసందర్భంగా మోదీ చేతులు కట్టేశారంటూ ఎద్దేవా చేశారు. అమెరికాలో అదానీపై విచారణ జరుగుతుంది కాబట్టి.. టారిఫ్‌లపై ట్రంప్ పదేపదే బెదిరింపులకు పాల్పడినా మోదీ మౌనంగా ఉండిపోయారని రాహుల్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ విషయాన్ని దేశ ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. మోదీ, %బూా% (అదానీ, అంబానీలను ఉద్దేశిస్తూ), రష్యా చమురు ఒప్పందాల ఆర్థిక వ్యవహారాలు బయటపడతాయని వ్యాఖ్యానించారు. మోదీ చేతులు కట్టేశారంటూ విమర్శించారు. రష్యాతో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తుండటంతో భారత్‌పై ట్రంప్ మండిపడుతున్నారు. ఇప్పటికే 25శాతం సుంకాలతో పాటు పెనాల్టీలు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈక్రమంలోనే భారత్ మంచి భాగస్వామి కాదంటూ టారిఫ్‌లను గణనీయంగా పెంచుతానని మరోసారి హెచ్చరికలు చేశారు. అయితే, ఆయన వ్యాఖ్యలను భారత్ తిప్పికొట్టింది. అమెరికా కూడా మాస్కో నుంచి దిగుమతులు చేసుకుంటున్న విషయాన్ని గుర్తుచేసింది. రసాయనాలు, ఎరువులు వంటివి కొనుగోలు చేస్తోందని దుయ్యబట్టింది. అలాంటప్పుడు భారత్‌ను లక్ష్యంగా చేసుకోవడం అసంబద్ధం అని స్పష్టంచేసింది. మరోవైపు.. ట్రంప్ హెచ్చరికలపై మోదీ స్పందించకపోవడంపై ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ట్రంప్‌తో మోదీ కౌగిలింతల దౌత్యం కుప్పకూలిందంటూ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు.




దిల్లీ: దేశానికి ఆదర్శంగా నిలిచేలా తెలంగాణలో కులగణన జరిగిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. దేశవ్యాప్తంగా కులగణన జరగాలని భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ డిమాండ్ చేశారని గుర్తు చేశారు. దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరుగుతున్న బీసీ ధర్నాలో రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. "రాహుల్ గాంధీ ఆశయం మేరకు మేం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు తెచ్చాం. విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించాం. అసెంబ్లీ పంపిన బిల్లులు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం పంపిన బిల్లును ఆమోదించాలని రాష్ట్రపతిని కోరుతున్నాం. రాష్ట్రపతిని కలిసి వినతిపత్రం ఇవ్వాలని అపాయింట్‌మెంట్ కోరాం. ఇప్పటి వరకూ రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ దొరకలేదు. మాకు అపాయింట్‌మెంట్ ఇవ్వొద్దని రాష్ట్రపతిపై మోదీ ఒత్తిడి చేశారని మా అనుమానం. బిల్లును ఆమోదించే వరకూ మా పోరాటం కొనసాగుతోంది." అని రేవంత్ స్పష్టం చేశారు.

# రేవంత్‌రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది: సుప్రియా సూలే



దిల్లీ: సీఎం అవుతానని రేవంత్‌రెడ్డి ఎప్పుడూ చెప్పలేదని.. కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని మాత్రమే చెప్పారని ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే అన్నారు. ఒక కార్యకర్త.. జీరో నుంచి సీఎం వరకు ఎదిగారని చెప్పారు. దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్ల అంశంపై చేపట్టిన ధర్నాకు సుప్రియా సూలే, డీఎంకే ఎంపీ కనిమొళి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సుప్రియా సూలే మాట్లాడారు. "వంచితులు, పీడితుల తరఫున రేవంత్‌రెడ్డి పోరాడుతున్నారు. దేశంలో తొలిసారి 69 శాతం రిజర్వేషన్లను కరుణానిధి అమలుచేశారు. అంబేడ్కర్ మాదిరిగానే కరుణానిధి పేరు సువర్ణాక్షరాలతో లిఖిస్తారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో రేవంత్‌రెడ్డి పేరు కూడా చిరస్థాయిగా నిలిచిపోతుంది. కాంగ్రెస్‌తో శరద్‌పవార్‌కు మంచి అనుబంధం ఉంది. కాంగ్రెస్‌కు మా పార్టీ అండగా నిలుస్తుంది" అని సుప్రియా సూలే అన్నారు.




హైదరాబాద్: ముస్లిం రిజర్వేషన్ల కోసమే కాంగ్రెస్ ధర్నా చేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. కామారెడ్డి డిక్లరేషన్ కానే కాదు.. ముమ్మాటికీ ముస్లిం డిక్లరేషనే అని విమర్శించారు. బీసీలకు 5శాతం పెంచి.. ముస్లింలకు అదనంగా 10 శాతం రిజర్వేషన్లు కల్పించే కుట్ర జరుగుతుందన్నారు. బీసీ ముసుగులో ముస్లింలకు 100శాతం రిజర్వేషన్లను అమలు చేసే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ధర్నాకు బీసీల మద్దతు కరవైందని ఎద్దేవా చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తేనే మద్దతిస్తామని స్పష్టం చేశారు. బీసీలకు ఏ పార్టీ ఏం చేసిందో బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఎప్పుడైనా బీసీని ప్రధాని చేశారా అని ప్రశ్నించారు. ఉమ్మడి ఏపీలో 48 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్క బీసీనైనా సీఎం చేశారా? చెప్పాలన్నారు. రాష్ట్ర కేబినెట్‌లో, నామినేటెడ్ పదవులను ఎంతమంది బీసీలకు ఇచ్చారో చర్చిద్దామా అన్నారు. ఎంతమంది బీసీలకు ఎంపీ సీట్లు ఇచ్చారో సమాధానమివ్వగలరా? అని ప్రశ్నించారు.

మీరా.. బీసీల గురించి మాకు నీతులు చెప్పేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీని ప్రధాని చేసిన ఘనత భాజపాదేనన్నారు. 27 మంది బీసీ కేంద్ర మంత్రులను, అనేక రాష్ట్రాలకు బీసీ సీఎంలను నియమించిన ఘనత భాజపాకే దక్కుతుందన్నారు.

కేంద్రంపై నెపం మోపి బీసీ రిజర్వేషన్ల నుంచి తప్పుకోవాలనుకుంటున్న కాంగ్రెస్.. యూపీ, బెంగాల్, బిహార్ తరహాలో తెలంగాణలోనూ కనుమరుగవడం తథ్యమని హెచ్చరించారు.




# అందుకే సోషల్ మీడియాలో వచ్చే విమర్శలపై స్పందించను: చిరంజీవి

సోషల్‌మీడియాలో వచ్చే ట్రోల్స్‌పై తాను మాట్లాడకపోయినా తాను చేసిన మంచి మాట్లాడుతుందని అగ్ర కథానాయకుడు చిరంజీవి అన్నారు. ఫీనిక్స్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో ఏర్పాటుచేసిన బ్లడ్ డొనేషన్ డ్రైవ్‌కు చిరంజీవి, తేజా సజ్జా ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. రక్తదానం గొప్పతనాన్ని వివరించారు. ఒక జర్నలిస్ట్ మూలంగా తనకు బ్లడ్ బ్యాంక్ పెట్టాలనే ఆలోచన వచ్చిందని ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటానని అన్నారు. ఆయన రాసిన ఆర్టికల్ చదివిన తర్వాతే తనకు ఈ ఆలోచన వచ్చిందన్నారు. ఆయనను ఇప్పటివరకూ చూడలేదు కానీ, ఎప్పుడూ గుర్తుచేసుకుంటూనే ఉంటానని అన్నారు. "ఈ అద్భుతమైన కార్యక్రమానికి వచ్చిన అందరికీ కృతజ్ఞతలు. బ్లడ్ డొనేట్ చేసిన వారందరికీ ధన్యవాదాలు. ముఖ్యంగా నా బిడ్డ లాంటి తేజ సజ్జాకు కూడా థాంక్యూ. రక్తదానం అనే పేరు చెప్పగానే నేను గుర్తొస్తున్నానంటే అది నా పూర్వజన్మ పుణ్యం. ఈ సందర్భంగా మీతో ఒక విషయం పంచుకోవాలని అనుకుంటున్నాను. నేను కొన్ని రోజులుగా రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటున్నాను. ఈ మధ్య ఓ నాయకుడు నన్ను అకారణంగా మాటలు అన్నారు. ఆ తర్వాత ఆయన ఓ ప్రాంతానికి వెళ్తే.. అక్కడ ఓ మహిళ ఆయనకు ఎదురుతిరిగింది. 'చిరంజీవిని అన్నన్ని మాటలు అనాలని మీకు ఎందుకు అనిపించింది' అంటూ ఆమె భావోద్వేగానికి గురైంది. ఆ వీడియో చూసి ఆమె గురించి వివరాలు కనుక్కొన్నాను. ఒకప్పుడు చిరంజీవి బ్లడ్‌బ్యాంక్ ద్వారా ఆమె బిడ్డ ప్రాణాలు నిలిచాయని అందుకే నేనంటే ఆమెకు గౌరవమని తెలిపింది. ఆ మాటలు విని నా హృదయం ఉప్పొంగింది". "సోషల్ మీడియాలో వచ్చే విమర్శలపై ఎందుకు స్పందించరు అని అందరూ అడుగుతారు. నేనెప్పుడూ స్పందించను. ఎందుకంటే నేను చేసిన మంచి కార్యక్రమాలు, నాపై అభిమానుల ప్రేమే నాకు రక్షణ కవచాలు. నేను మాట్లాడాల్సిన అవసరం లేదు. నా మంచితనమే మాట్లాడుతుంది. ఇది సత్యం. ఆ మహిళ మాట్లాడిన తర్వాత సదరు రాజకీయ నాయకుడు ఎక్కడా నా గురించి తప్పుగా మాట్లాడలేదు. వాళ్లకు కూడా మనసు ఉంటుంది కదా. ఆ క్షణంలో కోపంలో నన్ను తిట్టినా.. ఇంటికి వెళ్లాక వాళ్ల భార్య అయినా మరోసారి ఇలా మాట్లాడొద్దు అని చెబుతుంది" అని చెప్పారు. "మనం మాట్లాడాల్సిన అవసరం లేదు. మనల్ని ఎవరైనా మాటలు అంటే మన మంచే సమాధానం చెబుతుంది. అందుకే నేను ఎప్పుడూ దేనికీ స్పందించను. అంత అవసరం కూడా నాకు లేదు. మంచి చేసుకుంటూ వెళ్తాను. నాలాగా మంచి చేసే నా తమ్ముళ్లకు సాయంగా ఉంటాను. ఇతర దేశాల్లో ఉన్న అభిమానులు కూడా నా మాటను స్ఫూర్తిగా తీసుకొని రక్తదానం చేస్తున్నారు. నా పేరును మరింత ముందుకు తీసుకువెళ్తున్నారు. వాళ్లందరికీ అభినందనలు" అని చిరంజీవి తెలిపారు.




అమెరికాలో చదవాలని కలలుగన్న విద్యార్థులు.. ఎందుకు అగ్రరాజ్యాన్ని ఎంచుకున్నామురా బాబు అనే స్థాయిలో కొత్త నిబంధనలు వారి సహనాన్ని పరీక్షిస్తున్నాయి. తాజాగా ఉన్నత విద్య కోసం అక్కడి ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో అడ్మిషన్ తీసుకొన్న అంతర్జాతీయ విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సరికొత్త నిబంధనల కారణంగా వారికి వీసాల జారీలో తీవ్ర జాప్యం చోటుచేసుకొంది. దీంతో ఇప్పటికే విద్యా సంవత్సరం ప్రారంభమైనా తాము తరగతులకు వెళ్లలేకపోతుండటంతో పలువురు విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. వీసా అపాయింట్‌మెంట్ల నిలిపివేతను జూన్ మధ్యలోనే తొలగించారు. నెల రోజులు దాటినా ఈ ప్రక్రియ వేగంగా జరగడం లేదు. దీంతో వేల మంది విద్యార్థులు ఈ జాప్యం, అదనపు పరిశీలనలు, తిరస్కరణలతో పోరాడాల్సి వస్తోంది. ఈ ప్రభావం అమెరికా విద్యావ్యవస్థ పైనా ప్రతికూలంగా పడుతోంది. అక్కడి విశ్వవిద్యాల యాల బడ్జెట్లు, ఉన్నత విద్యాకేంద్రం అమెరికా ఇమేజ్ కూడా దెబ్బతింటోంది. అమెరికాలోని అరిజోనా స్టేట్ యూనివర్శిటీలో దాదాపు 1,000 మంది అంతర్జాతీయ విద్యార్థులకు వీసాలు రాలేదు. ఈ విషయాన్ని దాని ప్రెసిడెంట్ మైఖేల్ క్రో వెల్లడించారు. దీంతో విశ్వవిద్యాలయంపై మిలియన్ల కొద్దీ డాలర్ల మేరకు ప్రభావం పడనుంది. దక్షిణ కాలిఫోర్నియాలోని ఫుర్మాన్ యూనివర్శిటీలో ఈ ఏడాది 562 మంది మాత్రమే కొత్త విద్యార్థులు నమోదు చేసుకొన్నారు. గతేడాది ఇక్కడ 613 మంది నమోదయ్యారు. వీసా ఇబ్బందులే దీనికి కారణంగా గుర్తించారు. ఇక జూన్‌లో వీసా ఇంటర్వ్యూలు పునః ప్రారంభించినా.. అవి అస్తవ్యస్తంగా మొదలయ్యాయి. భారత్, చైనా విద్యార్థులకు వీసాల మంజూరులో ఏడు రెట్ల వ్యత్యాసం ఉన్నట్లు ఓ టాప్ యూనివర్శిటీ అధికారి పేర్కొన్నారు. కేవలం 100 మంది వరకు అంతర్జాతీయ విద్యార్థులు నమోదు చేసుకొనే చిన్న కాలేజీలపై కూడా ఈ ప్రభావం పడుతోంది. ఇలాంటి ఓ కళాశాలలో 10మంది విద్యార్థులకు వీసాలు ఇంకా లభించకపోగా.. ఇద్దరికి తీవ్ర జాప్యం జరిగింది. ఇక ఎన్ఏఎఫ్ఎస్ఏ (నేషనల్ అసోసియేషన్ ఫర్ ఫారెన్ స్టూడెంట్స్ అడ్వైజర్స్), జేబీ ఇంటర్నేషనల్ పెయింట్ అంచనాల ప్రకారం కొత్తగా వచ్చే అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య ఈసారి 30శాతం వరకు తగ్గవచ్చు. ఇక షోర్‌లైట్ అంచనాల ప్రకారం అమెరికాలో ఉన్న క్యాంపస్‌లకు దీని నుంచి 2.6 బిలియన్ డాలర్ల (రూ.22 వేల కోట్లకుపైగా) ఆదాయం కోల్పోవచ్చని పేర్కొంది.

**అంతర్జాతీయ విద్యార్థుల కోసం బ్యాకప్ ప్లాన్‌లు ఇలా..** అమెరికా వీసా రాక తరగతులకు హాజరుకాలేని వారి కోసం కొన్ని విద్యాసంస్థలు ప్రత్యామ్నాయాలు వెతుకుతున్నాయి. అరిజోనా విశ్వవిద్యాలయం ఇలాంటి వారి కోసం లండన్‌లో క్యాంపస్ నిర్వహిస్తోంది. యూఎస్ నార్త్‌ఈస్టర్న్ విశ్వవిద్యాలయం రిమోట్ లెర్నింగ్ ఆప్షన్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీంతోపాటు టొరెంటో, లండన్ క్యాంపస్‌ల్లో సీట్లను ఆఫర్ చేస్తోంది. ఇక హార్వర్డ్ కెన్నడీ స్కూల్ కూడా తాత్కాలికంగా తమ విద్యార్థులకు యూనివర్శిటీ ఆఫ్ టొరెంటోలోని ముంక్స్ స్కూల్‌లో అవకాశం కల్పించే అంశాన్ని పరిశీలిస్తోంది.

**అమెరికా కాంగ్రెస్ నుంచి ఒత్తిడి..** అమెరికా చట్ట సభ సభ్యుల నుంచి కూడా విదేశాంగశాఖపై ఒత్తిడి పెరిగింది. అంతర్జాతీయ విద్యార్థుల వీసా బ్యాక్‌లాగ్‌లను పరిష్కరించేందుకు ఆ శాఖ ఏం చేస్తోందనే అంశంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

దీంతో తర్వాత తాము నోటీసు వెలువరించేవరకు సరికొత్త విద్యార్థి, ఎక్స్‌ఛేంజీ విజిటర్ వీసాలు చాలా పరిమితంగా ఉన్నట్లు జూన్ 30న విదేశాంగశాఖ వెల్లడించింది. ఇక వీసా షెడ్యూలింగ్ మారుతుంటుందని ఆ శాఖ ప్రతినిధి పేర్కొన్నారు. ట్రంప్ కార్యవర్గం చర్యలతో ఉన్నవిద్యకు బలమైన కేంద్రంగా ఉన్న అమెరికా ఆ స్థానం కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. చాలామంది విద్యార్థులు యూకే, కెనడా, ఆస్ట్రేలియాలోని విశ్వవిద్యాలయాల్లో చేరుతున్నారు.

# మహిళా ఎమ్మెల్యే పట్ల కర్కశంగా వ్యవహరించడం సిగ్గుచేటు: హరీశ్‌రావు

హైదరాబాద్: మొట్టమొదటి మహిళా హోం మంత్రి, సీనియర్ శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరును మాజీమంత్రి హరీశ్‌రావు ఖండించారు. ఇందిరమ్మ రాజ్యం అని గొప్పలు చెప్పుకొంటూ మహిళా సభ్యురాలి పట్ల కర్కశంగా వ్యవహరించడం సిగ్గుచేటని మండిపడ్డారు. రేషన్ కార్డుల విషయంలో ప్రభుత్వాన్ని నిలదీయడమే సబిత చేసిన తప్పా అని ప్రశ్నించారు. మంత్రి సమక్షంలోనే కాంగ్రెస్ నాయకులు వీధి రౌడీలుగా బెదిరింపులకు పాల్పడుతుంటే అడ్డుకోవాల్సిన పోలీసులు వారితో కలిసి మహిళా ఎమ్మెల్యేపై దౌర్జన్యానికి పాల్పడటం దుర్మార్గమని విమర్శించారు. ఆమెపై అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ తాటాకు చప్పుళ్లు, రౌడీ మూకల దాడులకు భారత రాష్ట్ర సమితి భయపడదన్నారు. ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని, ప్రజాక్షేత్రంలో వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని హరీశ్‌రావు తెలిపారు.



హైదరాబాద్: నేషనల్ వాస్క్యులర్ డే సందర్భంగా బేగంటపేటలోని కిమ్స్-సన్ షైన్ ఆసుపత్రుల ఆధ్వర్యంలో వాక్‌థాన్ నిర్వహించారు. 'వాక్ ఏ మైల్ టు లివ్ విత్ ఏ స్మైల్' పేరుతో సంజీవయ్య పార్క్ నుంచి ప్రారంభమైన వాక్‌థాన్‌ను నటుడు రాజీవ్ కనకాల జెండా ఊపి ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో యువతి, యువకులు, వైద్య విద్యార్థులు, వైద్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. భారతదేశంలో వాస్క్యులర్ సమస్యల వల్ల ఏటా సుమారు 25,000 మంది చేతులు, కాళ్లు కోల్పోతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా మధుమేహం ఉన్న రోగులలో ఇది అధికంగా కనిపిస్తుందని, త్వరగా గుర్తించి వైద్యం తీసుకుంటే 80శాతం వరకు నివారించవచ్చని తెలిపారు.



# కొత్త వైద్యులొస్తేనే పాత చిక్కులు తొలిగేది..!

ఖమ్మం : వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులను ఏళ్లుగా నిపుణుల కొరత వేధిస్తోంది. ముఖ్య విభాగాల్లో వైద్యులు లేకపోవడంతో రోగులకు 24గంటల సేవలు లభించడం లేదు. కొన్నిచోట్ల కనీసం డ్యూటీ మెడికల్ ఆఫీసర్లు కూడా లేకపోవడంతో బాధితులు ఇతర ఆస్పత్రులు, ప్రైవేటు క్లినిక్‌లకు వెళ్తూ వ్యయప్రయాసలకు గురవుతున్నారు. అత్యవసర సమయాల్లో చికిత్సలు లభించక రోగుల ప్రాణాలకు ముప్పువాటిల్లుతుంది. ప్రస్తుత జ్వరాల సీజన్లో ఓవైపు డెంగీ కేసులు భయపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో వైద్యవిధాన పరిషత్ ఆసుపత్రుల్లో కాంట్రాక్టు పద్ధతిలో వైద్య నిపుణుల నియామకానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. గతానుభవాల దృష్ట్యా అర్హులు విధుల్లో చేరి, ఖాళీలన్నీ భర్తీ అయితేనే ఇబ్బందులు తొలగే అవకాశం ఉంది.

**ఎక్కడెక్కడ, ఏఏ విభాగాల్లో..**

జిల్లాలో వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు, నేలకొండపల్లి, మధిర, తిరుమలాయపాలెం సామాజిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. అన్నిచోట్లా వైద్యుల కొరత నెలకొంది. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, పీడియాట్రిక్స్, గైనకాలజీ, అనస్తీషియా, ఆప్తాల్మాలజీ, ఈఎన్‌టీ విభాగాల్లో నిపుణులు లేరు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ల పోస్టుల్లో ఖాళీలతో నాడీపట్టే నాథుడు కరవయ్యారు. నిజానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పోల్చితే వీటిలో మెరుగైన సేవలందాలి. జిల్లా ఆసుపత్రిపై భారం పడకుండా ప్రత్యేక నిపుణులు, శస్త్రచికిత్స



వైద్యులు అందుబాటులో ఉండాలి. గ్రామీణుల అవసరాలు తీర్చాలి. ఉన్నత సేవలు అటుంచి సాధారణ జ్వరం, దగ్గు వంటి చిన్నపాటి సమస్యలకూ చికిత్స అందడం లేదు. చిన్నపిల్లలకు సకాలంలో రోగ నిర్ధారణ, చికిత్సలు లభించడం లేదు. స్త్రీ సంబంధిత సమస్యలకు, ప్రసవాలు, గర్భిణులు, తల్లులకు అవసరమైన వైద్యం కోసం జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తుంది. నిపుణుల కొరతతో శస్త్ర చికిత్సలు నిండుకున్నాయి. ఏది ఏమైనా తాత్కాలిక ప్రాతిపదిక స్థానంలో శాశ్వత పద్ధతిలో సిబ్బందిని నియమిస్తే సమస్యకు పూర్తి స్థాయి పరిష్కారం లభిస్తుంది.

**దరఖాస్తులు ఆహ్వానించాం**

డా. రాజశేఖర్‌గౌడ్, టీవీవీపీ ఆస్పత్రుల సమన్వయాధికారి

జిల్లాలోని అన్ని ఆస్పత్రులు ఆరు గైనకాలజీ, మూడు అనస్తీషియా, రెండు ఆప్తాల్మాలజీ, రెండు పీడియాట్రిక్, ఈఎన్‌టీ, జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్‌లో ఒక్కోటి, ఒక సివిల్ సర్జన్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చాం. అర్హులైన వైద్యులు తమ ఒరిజనల్ ధ్రువపత్రాలతో ఈ నెల 6న ఐడీవోసీలోని జిల్లా ఆస్పత్రుల ప్రధాన కార్యాలయంలో ఉదయం 11గంటలకు జరిగే వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు హాజరు కావాలి. ప్రత్యేక నిపుణులకు రూ.లక్ష, సివిల్ అసిస్టెంట్ సర్జన్(ఎంబీబీఎస్)కు రూ.52,351 చొప్పున నెలవారీ వేతనం చెల్లిస్తారు. ఆసక్తి కలిగిన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

# సేవల్లో నాణ్యత భక్తులకు భరోసా

భద్రాచలం : దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి వారి దేవస్థానంలో భక్తులకు ఆన్‌లైన్‌లో పరోక్షంగా.. ఆఫ్‌లైన్ ద్వారా ప్రత్యక్షంగా సేవలు అందుతున్నాయి. ఏడాదికి 24 లక్షల మంది దర్శనానికి వస్తుండగా వార్షిక ఆదాయం సుమారు రూ.80 కోట్లకు చేరింది. ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడంతో రద్దీ బాగానే ఉంటోంది. ఇలాంటి చోట అందించే సేవలకు త్వరలో ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్(ఐఎస్‌ఓ) ధ్రువీకరణ పొందేందుకు అవసరమైన ప్రక్రియ ఆరంభమైంది. ఐఎస్‌ఓ అనేది అంతర్జాతీయ ప్రభుత్వేతర స్వతంత్ర సంస్థ. నాణ్యత, భద్రత, సామర్థ్యం పనితీరును నిర్ధారించేందుకు ఈ సంస్థకు నిపుణులు రూపొందించిన మార్గదర్శకాలు ఉన్నాయి. వాటికి అనుగుణంగా ఉంటేనే ఐఎస్‌ఓ సర్టిఫికెట్‌ను జారీ చేస్తారు. ఇది ఉంటే అదో గొప్పగా పరిగణిస్తారు. ప్రమాణాలు పకడ్బందీగా ఉన్నాయన్న భరోసా ఉంటుంది.

**యాదగిరిగుట్ట తరహాలో...**

సాధారణంగా పెద్దపెద్ద వ్యాపార సంస్థలు, కర్మాగారాలు తమ వినియోగదారుల ఆదరణ పొందేందుకు ఇలాంటివి పొందుతుంటాయి. దేవాదాయశాఖ సైతం తమ భక్తులకు అందించే సేవల విశిష్టతను విశ్వవ్యాప్తం చేసేందుకు ఈ సంస్థ సూచించే ప్రమాణాలను పాటిస్తున్నాయి. ఇప్పటికే యాదగిరి గుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఐఎస్‌ఓ గుర్తింపు వచ్చింది. వేములవాడ రాజన్న ఆలయానికి త్వరలో ఈ సర్టిఫికెట్ కేటాయించే వీలుంది. వారం కిందట ఈ ప్రతినిధులు భద్రాచలం రామాలయాన్ని సదర్శించి కొన్ని సూచనలు చేశారు. అన్నదానం, ప్రసాదాల తయారీ, శేష వస్త్ర దుకాణం, వివిధ కౌంటర్లలో రికార్డుల నిర్వహణతో పాటు పారిశుద్ధ్య చర్యలనూ పరిగణలోకి తీసుకున్నారు. మరోసారి ఈ బృందం వచ్చి సమగ్ర పరిశీలన చేసి సర్టిఫికెట్ కేటాయించనుందని భావిస్తున్నారు.

**హక్కులు.. ఆహార భద్రత**

ఈ దేవస్థానంలోని ధ్రువమూర్తుల చిత్రాలపై రామాలయానికి మే 23న కాపీరైట్స్ లభించాయి. ప్రధాన కోవెలలో సీతారామ లక్ష్మణుల వారి విగ్రహాలు దర్శనమిస్తాయి. ఇందులో అలంకరణ ఛాయాచిత్రం, అలంకరణ లేకుండా మరోచిత్రం ఎక్కువగా ముద్రణలో, జ్ఞాపికల్లో కనిపిస్తుంటాయి. అనుమతి లేకుండా ఎవరైనా ఈ ఫొటోలను ముద్రించినా.. వీటిని వ్యాపారం కోసం విక్రయించినా చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు రామాలయానికి హక్కులు వచ్చాయి. ప్రసాదాలు, అన్నదాన విభాగాలపై మరింత పారదర్శకత ఉండేందుకు ఫుడ్ సేఫ్టీ ధ్రువీకరణను పొందారు.

**కాగిత రహిత పాలన దిశగా...**

భక్తుల సౌకర్యం కోసం ఆన్‌లైన్‌తో పాటు డిజిటల్ సేవలు అందిస్తున్నారు. అలాగే కార్యాలయ నిర్వహణలోనూ కాగిత రహిత పాలనలో భాగంగా వేగంగా దస్త్రాల పరిష్కారానికి 'ఈ-ఆఫీస్' వ్యవస్థను అమల్లోకి తెచ్చారు. ఇది పూర్తిగా కార్యాలయ వ్యవహారాలకు సంబంధించిన పారదర్శకతను చాటేందుకు ఏర్పాటు చేసిన ప్రక్రియ. ఇందులో మొదటగా అకౌంట్స్ విభాగంలో ఈనెల 1న ఆన్‌లైన్ ప్రారంభమైంది. ఇలా మరో పది విభాగాల్లో ఆన్‌లైన్ అమలు చేయనున్నారు. ఇందుకు కార్యాలయంలో ఉన్న కంప్యూటర్లు సరిపోవు. మరో 20 కొనేందుకు రూ.15 లక్షలు అవసరమని అంచనా. కంప్యూటర్ పరిజ్ఞానం లేని సిబ్బందికి శిక్షణ ఇచ్చే వీలుందని ఆలయ వర్గాలు తెలిపాయి.

# ఆయకట్టు కన్నీరు..!



సూర్యాపేట : సగం కూడా నిండని ఈ జలాశయం మద్దిరాలలోని మార్కమ్మ చెరువు. 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ వనరు 80 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందిస్తుంది. ఇటీవల కురిసిన వానలకు ఆశించిన మేర వరద చేరలేదు. బోర్లు, బావులపై ఆధారపడి వరిసాగు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. వానాకాలం 122 రోజుల్లో 64 రోజులు కరిగిపోయాయి. ఈమధ్య కాలంలో జిల్లా వ్యాప్తంగా సగటున 16 రోజుల వర్షమే కురిసింది. నేటికీ వాగులు, వంకలు పొంగిపొర్లేలా వాన కురవకపోవడంతో చిన్ననీటి వనరుల్లోకి ఆశించిన మేర నీరు రాలేదు. దీంతో ఆయకట్టులోని చాలా మంది రైతులు సాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. బోర్లు, బావుల ఆధారమున్న కర్షకులు మాత్రమే నాట్లు వేస్తున్నారు. ఆగస్టు చివరి వారం వరకు నాట్లు వేసే అవకాశం ఉంది. భారీ వర్షాలు కురిసి వనరులు నిండి మత్తళ్లు పోసినప్పుడే ఆయకట్టు రెండు పంటలకు పుష్కలంగా సాగునీరందుతుందని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అప్పుడే చేపల పెంపకానికి అనుకూలంగా ఉంటుందని... వర్షాభావ పరిస్థితులు ఎదురైతే తమకు ఉపాధి కష్టతరంగా మారుతుందని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**సగం కూడా నిండలే**

తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ(టీజీడీపీఎస్) వివరాల ప్రకారం జూన్ 1 నుంచి ఆదివారం నాటికి జిల్లా వ్యాప్తంగా 271.3 మిల్లీమీటర్ల సగటు సాధారణ వర్షపాతానికి 220 మి.మీ. కురిసి సాధారణ వర్షపాతం నమోదైంది. నీటిపారుదలశాఖ అధికారులు చెప్పిన లెక్కల ప్రకారం 60 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే 1,225 చెరువుల్లో 947 వనరులు 0-50శాతం, 274 చెరువులు 50-100శాతం మేర నిండాయి. నాలుగు మాత్రమే అలుగు పారుతున్నాయి.

16 రోజుల పాటు కురిసిన వర్షాలకు 23 మండలాల్లో మోతె మండలంలో సాధారణం 213.4 మి.మీ.కుగాను 270.8 మి.మీ.తో అధిక వర్షపాతం నమోదైంది. 11 మండలాల్లో సాధారణ సగటు వర్షపాతం నమోదు కాగా 11 మండలాల్లో లోటు నమోదైంది.

జిల్లా వ్యాప్తంగా 4.82 లక్షల ఎకరాల్లో వరిసాగు అవుతుందని వ్యవసాయాధికారుల అంచనా. ప్రస్తుతానికి 2.70 లక్షల ఎకరాల్లో నాట్లు వేశారు. ఇంకా సమయం ఉండటంతో మరో లక్ష ఎకరాల్లో నాట్లు పడే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.


**తప్పని ఆందోళన**

వర్షాలు ముఖం చాటేయడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల వర్షాలతో చెరువుల్లోకి కొంత మేర వరద వచ్చింది. దీంతో బావులు, బోర్లలో భూగర్భ జలాల వృద్ధికి దోహదపడుతున్నా.. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులతో ఆందోళన మొదలైంది.

**ఎన్ఎస్పీ నీటితోనే సాగు**

ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో ఎన్ఎస్పీ ప్రాజెక్టు పంటలకు జీవం పోసింది. రైతులందరూ దానిపై ఆధారపడి నాట్లు వేస్తున్నారు. ఆ నీటిని విడుదల చేయకుంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవాళ్లం. వర్షాలు కురిస్తేనే అన్నదాతలకు ప్రయోజనం.

# చలానా అధికారికం.. ఖర్చులు అ'ధనం'



సూర్యాపేట :సూర్యాపేట నియోజకవర్గంలోని ఓ తహసీల్ కార్యాలయంలో ఇటీవల తండ్రి పేరిట ఉన్న రెండు ఎకరాల వ్యవసాయ భూమిని తన కుమార్తెకు తెలియకుండా కుమారుడి పేరిట పట్టా చేయించాడు. నిబంధనల ప్రకారం ఫ్యామిలీ సర్టిఫికెట్‌తో పాటు కుటుంబ సభ్యుల సంతకాలతో కుమారుడికి గిఫ్ట్ డీడ్(వారసత్వం) కింద పట్టా చేయాల్సి ఉంది. కుమార్తె ప్రేమ వివాహం చేసుకుని వెళ్లిపోవడంతో ఈ వ్యవహారాన్ని మధ్యవర్తి ద్వారా గుట్టు చప్పుడు కాకుండా పట్టా చేయించాడు. అందుకు ఎకరానికి రూ.10 వేల చొప్పున వసూలు చేసినట్లు సమాచారం. వ్యవసాయ భూములకు సంబంధించి తహసీల్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లకు వసూళ్ల పర్వం జోరుగా సాగుతోంది. ప్రస్తుతం స్లాట్ విధానంలో రిజిస్ట్రేషన్‌కు ఒక రోజు ముందే బుక్ చేసుకోవాల్సి ఉంది. నిర్దేశిత సమయం మేరకు తహసీల్ కార్యాలయానికి చేరుకున్నట్లయితే రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. కార్యాలయం, స్లాట్ బుక్ విధానం తదితర ఖర్చుల పేరిట రూ.వెయ్యి నుంచి రూ.3 వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇందులో మధ్యవర్తిది ప్రధాన పాత్ర.

**రిజిస్ట్రేషన్లకు వసూళ్ల పర్వం**

జిల్లాలో 23 మండలాలు ఉండగా అందులో రోజుకు 70 నుంచి 80 వరకు భూ క్రయ విక్రయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. అందులో ఆన్‌లైన్‌లో చలానా చెల్లించినా ఆపరేటర్లు చేసే వసూళ్లలో ఉన్నతాధికారులకూ వాటాలు ఉంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్ని కార్యాలయాల్లో స్లాట్ బుక్ చేస్తే సాయంత్రం వరకు వేచి ఉండాల్సి వస్తోంది. అధికారులు క్షేత్రస్థాయిలో భూమిని పరిశీలించకుండానే రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల తహసీల్ కార్యాలయాల తనిఖీలు, ఏసీబీ దాడుల నేపథ్యంలో ఈ తతంగం మరింత గోప్యంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది.

**సమస్యలతో మరింత జాప్యం**

జిల్లా అంతట కూడా పాస్ పుస్తకం ముద్రించే ప్రింటర్లు చెడిపోయాయి. అర్వపల్లిలో మాత్రమే పని చేస్తుంది. ఇక్కడ రిజిస్ట్రేషన్ చేస్తున్నారే కాని పట్టా పుస్తకంలో ప్రింట్ మాత్రం ఇవ్వటం లేదు.

నేరేడుచర్ల తహసీల్ కార్యాలయంలో పట్టాదారు పాస్‌బుక్ ప్రింటర్ మరమ్మతులకు తీసుకువెళ్లి ఏడాది దాటినా ఇంతవరకు తిరిగి రాలేదు. జులై నెలలో 128 మంది స్లాట్‌లు బుక్ చేసుకోగా 125 మంది రిజిస్ట్రేషన్లు పూర్తి కాగా మూడింటికి వారు రాక ఆగాయి.

**చర్యలు తీసుకుంటాం**తహసీల్ కార్యాలయాల్లో భూ రిజిస్ట్రేషన్లకు అదనంగా వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. బాధితులు లిఖిత పూర్వకంగా ఆధారాలతో ఫిర్యాదు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. రాంబాబు, అదనపు కలెక్టర్, సూర్యాపేట

# సర్వేకు సర్వర్ చిక్కులు!




నకిరేకల్: జిల్లాలో విస్తృతంగా అమలైన స్వచ్ఛ భారత్ కార్యక్రమాలపై పౌరుల అభిప్రాయాలు సేకరించే కేంద్ర ప్రభుత్వ ఫీడ్‌బ్యాక్ సర్వే సర్వర్ చిక్కులతో ముగిసింది. పది రోజుల నుంచి మండల, గ్రామ స్థాయిల్లో అధికారులు, సిబ్బంది 'స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ-25' ఫీడ్‌బ్యాక్ సర్వే యాప్‌ను స్థానికుల చరవాణుల్లో డౌన్‌లోడ్ చేయించి వారు సర్వేలో భాగస్వాములయ్యేలా చేశారు. సర్వర్ సమస్యలతో నెట్‌వర్క్ ఎర్రర్ రావడంతో దీనిలో ఎక్కువ మంది పాల్గొనలేకపోయారు.

**20 శాతం మందితోనే ముగింపు**

పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, ఉపాధి క్షేత్ర సహాయకులు, అంగన్‌వాడీ టీచర్లు ప్రతి గ్రామంలో 150 మంది స్థానికుల చరవాణిల్లో యాప్ డౌన్‌లోడ్ చేయించి ప్రశ్నలకు సమాధానాలు నమోదు చేయించాలని లక్ష్యంగా విధించారు. ఉదయం 7 నుంచి 9, రాత్రి 7 గంటల తర్వాతే యాప్ ఓపెన్ కావడంతో జిల్లాలో 20 శాతం మందే సర్వేలో పాల్గొనడం గమనార్హం. ఎక్కువ మంది దీనిలో పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు అందిస్తే స్వచ్ఛభారత్ కార్యక్రమాలను మరింత పటిష్ఠంగా అమలు చేసి మార్పులు చేర్పులకు వీలుంటుంది.

**అడిగిన అంశాలు ఇవీ..**

గ్రామంలో అన్ని ఇళ్లకు మరుగుదొడ్లు ఉన్నాయా.

బహిరంగ మల విసర్జన ఉందా.

మరుగుదొడ్ల మలాన్ని కాల్వలు, నాలా, నది, చెరువుల్లోకి మళ్లిస్తున్నారా.

ఘన వ్యర్థాల రవాణా

ఇంటింటికి రోజు చెత్త సేకరిస్తున్నారా.

?గ్రామం మొత్తంలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై మీ అభిప్రాయం.

మురుగు నీటిని తరలించడానికి ఉన్న ఏర్పాట్లు.

చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేసే ప్రాంతాలు

వ్యర్థాలు దహనం చేసిన ఘటనలు.

ఐదేళ్లలో పారిశుద్ధ్య పరిస్థితుల్లో మీరు గమనించిన మార్పు.

గ్రామంలో చేపట్టిన చర్యలపై సంతృప్తిగా ఉన్నారా

భవిష్యత్‌లో చేపట్టాల్సిన చర్యలు.

జిల్లాలో 868 గ్రామ పంచాయతీల్లో 1,30,200 మందితో యాప్ డౌన్‌లోడ్ చేయించి వారి నుంచి అభిప్రాయాలు నమోదు చేయించాలన్నది లక్ష్యం. సర్వే ముగియగా.. 26,468 (20.32 శాతం) మంది నుంచి మాత్రమే అభిప్రాయాలు సేకరించారు. సర్వర్ సమస్యలతోనే సర్వేలో ఎక్కువ మంది నుంచి ఫీడ్‌బ్యాక్ రాబట్టలేకపోయామని స్వచ్ఛభారత్ మిషన్ అధికారి ఒకరు వివరించారు.

# కంట పడితే కటకటాలే!

తూప్రాన్: నేరాల నియంత్రణలో భాగంగా తూప్రాన్‌లో తొలిసారిగా ఏఐ కెమెరాలు ఏర్పాటు చేశారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా పట్టణంలో ఒక్కోదానికి రూ. 1.50 లక్షలు వెచ్చించి తొమ్మిది కెమెరాలను బిగించారు. పట్టణంలోని ప్రధాన చౌరస్తాలు, ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకునే ప్రాంతాల్లో వినియోగంలోకి తీసుకొచ్చారు. పురపాలిక నిధులు రూ.6 లక్షలు, కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా రూ. 7.50 లక్షలు నిధులు సమీకరించారు. త్వరలోనే జిల్లాలోని మరిన్ని పట్టణాల్లో వీటిని ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. గతంలోనూ తూప్రాన్ పట్టణంలోని పలు కాలనీల్లో సుమారు రూ.2 కోట్లతో వివిధ రకాల కెమెరాలను ఏర్పాటు చేయగా ప్రస్తుతం వినియోగంలో ఉన్నాయి.

**తప్పించుకునే అవకాశమే లేదు**



ఏఐ కెమెరాలు వాహనాల నంబర్ ప్లేట్లలోని సంఖ్యను స్పష్టంగా(చీకట్లో అయినా కూడా) కనిపెడుతోంది. నంబరు కొడితే వాహనం ఆ కెమెరాలో ఎన్నిసార్లు నిక్షిప్తం అయిందో కూడా పసిగడుతోంది. ఎంత మంది ప్రయాణిస్తున్నారో గుర్తిస్తోంది. ఫలితంగా ప్రమాదాలు చోటుచేసుకున్న సమయంలో నిందితులు తప్పించుకునే అవకాశమే లేదు. మొదట్లో తూప్రాన్‌లో ఏర్పాటు చేసిన నాలుగు కెమెరాల పనితీరు బాగుండటంతో నూతనంగా నర్సాపూర్ చౌరస్తా, పోతరాజ్‌పల్లి కమాన్, నాగులపల్లి వంతెనతో పాటు రెండు ప్రధాన కూడళ్ల వద్ద వీటిని అమర్చారు.

**నిరంతర పర్యవేక్షణ: శివానందం, ఎస్సై, తూప్రాన్**

కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఏఐ కెమెరాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నాం. మొదటగా తూప్రాన్‌లో నాలుగు కెమెరాలు ఏర్పాటు చేశాం. ఫలితం కనిపించడంతో దాతల సహాయంతో మరో అయిదు అమర్చాం. నిర్వహణకు ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించాం. నిరంతరం పర్యవేక్షణ చేస్తూ నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం.

# దండిగా నిధులు.. అడుగుపడని పనులు

సంగారెడ్డి : అందోలు-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో 25 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో ఒక్క కేంద్రానికి మాత్రమే సొంత భవనం ఉంది. మిగతా చోట్ల అద్దె గదుల్లో నిర్వహణ ఇబ్బందిగా మారింది. కంది మండలం వడ్డెనగూడ తండా, ఎర్దనూర్ తండా, బేగంపేట గ్రామ గ్రామపంచాయతీలకు సొంత భవనాలు లేవు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాల్లోని గదుల్లో వీటిని నిర్వహిస్తున్నారు. ఉపాధి పథకం ద్వారా రూ.10.36 కోట్లు మంజూరు

గ్రామపంచాయతీలు, అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ఏడాది రూ.10.36 కోట్ల ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు చేసింది. నిధులొచ్చి రెండు నెలలైనా జిల్లాలో ఎక్కడా పనులు ప్రారంభం కాలేదు. స్థలాలు గుర్తించి వెంటనే పనులు ప్రారంభించాల్సి ఉండగా ఆ దిశగా అడుగులు పడటం లేదు. ఒక్కో పంచాయతీ భవనానికి రూ.20 లక్షలు, ఒక్కో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి రూ.8 లక్షల చొప్పున మంజూరు చేశారు.

**అద్దె భవనాల్లో ఇబ్బందులు**

జిల్లాలో 1504 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 577 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలున్నాయి. మిగతావి స్థానిక పాఠశాలల శిథిల గదులు, అద్దె ఇళ్లలో నిర్వహిస్తున్నారు. దీంతో చిన్నారులకు ఇక్కట్లు తప్పడం లేదు.

జిల్లాలో ప్రస్తుతం 631 పంచాయతీలు ఉండగా.. 208 పంచాయతీలు అద్దె గదులు, ప్రభుత్వ పాఠశాలల భవనాల్లో నిర్వహిస్తుండటం ఇబ్బందిగా మారింది.

నిధుల కేటాయింపులిలా.. (2025-2026)

మంజూరైన పంచాయతీ భవనాలు: 27

నిధుల కేటాయింపు: రూ.5.40 కోట్లు

అంగన్‌వాడీ భవనాలు: 62

నిధుల మంజూరు: రూ.4.96 కోట్లు

త్వరలో పనులు చేయిస్తాం

జిల్లాలో గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు ఈ ఏడాది మే నెలలో ఉపాధి హామీ పథకం నిధులు మంజూరయ్యాయి. వాటికి స్థల సేకరణ కొనసాగుతోంది. త్వరలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.యుగంధర్, పీఆర్, ఈఈ

# మూతపడిన పాఠశాలలు తెరచుకునేనా?

సంగారెడ్డి : విద్యార్థులు లేకపోవడంతో చాలా చోట్ల పాఠశాలలు మూతపడ్డాయి. కొన్ని చోట్ల ఏళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. జిల్లాలో ఇలాంటి పాఠశాలల సమీపంలోని విద్యార్థుల వివరాలు సేకరించి.. వాటిని తెరిపించేలా చర్యలు తీసుకోవాలని ఇటీవల విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

**ఖేడ్, అందోలులో అధికం**

జిల్లాలో విద్యార్థులు లేకపోవడంతో 68 పాఠశాలలు మూతపడ్డాయి. వీటిలో ఎక్కువగా ప్రాథమిక పాఠశాలలే ఉన్నాయి. కొన్ని చోట్ల విద్యార్థులు తక్కువగా ఉండటంతో పక్క పాఠశాలల్లో విలీనం చేశారు. బడులు మూసేయడంతో ఉపాధ్యాయ పోస్టులు కూడా రద్దయ్యాయి. మూతబడిన పాఠశాలలు నారాయణఖేడ్, అందోలు నియోజకవర్గాల్లోనే ఎక్కువగా ఉన్నాయి. ఏళ్లుగా పాఠశాలల గదులు వినియోగించకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. మొదట ఈ గదులను శుభ్రం చేయించాలని అధికారులు ఆదేశించారు. తర్వాత సమీపంలోని విద్యార్థులను గుర్తించి వీటిలో చేర్పించాలి. పక్క పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై ఇక్కడికి నియమిస్తారు. అన్ని పాఠశాలలు తెరిపించేలా ఎంఈవోలు చొరవ తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. విద్యార్థులు చేరితే పుస్తకాలు, రాత పుస్తకాలు, సమ దుస్తులతో పాటు.. మధ్యాహ్న భోజనాన్ని కూడా అమలు చేస్తారు. మూతపడిన పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి.. త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.


చురకలు

## సంపాదకీయం

### దివాళాకు రష్యా సిద్ధం.. తాజా పరిస్థితి ఇదే!

ఉక్రెయిన్ తో సుమారు మూడేళ్లుగా అవిరాంగంగా యుద్ధం చేస్తున్న రష్యా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందా.. అటు పెద్ద ఎత్తున సైన్యాన్ని కోల్పోతున్న రష్యా.. ఇటు ఆర్థికంగానూ మాంద్యవైపు పయనిస్తుందా.. అంటే అవుననే అంటున్నారు ఆ దేశ వాణిజ్య మంత్రి. ప్రస్తుతం రష్యాలో కాయగూరల నుంచి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయని తెలుస్తోంది. అవును... రష్యా ఆర్థిక వ్యవస్థ సంక్షోభపు అంచుల్లోకి చేరుకుంది. 2022 నుండి ఉక్రెయిన్ పై విరుచుకుపడుతోన్న రష్యా.. ఆర్థిక వ్యవస్థ గడ్డు పరిస్థితుల్లో ఉందని అంటున్నారు. ఈ సందర్భంగా స్పందించిన రష్యా వాణిజ్యశాఖ మంత్రి మాక్సిమ్ రెషెత్నికోవ్.. దేశ ఆర్థిక వ్యవస్థపై ఆందోళన వ్యక్తం చేశారు.. తమ దేశం మాంద్యం అంచున ఉందని వెల్లడించారు. రష్యాకు పెట్టుబడులను ఆకర్షించడంలో భాగంగా సెయింట్ పీటర్స్ బర్గ్ లో నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఆర్థిక వేదిక సదస్సులో ప్రసంగించిన ఆయన.. ప్రస్తుత వాణిజ్యం, సూచీలను బట్టి చూస్తే తాము మాంద్యం అంచుల్లో ఉన్నట్లు కనిపిస్తోందని అన్నారు. అయితే.. మాంద్యంలోకి జారుకుంటామా లేదా అన్నది ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఉక్రెయిన్ పై 2022లో మొదలుపెట్టిన యుద్ధం సుదీర్ఘ కాలంగా కొనసాగుతోంది. ఈ క్రమంలోనే కొన్ని దేశాలు ఆంక్షలు విధించడం క్రెమ్లిన్ ఆర్థిక కష్టాలకు కారణమైంది. మరోవైపు సైన్యానికి భారీస్థాయిలో ఖర్చు చేస్తుండటం ఆర్థికవృద్ధిపై ప్రభావం చూపింది. ఈ నేపథ్యంలో 2025 మొదటి త్రైమాసికంలో రష్యా ఆర్థిక వృద్ధి 1.4%కి పడిపోయింది. ఇది 2024లో 4.5% ఉండగా.. 2021లో 4.3% గా ఉంది. అయితే... ఉక్రెయిన్ యుద్ధంపై విధించిన పాశ్చాత్య ఆంక్షల కారణంగా ఈ ఘోర పతనం (1.4%)ఏర్పడిందని చెబుతున్నారు. ఇది అధిక వ్యయంతో పాటుగా రష్యా ఆర్థిక సంక్షోభానికి దారితీసిందని చెబుతూ.. 2025 నాటికి రష్యా రక్షణ వ్యయం దాని జీడీపీలో 8% మించిపోతుందని అంచనా వేస్తున్నారు. ఉక్రెయిన్ తో యుద్ధం కారణంగా.. 2023 నుంచి రష్యా తన రక్షణ వ్యయాన్ని భారీగా పెంచేస్తోంది. ఈ క్రమంలో.. 2025లో రష్యన్ పార్లమెంట్ రూ.10 లక్షల 67 వేల కోట్ల రక్షణ బడ్జెట్ ను ఆమోదించింది. ఇలా బడ్జెట్ లో ఎక్కువ భాగం రక్షణ రంగానికి ఖర్చు చేస్తుండటంతో.. విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలకు డబ్బు ఇబ్బందవుతుందని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని చెబుతున్నారు. ఇందులో భాగంగా.. దేశంలో.. ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, ఇతర కూరగాయలు, కోడి గుడ్ల ధరలు విపరీతంగా పెరిగాయని అంటున్నారు. ఈ తాజా పరిణామాల నేపథ్యంలో చాలా మంది పౌరులు దేశం విడిచి వెళ్లిపోతున్నారనేది ఆందోళనగా మారింది!

## 'నిశ్శబ్దం'గా విస్తరిస్తోంది



గోదావరిఖని: ఉమ్మడి జిల్లాలో హెచ్ఐవీ పాజిటివ్ కేసులు పెరుగుతున్నాయి. అవగాహన రాహిత్యంతో పాటు కనీస జాగ్రత్తలు కూడా పాటించకపోవడంతో హెచ్ఐవీ బాధితులు పెరుగుతున్నారు. ఉమ్మడి జిల్లాలో క్వారీలు, గ్రానైట్ పరిశ్రమలు, ఇటుకల తయారీ కేంద్రాలు ఎక్కువగా ఉండటంతో ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి వలస కూలీలు ఎక్కువగా వస్తుంటారు. గల్ఫ్, ఇతర దేశాల నుంచి వచ్చే వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది. అక్కడి నుంచి వచ్చే వారి ద్వారా వ్యాధి సంక్రమిస్తోంది. ప్రతినెలా హెచ్ఐవీ కేసులు పెరుగుతూ వస్తున్నాయి.

**విస్తృత ప్రచారం**

ఎయిడ్స్ నివారణకు ఒకవైపు ప్రభుత్వ పరంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. మరోవైపు స్వచ్ఛంద సంస్థలు, కళాజాత బృందాలు, హెచ్ఐవీ పరీక్ష కేంద్రాల సిబ్బంది ప్రచారాలు చేస్తున్నారు. తాజాగా ఎల్ఈడీ తెరతో ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రత్యేకంగా ప్రచారం చేస్తున్నారు. ఏఆర్టీ కేంద్రాల ద్వారా అవగాహన కల్పించడంతో పాటు పరీక్షలు చేస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మూడు ఏఆర్టీ కేంద్రాలు

ఉమ్మడి జిల్లాలో మూడు ఏఆర్టీ(యాంటీ రెట్రోవైరల్ థెరపీ) కేంద్రాలున్నాయి. ఇక్కడి నుంచి హెచ్ఐవీ రోగులకు మందులు పంపిణీ చేస్తారు. గోదావరిఖని, కరీంనగర్, జగిత్యాలో ఏఆర్టీ కేంద్రాలున్నాయి. నోడల్, మెడికల్ అధికారులతో పాటు కౌన్సెలర్, డాటా ఎంట్రీ, ఫార్మాసిస్టు, ల్యాబ్టెక్నీషియన్ల ద్వారా నిరంతరం పర్యవేక్షణతో పాటు మందులు పంపిణీ చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో హెచ్ఐవీ బాధితులు
మందులు వాడుతున్న వారు : 9,337
పింఛను పొందుతున్న వారు : 3,898

**అవగాహనతోనే దూరం**

ప్రతి ఒక్కరిలో ఎయిడ్స్‌పై అవగాహన అవసరం. చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తే సరిపోతుంది. స్వీయనియంత్రణ లేకపోవడంతో హెచ్ఐవీ కేసులు పెరుగుతున్నాయి. ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించేందుకు ప్రత్యేక బృందాలతో ప్రచారం చేస్తున్నాం. పట్టణాలు, పల్లె ప్రాంతాలు, ప్రధాన కూడళ్లు, బస్టాండ్‌ల వద్ద ఎల్ఈడీ తెరతో అవగాహన కల్పిస్తున్నాం. ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. రమాశ్రీనివాస్, ఐసీటీసీ ఉమ్మడి జిల్లా సమన్వయకర్త

## మెడి'కల' తీరింది..!




మిర్యాలగూడ : వంద పడకలతో జిల్లా ఆసుపత్రి తర్వాత ఆ స్థాయిలో వైద్య సేవలందిస్తున్న మిర్యాలగూడ ప్రాంతీయ ఆసుపత్రి మరో మెట్టు ఎక్కనుంది. ఆసుపత్రిలో పీజీ వైద్య కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు జాతీయ వైద్య కమిషన్ ప్రకటించింది. వైద్య విద్యను చేరువ చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా ఐదు ప్రాంతాల్లో పీజీ వైద్య కళాశాలలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. నిత్యం వందలాది మందికి చికిత్స అందించే ప్రాంతీయ ఆసుపత్రిలో పీజీ వైద్య కళాశాల ఏర్పాటుపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది.

ఇప్పటికే ఆసుపత్రిలో నూతన భవనం నిర్మాణం జరుగుతుండగా.. డయాలసిస్ యంత్రాలను ఐదు నుంచి పదికి పెంచారు. మరో వైపు ఆసుపత్రికి ఇటీవలే ట్రామా కేర్ సెంటర్ సైతం మంజూరైంది. అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి, కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారి పట్టణం నుంచే వెళ్తుండడంతో ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతూ..అనేక మంది గాయాలపాలవుతున్నారు. దీంతో వారిని హైదరాబాద్ వంటి నగరాలకు తరలించే లోపే మృత్యువాత పడుతున్నారు. ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుతో అత్యాధునిక ఎంఆర్ఐ, సీటీ స్కాన్ వంటి సౌకర్యాలు అందుబాటులోకి వచ్చి..ప్రమాద బాధితులకు చికిత్స అందించేందుకు అవకాశం ఏర్పడుతుంది. మోకాలి చిప్పల మార్పిడి శస్త్ర చికిత్సల్లో ఆసుపత్రి రాష్ట్రంలోనే ముందంజలో సైతం ఉంది. పీజీ వైద్య కళాశాల ఏర్పాటుతో ప్రజలకు అత్యాధునిక వైద్యం అందుబాటులోకి రానుంది. జిల్లాలో నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రి మినహా పట్టణంలోని జ్యోతి ఆసుపత్రిలో మాత్రమే డీఎన్‌బీ డీజీవోలో పీజీ సీట్లు అందుబాటులో ఉన్నాయి. కాగా ప్రాంతీయ ఆసుపత్రిలో ఏడు విభాగాల్లో పీజీ సీట్లు మంజూరు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. ఇందులో గైనకాలజీ, చిన్న పిల్లలు, ఆర్థోపెడిక్, జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్ తదితర విభాగాల్లో పీజీ సీట్లు అందుబాటులోకి రానున్నట్లు తెలుస్తోంది. అయితే పీజీ కళాశాల ఏర్పాటు చేసేందుకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనపై ఇప్పటికే అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం.

**ఇంకా పూర్తి విధి విధానాలు రాలేదు...** డాక్టర్ మాతృనాయక్, డీసీహెచ్ఎస్, నల్గొండ. మిర్యాలగూడ ప్రాంతీయ ఆసుపత్రిలో పీజీ వైద్య కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు జాతీయ మెడికల్ కమిషన్ ప్రకటించింది. కానీ మాకు దీనిపై ఎలాంటి విధి విధానాలు రాలేదు. కాగా ఆసుపత్రిలో ఇప్పటికే వంద పడకల భవనం ఉండగా..మరో వంద పడకల భవనం నిర్మాణం జరుగుతోంది. దీంతో పాటు ట్రామా కేర్ సెంటర్ వంటి అత్యాధునిక సౌకర్యాలు సైతం అందుబాటులోకి రానున్నాయి. పీజీ కళాశాల సైతం వస్తే రోగులకు ఆధునిక చికిత్స అందించేందుకు వీలు కలుగుతుంది.

## సారం పంచు.. దిగుబడి పెంచు



నల్గొండ: పంటల సాగులో ఎరువుల వినియోగాన్ని దశల వారీగా తగ్గించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. భూసారం దెబ్బతినకుండా వాతావరణ కాలుష్యం లేకుండా ఉండేందుకు సమగ్ర కార్యాచరణ చేపడుతోంది. చిన్న గుళికల రూపంలో ఉండే యూరియా స్థానంలో ద్రవరూప నానో యూరియాను అందుబాటులో తెచ్చింది. డీఏపీ కూడా ఇలాగే లభిస్తోంది. దశాబ్దాలుగా సంప్రదాయ పద్ధతిలోనే బస్తాలకొద్దీ ఉపయోగించిన రైతన్నలు నానో యూరియాపై ఆసక్తి కనబర్చడం లేదని వ్యవసాయ అధికారుల సర్వేలో తేలింది. దీంతో క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు, విస్తరణాధికారులతో రైతువేదికల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు.

**నానో యూరియాతోనే బాగు**

స్ఫటిక రూపంలో ఎరువుతో వృథా ఎక్కువవుతుంది. మార్కెట్‌లో 45 కిలోల బస్తా రూ.270 ఉంది. దానికి సమానమైన నానో యూరియా అర లీటరు డబ్బా ధర రూ.225 మాత్రమే. మొక్కలకు పిచికారీ చేయడంతో ఎక్కువ ఫలితం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. పంట కాలానికి ముందుగానే రైతు భరోసా నిధులు జమ చేయడంతో కర్షకులు ఉత్సాహంగా సాగుబడి చేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పంటల సాగు విస్తీర్ణం 21,24,980 ఎకరాలు కాగా ఇందులో వరి 12,89,675, పత్తి 7,45,554, మిగిలిన పంటలను 89,751 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. నెలాఖరు వరకు పత్తి పంట సాగు మొత్తం పూర్తికానుంది. వరి 40 శాతమే పూర్తి చేశారు. బోరు బావుల వద్ద సాగు ఊపందుకోగా కాలువల వద్ద వరి నారు నాటు వేసే దశకు వచ్చిందని అధికారులు చెబుతున్నారు.

**రైతులకు అవగాహన కల్పిస్తున్నాం**

పాల్వాయి శ్రవణ్, జిల్లా వ్యవసాయశాఖాధికారి, నల్గొండ

గుళికల రూపంలో కాకుండా ద్రవరూపంలో ఉండే అత్యాధునిక నానో యూరియా, డీఏపీ ఎరువులను ఉపయోగించడం వల్ల రైతులు లాభసాటి వ్యవసాయం చేయవచ్చు. వీటి వినియోగంతో పోషకాల వినియోగ సామర్థ్యంతోపాటు పంటోత్పత్తుల దిగుబడి పెరుగుతుంది. పర్యావరణానికి సురక్షితమైంది.

## చక్కెర చేదవుతోంది!

కొత్తగూడెం : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని మధుమేహ బాధితులకు ఇన్సులిన్ కొరత వేధిస్తోంది. రెండు నెలలుగా సర్కారు దవాఖానాలకు సరఫరా నిలిచిపోవటంతో 'ప్రైవేటు'లో కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. బాధితులకు నెలకు నాలుగు చొప్పున ఇంజెక్షన్లు కావాలి. గతంలో వీటిని ప్రభుత్వాసుపత్రుల్లో ఇచ్చేవారు. ప్రస్తుతం సర్కారు దవాఖానాలకు సరఫరా కాకపోవటంతో మార్కెట్‌లో నెలకు సుమారు రూ.500-600 వెచ్చించాల్సి వస్తోందని బాధితులు చెబుతున్నారు.

**నిర్లక్ష్యం వహిస్తే..**

ఒకవైపు ఇన్సులిన్ కొరతతో బాధితులు ఇబ్బందులు పడుతుండగా.. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్యాధికారులు ఇటీవల చేపట్టిన సర్వేలోని గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. 30ఏళ్లలోపు వారిలో అధిక మధుమేహం (షుగర్ శాతం అధికంగా కలిగినవారు, టైప్-1)తో బాధపడుతున్నవారు ఖమ్మం జిల్లాలో 169 మంది, భద్రాద్రి జిల్లాలో 73 మంది ఉన్నట్లు తేలింది. సర్వే పూర్తయితే భద్రాది జిల్లాలో ఈ సంఖ్య మరింత పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆయా వ్యక్తులు తమ రక్తంలో గ్లూకోజ్ శాతాన్ని తగ్గించుకోవటానికి తప్పనిసరిగా ఇన్సులిన్ ఇంజెక్షన్ తీసుకోవాలి. నిర్లక్ష్యం వహిస్తే కీలకమైన అవయవాలు దెబ్బతినే ప్రమాదముంటుందని వైద్యనిపుణులు



హెచ్చరిస్తున్నారు.

**తలెత్తే సమస్యలు..**

టైప్-1 మధుమేహ బాధితుల శరీరం ఇన్సులిన్ ఉత్పత్తి చేయదు. ఇది రక్తంలో చక్కెర స్థాయులు అసాధారణంగా పెరగటానికి దారితీస్తుంది. వీరు జీవితాంతం ఇన్సులిన్‌పై ఆధారపడతారు. ఒకవేళ ఇన్సులిన్ తీసుకోకపోతే అధిక దాహం, తరచూ మూత్రవిసర్జన, వికారం, వాంతులు, అలసట, గందరగోళం వంటి సమస్యలు ఎదురవుతాయి. కొన్ని సందర్భాల్లో ప్రాణాంతకంగా మారవచ్చు.

**నివేదించినా.. సరఫరా అరకొరగానే..**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇన్సులిన్ ఇంజెక్షన్లు నిల్వ ఉండటం లేదు. వెంటనే పంపించాలని ఉన్నతాధికారులకు నెల రోజుల ముందే నివేదికలు పంపినా.. డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా కావటం లేదని సమాచారం. సర్వజనాసుపత్రులకు మాత్రం అరకొరగా అందుతున్నట్లు తెలిసింది. జిల్లాలో టైప్-1 మధుమేహ బాధితులను గుర్తించి ప్రభుత్వానికి నివేదించాం. రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఇన్సులిన్ తప్పనిసరైనవారి లెక్క తేలితే ఆ సంఖ్యకు అనుగుణంగా సర్కారు ఇన్సులిన్ ఇంజెక్షన్లను సరాఫరా చేయనున్నట్లు తెలుస్తోంది.డా.రామారావు, ఎన్‌సీడీ, ప్రోగ్రాం అధికారి, ఖమ్మం

## నిలిచిన మిరప కొనుగోళ్లు

ఖమ్మం : ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో మిరప కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఉదయం జెండా పాట నిర్వహించినా... ఆర్డర్లు లేవని వ్యాపారులు కొనుగోలు చేయకుండా చేతులెత్తేశారు. ఏసీ మిరప జెండా పాట క్వింటా గరిష్ఠ ధర రూ.13,100 కాగా నాన్ ఏసీ మిరప క్వింటా గరిష్ఠ ధర రూ.8,500 నిర్ణయించారు. ఏసీ నిల్వలకు సంబంధించి మొత్తం 76 నమూనాలు రాగా 3,494 బస్తాలు వచ్చాయి. నాన్ ఏసీ రకాలు 800 బస్తాలు తెచ్చారు. కొంతమంది రైతులు, వ్యాపారులకు సంబంధించిన నిల్వలు వీటిలో ఉన్నాయి. ఏసీ నమూనాలను తిరిగి ఏసీ గిడ్డంగులకు తరలించగా, నాన్ ఏసీ మిరపను స్థానిక షెడ్లలో నిల్వ ఉంచారు. జెండా పాట తర్వాత వ్యాపారులు కొనుగోళ్లు నిలిపివేయడం అరుదు. విషయం తెలిసిన వెంటనే మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హనుమంతరావు, వైస్ ఛైర్మన్ తల్లాడ రమేశ్, డీఎంఓ అలీం, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ వ్యాపారులతో మాట్లాడారు. కొనుగోళ్లు కొనసాగించాలని కోరారు. ఇందుకు వ్యాపారులు నిరాకరించారు. విషయం అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఎగుమతి, దిగుమతిశాఖ బాధ్యులతో ఛైర్మన్ హనుమంతరావు సమావేశం నిర్వహించారు. మార్కెట్ సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. దిగుమతిశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దిరిశాల చినవెంకటేశ్వర్లు, ముత్యం ఉప్పల్‌రావు, మిర్చిశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాటేటి నాగేశ్వరరావు, యడ్లపల్లి సతీశ్‌తో చర్చలు జరిపారు.

**స్పందించకుంటే చట్టపరమైన చర్యలు..**

మార్కెట్లో కొనుగోళ్లు నిర్వహించకుంటే అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఆర్డర్లు లేవనే విషయం వాస్తవం కాదని, ఆర్‌డీ విషయంలో మార్కెటింగ్ శాఖ అధికారులు అంగీకరించకపోవడం వల్లనే వ్యాపారులు కొనుగోళ్లకు నిరాకరించినట్లు ప్రచారం జరుగుతోంది. జెండా పాట తర్వాత కొనుగోళ్లు నిలిపివేసిన ఘటనపై మార్కెట్ బైలా ప్రకారం చట్టపరమైన చర్యలు చేపట్టే అవకాశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు.

## సేవలు విస్తృతం.. వైద్యం పరిపుష్టం

సిద్దిపేట: వైద్యారోగ్యానికి ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయి. పెరుగుతున్న జన రద్దీకి అనుగుణంగా సేవలను విస్తృతం చేస్తున్నాయి. జిల్లా కేంద్రమైన సిద్దిపేటలో ఎమ్మెల్యే హరీశ్‌రావు చొరవతో ఇప్పటికే సిద్దిపేటలో ప్రభుత్వ వైద్య కళాశాల అనుబంధ సర్వజన ఆసుపత్రి, రెండు యూపీహెచ్‌సీలు (పట్టణ ఆరోగ్య కేంద్రాలు), నాలుగు బస్తీ దవాఖానాలు కొనసాగుతున్నాయి. ప్రాథమిక స్థాయిలో జనాభా సంఖ్యకు అనుగుణంగా గత ఏడాది స్థానిక ఎన్జీవోస్ కాలనీకి మరో యూపీహెచ్‌సీ మంజూరు చేయడం విశేషం. రెండు చోట్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

**కమిషనర్ చొరవతో పరిష్కారం**

పట్టణాల్లో 50 వేల జనాభాకు కనీసం ఒకటి చొప్పున యూపీహెచ్‌సీ అవశ్యం. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో 43 వార్డుల్లో 1.57 లక్షల జనాభా నివసిస్తోంది. ఎన్జీవోస్ కాలనీలో స్థాపనకు ప్రతిపాదించగా దాదాపు 250 గజాల స్థలాన్ని కేటాయించారు. ఈ క్రమంలో స్థలం వివాదం తలెత్తగా బల్దియా కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ చొరవతో పరిష్కరించారు. గత ఫిబ్రవరిలో పనులకు శ్రీకారం చుట్టారు. రెండు నెలల్లో పనులు పూర్తి చేసేలా ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు కమిషనర్ వివరించారు.

**ప్రస్తుతం అద్దె భవనంలో..**

సిద్దిపేటలో నాసర్‌పురా, అంబేద్కర్ నగర్ యూపీహెచ్‌సీలు కొనసాగుతున్నాయి. నిత్యం సగటున 90 మంది చొప్పున రోగులు ఓపీ సేవలు పొందుతున్నారు. సీజనల్ వ్యాధుల సమయంలో సంఖ్య మరింత ఎక్కువగా ఉంటోంది. అంబేద్కర్‌నగర్ కేంద్రం నాటి నుంచి అద్దె భవనంలో కొనసాగుతోంది. వర్షం కురిస్తే భవనంలో నీరుగారుతోంది. శాశ్వత భవన నిర్మాణాన్ని జిల్లా రవాణా శాఖ కార్యాలయం సమీపంలో గత ఏడాది జులైలో ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.43 కోట్లు వెచ్చించారు. 250 గజాల విస్తీర్ణంలో చేపట్టిన పనులు చకచకా సాగుతున్నాయి. ప్రస్తుతం టైల్స్ పనులు సాగుతున్నాయి.

చురకలు



# శ్రీకాళహస్తికి పరిశ్రమల హారం

శ్రీకాళహస్తి : కూటమి పాలనలో శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిశ్రమల హారంగా మారనుంది. సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టిసారించి ప్రణాళికలు రూపొందించాలని సమీక్షిస్తున్న నేపథ్యంలో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయి. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

గతంలో తెదేపా ప్రభుత్వంలో అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో రేణిగుంట, ఏర్పేడు మండలాల పరిధిలో ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కేంద్రం-1, 2గా ఏర్పేడు- వెంకటగిరి ప్రధాన రహదారిపై ఈఎంసీ-3గా కేటాయించి ఏపీఐఐసీకి పెద్దఎత్తున భూములు కేటాయించారు. దేశ, విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలతో చర్చలు జరిపి పెద్దఎత్తున పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ



నేపథ్యంలో ఈఎంసీ-1,2లో 830.5 ఎకరాల ఏపీఐఐసీకి భూములు కేటాయించగా.. 330 ఎకరాల్లో రూ.వేల కోట్లు పెట్టుబడులతో డిక్సన్, సిలికాన్, కార్బన్, టీసీఎల్ వంటి 56 భారీ పరిశ్రమలను ఏర్పాటుకు పండగలా భూమి చేశారు. అప్పటికే 30కిపైగా పరిశ్రమలు ఉత్పత్తులను ప్రారంభించడం గమనార్హం.

**పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు**

ఈఎంసీ-1, 2, 3లో వెయ్యి ఎకరాలకు పైగా ఏపీఐఐసీకి కేటాయించిన భూములు అందుబాటులో ఉండటంతో పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి నూతన పరిశ్రమలు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దీనిపై ప్రత్యేక దృష్టిసారిస్తూ అధికారులతో చర్చలు జరపడంతో రానున్న రోజుల్లో కదలికలు ఏర్పడనున్నాయి.

**తెదేపా హయాంలో శ్రీకారం**

తిరుపతి ప్రాంతం అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు చెన్నై, బెంగళూరు వంటి ప్రధాన నగరాలకు సమీపంలో ఉండటంతో 2014లో పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తెదేపా శ్రీకారం చుట్టింది. అతి తక్కువ కాలంలోనే దేశంలోనే ఆదర్శవంతమైన ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కేంద్రంగా మార్చేందుకు సంకల్పించారు. తర్వాత ప్రభుత్వం మారడంతో అభివృద్ధి కుంటుపడింది.

**వైకాపాలో వెనుదిరిగినవెన్నో**

వైకాపా ఐదేళ్ల పాలనలో నూతన పరిశ్రమలు ఏర్పాటుకాకపోగా జియో, విన్‌టెక్, ఎయిల్‌డిక్సన్, ఫాక్స్‌లింక్ వంటి కొన్ని ప్లాంట్‌లు వెనుదిరిగాయి. శ్రీకాళహస్తి మండలంలోని ఇనగలూరు సమీపంలో అపాచీ పరిశ్రమ ఏర్పాటుకు భూమిపూజ చేసినప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. దీంతో ఏపీఐఐసీకి కేటాయించి భూములు బీడు భూములగానే దర్శనమిస్తున్నాయి.

# బె'ధర'గొడుతున్నారు

చిత్తూరు : వ్యవసాయ శాఖలో అన్నదాతకు వ్యక్తిగత యంత్ర పరికరాలు అందించే యాంత్రీకరణ పథకం ఐదేళ్ల తరవాత అమల్లోకి వచ్చింది. కొన్ని పరికరాలపై 50శాతం.. మరికొన్నింటికి నిర్దేశిత మొత్తాన్ని రాయితీగా నిర్ణయించారు. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే వీటి ధరలు ఎక్కువగా నిర్ణయించడం గమనార్హం.. తైవాన్ స్ప్రేయర్‌నే పరిశీలిస్తే.. వ్యవసాయ శాఖ ప్రైవేటు కన్నా రూ.4,132 అధికంగా నిర్ణయించింది. ఇదే స్ప్రేయరుకు ఉద్యానశాఖ రూ.10 వేలు రాయితీ ఇస్తుండగా రైతులు రూ.23 వేలకే కొనుగోలు చేసి బిల్లులు సమర్పిస్తున్నారు.

**తగ్గిపోతున్న సాయం..**

వ్యవసాయ శాఖ సీలింగ్ నిర్ణయించడం వల్ల అన్ని పరికరాలపై 50 శాతం రాయితీ అందడం లేదు. పైకా కొన్నింటి ధరలను అధికంగా



పేర్కొనడంతో రైతుకు వాస్తవంగా దక్కే ఆర్థిక ప్రయోజనం 25 నుంచి 30 శాతమే ఉంటోంది. ఫలితంగా ప్రభుత్వం ఆశించిన మేరకు అన్నదాతకు లబ్ధి చేకూరడం లేదు. ఉద్యానశాఖలో అమలవుతున్న యాంత్రీకరణ పథకం వారికి మేలు చేసేలా ఉంది. ఎందుకంటే రైతులే స్వయంగా బేరమాడి కొనుగోలు చేసి బిల్లులు పెడుతుంటే అధికారులు రాయితీ జమ చేస్తున్నారు. సాధారణంగా ఒక్క పరికరాన్నే కొనుగోలు చేసే రైతు బాగా బేరమాడితే వ్యాపారులు ధర తగ్గిస్తున్నారు. అలాంటిది రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో పరికరాలు కొనుగోలు చేసినప్పుడు ధర ఇంకా తగ్గాల్సి ఉంది. అయితే పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.

**పెరిగింది ఇందుకేనంటా..**

నోడల్ ఏజెన్సీగా ఉన్న ఆగ్రోస్‌కు 2శాతం కమీషన్, జీఎస్టీ కారణంగా ధరలు పెరిగాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. యాంత్రీకరణ పథకం కింద రైతులు యంత్రాలు సరఫరా చేసిన కంపెనీలకు రాయితీ సొమ్ము జమ చేసేందుకు 3-4 నెలలు సమయం పడుతుండటంతో ఆయా కంపెనీల ధరలు ఐదు నుంచి 10 శాతం అధికంగా ఉన్నాయని మరికొందరు అధికారులు పేర్కొంటున్నారు.

**అంతంత మాత్రంగానే దరఖాస్తులు**

2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి యంత్రీకరణ పరికరాలను రాయితీపై అందిస్తున్నట్లు ప్రభుత్వం ఈ నెల మూడో తేదీన ప్రకటించింది. ఈ మేరకు జిల్లాలకు లక్ష్యాలను కేటాయించి జిల్లా వ్యవసాయాధికారులకు పంపింది. 24 రోజులు గడిచినా ఉమ్మడి జిల్లాలో కేవలం 1,208 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఇక మూడు రోజులే గడువు ఉందని ఈలోగా రైతులు దరఖాస్తు చేసుకుని నాన్ సబ్సిడీ చెల్లించిన వారికి ఆగ్రోస్ ద్వారా యాంత్రీకరణ పరికరాలను రాయితీపై పంపిణీ చేస్తామని ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆగ్రోస్ జిల్లా మేనేజరు శశిచంద్రమౌళిరెడ్డి తెలిపారు.

# మిగిలిందా.. మింగేస్తారు!!



విశాఖపట్నం : మధురవాడ పరిధిలోని లే-అవుట్లు, కాలనీల్లో మిగులు భూములను మింగేస్తున్నారు. సామాజిక అవసరాల కోసం రికార్డుల్లో 'ఓపెన్ స్పేస్' స్థలాలుగా ఉన్నా...నకిలీ పత్రాలు సృష్టించి భూబకాసురులు కబ్జా పర్వం సాగిస్తున్నారు. రెవెన్యూ కాలనీ, ఎన్జీవోస్ కాలనీ, మిధిలాపురి వుడా కాలనీ, సాగర్ నగర్ శాంతినికేతన్ లే-అవుట్ పరిధిలో రూ.కోట్ల విలువైన భూములు దర్జాగా ఆక్రమించేశారు.

**వైకాపా నాయకుల గుప్పిట్లో..**

రెవెన్యూ కాలనీలో సర్వే నెంబరు 292లో గెడ్డ పక్కన లే-అవుట్లో సుమారు 300 గజాల మిగులు భూమి ఉంది. లేఅవుట్ మ్యాప్‌లోనూ అలానే చూపిస్తోంది. అయితే 'వుడా' నుంచి కొనుగోలు చేసినట్లు కొందరు వైకాపా నాయకులు పత్రాలు సృష్టించారన్న ఆరోపణలున్నాయి. దీని విలువ రూ.3 కోట్లు పైమాటే. ఇదే సర్వే నెంబరులో గెడ్డకు చేరువగా రూ.1.50కోట్ల విలువైన 200 గజాల మిగులు స్థలంలో స్థానికంగా ఉన్న ఓ వైకాపా నాయకుడు రేకుల షెడ్లు నిర్మిస్తే తొలగించారేకానీ, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయలేదు.

**జీవీఎంసీ అధికారుల ఉదాసీనత..**

ఎన్జీఓస్ కాలనీ ఫేజ్-2 సర్వే నెంబరు 175లో గెడ్డకు ఇరువైపులా పార్కు నిర్మాణం కోసం ఖాళీ స్థలం వదలిపెట్టారు. వైకాపా నాయకుల అండదండలతో పక్కనే ఉన్న ఓ జిరాయితీ స్థల యజమాని దాదాపు రూ.1.5 కోట్ల విలువైన 250 గజాల స్థలం ఆక్రమించి రేకుల షెడ్డు నిర్మించారు. ఇటీవల జీవీఎంసీ అధికారులు పార్కు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. కళ్లముందే ఆక్రమణలు గుర్తించినా చర్యలు తీసుకోలేదు. ఇదే కాలనీలో మరోచోట ఎంవీవీ ఓజోన్ అపార్టుమెంట్ వెనుక రూ.3.5 కోట్లు విలువ చేసే సుమారు 500 గజాలకు పైగా ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. ఇక్కడ నిర్మించిన భవనం, రేకుల షెడ్డుకు జీవీఎంసీ పన్నులు వేయడం, విద్యుత్తు సదుపాయం కల్పించడం గమనార్హం. ఈ లేఅవుట్లో మిగులు స్థలాల కబ్జాపై నెల రోజుల క్రితం రెవెన్యూ అధికారులు, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు సమాచారమిచ్చినా స్పందించలేదు. ఈ వ్యవహారం వెనుక వైకాపా నేత, మాజీ మంత్రి హస్తం ఉన్నట్లు తెలుస్తోంది.

సాగర్‌నగర్ బీచ్ రోడ్డులోని తుపాన్ రక్షిత భవనం వెనుకనున్న శాంతినికేతన్ లేఅవుట్లో సుమారు రూ.3 కోట్లు విలువ చేసే 400 గజాల పార్కు స్థలాన్ని కొందరు కబ్జా చేశారు. దీనికి నకిలీ పత్రాలు సృష్టించి ఇప్పటికే విక్రయాలు జరిపి ప్రహరీ నిర్మించినట్లు తెలుస్తోంది. లేఅవుట్ మ్యాప్ ప్రకారం పార్కు స్థలంగా చూపిస్తున్నా, జీవీఎంసీ అధికారులు వీఎల్‌టీ పన్ను కట్టించుకుని కబ్జాదారులకు వంతపాడుతున్నారన్న విమర్శలున్నాయి. ఈ పార్కు ఆక్రమణ వెనుక ఆరిలోవ ప్రాంతానికి చెందిన ఓ వైకాపా నాయకుడి అనుచరుల పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది.

**అలా అమ్మకాలు..**

మిధిలాపురి వుడా కాలనీ లేఅవుట్కి సంబంధించి కమర్షియల్ స్పేస్ కోసం విడిచి పెట్టిన భూమి పక్కనే సుమారు 700 గజాల మిగులు స్థలం ఉంది. దీనిపై కన్నేసిన కొందరు వ్యక్తులు ఇటీవల అక్కడ పిచ్చిమొక్కలు తొలగించారు. రూ.5కోట్ల విలువైన ఈ భూమికి నకిలీ పత్రాలు సృష్టించి విక్రయానికి తెరతీశారు. స్థలానికి సమీపంలో గెడ్డను భవన నిర్మాణ వ్యర్థాలతో కప్పి కొన్ని రేకుల షెడ్లు నిర్మించి 500 గజాలకు పైగా భూమిని కబ్జా చేశారు. నకిలీ పత్రాలతో మరికొంత ఆక్రమణకు సన్నాహాలు మొదలయ్యాయి. ఈ భూమి విలువ రూ.10కోట్లకుపైగా ఉంటుంది.

# నాటి దూకుడు నేడేమైంది..?




అనకాపల్లి : నాడు.. గత ప్రభుత్వంలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడి ఇంటి నిర్మాణంలో జలవనరుల శాఖకు చెందిన రెండు సెంట్ల స్థలం కలిసిందని స్పందనలో ఫిర్యాదు వచ్చింది. దానిపై అధికారులు హడావుడి చేశారు. కేసులు పెట్టి వందల సంఖ్యలో పోలీసులను ఇంటికి పంపి నిర్మాణాన్ని కూలగొట్టే ప్రయత్నం చేశారు. తమకు సంబంధిత శాఖ నుంచి ఎన్వోసీ ఉందని చెప్పినా వినలేదు. అది నకిలీదంటూ అయ్యన్నను అర్ధరాత్రి అరెస్టు చేసేవరకు అప్పటి సర్కారు పెద్దలు నిద్రపోలేదు. నేడు.. కశింకోట మండలం విస్సన్నపేటలో వైకాపా నేతలు తమ బినామీల పేరిట భారీ లేఅవుట్ వేశారు. అందులో కొండ గెడ్డలు, ప్రభుత్వ భూములు కొంతమేర కలిపేశారని గత ప్రభుత్వంలోనే గుర్తించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ భూముల వ్యవహారంలో అక్రమాలు తేల్చి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఇదివరకే జనసేన నేతలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇప్పటికీ ఆ ఫిర్యాదును పట్టించుకోనేలేదు. ఇదీ నేటి అధికారుల మెతక వైఖరి తీరు. తాజాగా మరోసారి ఆ పార్టీ నాయకుడొకరు ఆ భూములపై సమగ్ర విచారణ జరిపించాలని ఫిర్యాదు చేశారు.

గత ప్రభుత్వంలో నేతలు ఆదేశిస్తే చాలు అధికారులు దూకుడు చూపేవారు. బుల్డోజర్లు తీసుకెళ్లి మరీ నిర్మాణాలు నేలమట్టం చేసేవారు. కూటమి ప్రభుత్వంలో మాత్రం ఫిర్యాదులు చేసినా అక్రమార్కులపై చర్యలకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇందుకు విస్సన్నపేట భూముల వ్యవహారమే ఉదాహరణ. నాటి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అతని ప్రధాన అనుచరుడు బొడ్డేటడ ప్రసాద్ కనుసన్నల్లోనే ఈ లేఅవుట్ వ్యవహారాలు నడిచాయి. అప్పటి ఎంపీ విజయసాయిరెడ్డి అనుచరుడు ఎస్.ఆర్.గోపీనాథ్ రెడ్డి ఇక్కడ 55 ఎకరాలపైగా భూములు కొనుగోలు చేశారు. 609 ఎకరాల్లో భారీ లేఅవుట్ వేశారు. దీనికోసం పది అడుగులున్న గోర్జిని వంద అడుగుల రహదారిగా విస్తరించారు. పక్కనే ఉన్న కొండను తొలిచేశారు. కొండగెడ్డలను కప్పేశారు. అసైన్డ్ భూములను ఆక్రమించుకున్నారు. దీనిపై ఫిర్యాదు వచ్చాక అప్పటి ఆర్‌డీవో సీతారామారావు విచారణ జరిపారు. సుమారు పదెకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైనట్లు గుర్తించారు. చర్యలైతే తీసుకోలేదు. కూటమి ప్రభుత్వంలో నాటి నేతల అక్రమాలను పూర్తిస్థాయిలో వెలికి తీస్తారని ఆశించారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటారని భావించారు. ఫిర్యాదు వచ్చి పదినెలలైనా అధికారులైతే ఆ దిశగా అడుగులు వేయడమే లేదు. అప్పట్లో హడావుడి చేసిన కూటమి పెద్దలు కూడా మౌనం దాల్చడం వెనుక వారితో కుమ్మక్కయ్యారనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి.

**సా..గుతున్న విజిలెన్స్ విచారణ..**

కూటమి ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత గత ప్రభుత్వంలో భూముల వ్యవహారాలపై విజిలెన్స్ విచారణ చేయిస్తోంది. అందులో భాగంగా విస్సన్నపేట లేఅవుట్‌పైనా విచారణ చేస్తున్నారు. అయితే భూ రికార్డులు సక్రమంగా లేకపోవడం, కొండలు కరిగించినా వాటిని ఎక్కడికి, ఎంత పరిమాణంలో తరలించారనే వివరాలు దొరక్కపోవడంతో కాలయాపన జరుగుతున్నట్లు తెలుస్తోంది. గతంలో విచారణ చేపట్టిన ఆర్డీవో నివేదిక సైతం ఇప్పటి వరకు వెలుగుచూడలేదు. ఈ భూముల వ్యవహారంలోనే సస్పెన్షన్‌కు గురైన అధికారిని ఆర్డీవో కార్యాలయంలోని కీలక పోస్టులో పెట్టారు. ఆయన హయాంలో జరిగిన అక్రమాల వివరాలు ఇప్పుడు ఆయన్ని దాటి బయటకు వస్తాయా అన్నది ఫిర్యాదుదారుల అనుమానం.

# సర్కారీ భూముల్లో సౌర కుసుమాలు



అనకాపల్లి : వ్యవసాయ కనెక్షన్లకు అవసరమైన విద్యుత్తును పూర్తిగా సోలార్ ద్వారానే ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధానమంత్రి కిసాన్ ఊర్జా సురక్ష ఏవన్ ఉద్ధాన్ మహాభియాన్ (పీఎం కుసుమ్) ద్వారా వ్యవసాయ ఫీడర్లన్నింటినీ సోలరైజేషన్ చేయబోతున్నారు. ఇందులో భాగంగా జలవనరుల శాఖకు సంబంధించిన పంట కాల్వలపైనా, ప్రభుత్వ భూముల్లో సౌర విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటుపై కసరత్తు చేస్తున్నారు. దీనివల్ల భూముల ఆక్రమణలకు చెక్‌పెట్టడంతో పాటు సంబంధిత శాఖలకు ఆదాయం రానుంది. ఈపీడీసీఎల్ పరిధిలోని అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో సుమారు 358 ఎకరాల్లో సౌర పలకలు ఏర్పాటు చేయడానికి ఇటీవల టెండర్లు పిలిచారు.ఎకరాకి రూ.31వేల చొప్పున.. ప్రభుత్వ భూములు ఎక్కడెక్కడ ఆక్రమణలకు గురవుతున్నాయి. వాటిని కాపాడుకోవడమే పెద్ద సవాల్‌గా మారింది. వాటిలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అవకాశం ఇవ్వడం వల్ల ఆక్రమణల నుంచి రక్షణ ఏర్పడుతుంది. నర్సీపట్నం నియోజకవర్గంలో 90 ఎకరాల దేవాదాయ భూములతో పాటు రాంబిల్లి, మాకవరపాలెం, భీమిలి, ఆనందపురం మండలాల్లో ప్రభుత్వ భూములను ఈ ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధిత శాఖలకు విద్యుత్తు సంస్థ లేఖలు రాసింది. వీటి ద్వారా ఆయా శాఖలకు లీజు రూపంలో ఎకరాకు రూ.31వేల చొప్పున ఆదాయం సమకూరుతుంది.

కాలువ గట్టుపై కాసుల పంట.. జిల్లాలో పోలవరం ఎడమ కాలువ ఉంది. పాయకరావుపేట నుంచి కశింకోట మండలం వరకు ఈ కాలువ ఇరువైపులా సోలార్ పలకలు ఏర్పాటు చేయడానికి 123 ఎకరాలను గుర్తించారు. జలవనరుల శాఖకు ఏడాదికి రూ.31 వేల చొప్పున ఎకరాకి లీజు చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి రెండేళ్లకు 5 శాతం లీజు పెంచుతుండాలి. 25 ఏళ్లు పాటు ఈ లీజు ఒప్పందం కొనసాగనుంది.

# రాకుంటే అడగొచ్చు.. రాయితీ పొందొచ్చు

రాజాం : పేదలకు అందిస్తున్న తొలి ఉచిత గ్యాస్ సిలిండర్‌ను పొందేందుకు ఈ నెల 31వ తేదీ వరకే గడువుంది. దీపం పథకం అర్హులు ఇంకా మిగిలి ఉంటే సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్ చొప్పున ప్రతి ఆర్థిక సంవత్సరంలో మూడు అందించాలని నిర్ణయించింది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం మొదలవుతుండడంతో అప్పట్లోగా బుక్ చేసుకోకపోతే తొలి ఏడాది లబ్ధికి దూరం అవుతారు. బుకింగ్ చేసుకున్న 24 గంటల్లో పట్టణ ప్రాంతాలకు, 48 గంటల్లో గ్రామీణ ప్రాంతాలకు అందిస్తున్నారు. లబ్ధిదారులు నగదు చెల్లించి బండను తీసుకున్న 48 గంటల్లో వారి బ్యాంకు ఖాతాలకు ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) విధానంలో జమ చేస్తున్నారు.

**తప్పిదాలు దిద్దుకోండి**



గ్యాస్ సిలిండర్ తీసుకున్నా.. సాంకేతిక సమస్యలు, లబ్ధిదారుల వివరాల నమోదులో తప్పిదాలతో కొందరికి రాయితీ జమ కావడం లేదు. ఎందుకు రావట్లేదో పౌర సరఫరాల అధికారులు, గ్యాస్ ఏజెన్సీలను సంప్రదించి తెలుసుకోవచ్చు. ఆధార్ నంబరు మనుగడలో లేకపోవడం, బ్యాంకు ఖాతాతో ఆధార్ అనుసంధానం కాకపోవడం, బ్యాంకు ఖాతాలు యాక్టివ్‌గా లేకపోవడం, లబ్ధిదారుడు చనిపోవడం, సరైన బ్యాంకు ఖాతా నంబరు నమోదు చేసుకోకపోవడం, ఈకేవైసీ డాక్యుమెంట్లు పెండింగ్ ఉండడం, తదితర కారణాలతో చాలా మంది జిల్లాలో లబ్ధి పొందలేకపోయారు.

ముందుకు రావాలి: అర్హులంతా దీపం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఇంకా మిగిలి ఉంటే బుక్ చేసుకోవాలి. సాంకేతిక సమస్యలుండి లబ్ధి బ్యాంకు ఖాతాలో జమకాకపోతే సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించి సరిదిద్దుకోవాలి.

మధుసూదనరావు, డీఎస్‌వో

అందించిన సిలిండర్లు: 4,46,846

అందులో రాయితీ పొందినవి : 4,42,394


ఆ మొత్తం మంజూరు: రూ.32.63 కోట్లు

బ్యాంకులో రాయితీ జమైన బండలు: 4,40,373

ఖాతాలో జమైన సొమ్ము: రూ.32.49 కోట్లు

# ఉంటే ఎక్కువ.. లేకుంటే తక్కువ

విజయనగరం : వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అయిదేళ్లు పారిశ్రామిక రంగం కుదేలైంది. కూటమి ప్రభుత్వం ఈ రంగమే ప్రగతిలో కీలకం కానుందని, అధిక సంఖ్యలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావించి చిన్న పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇందుకు ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల విస్తీర్ణంలో ఏపీఐఐసీ ద్వారా ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తామని ఆ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రకటించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పాటు మహిళలను ఆహ్వానిస్తున్నారు.



గత పాలనలో ప్రభుత్వ స్థలాలను భవనాల నిర్మాణం, కాలనీ లేఅవుట్లకు సేకరించడంతో ప్రస్తుతం పాతిక ఎకరాలు ఒకే చోట ఎక్కడ ఉందా అని రెవెన్యూ అధికారులు అన్వేషిస్తున్నారు. విజయనగరం జిల్లాలో ఏడు, మన్యం జిల్లాలో నాలుగు శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. కొని చోట్ల వందల ఎకరాలు ఉన్నాయి. మరికొన్ని చోట్ల పది ఎకరాలు కూడా లేదు. ఆయా ప్రాంతాల్లో డి-పట్టా భూముల సేకరణకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే గుర్తించిన వాటిని ఏపీఐఐసీకు అప్పగించామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. గుర్తింపు దశ దాటి ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని పరిశ్రమల శాఖ అధికారులు అంటున్నారు.

# ఎర్రకాలువ పరిధిలో రైతులకు ఊరట

నిడదవోలు : గతేడాది జులై నెలలో కురిసిన భారీ వర్షాలకు నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల పరిధిలో ఎర్రకాలువ పొంగి పంట పొలాలను ముంచెత్తి రైతులకు తీవ్ర నష్టం మిగిల్చిన విషయం తెలిసిందే. ఆ కష్టం నుంచి నిడదవోలు, ఉండ్రాజవరం, నల్లజర్ల, దేవరపల్లి మండలాలకు చెందిన రైతులు ఇంకా తేరుకోలేదు. ఆయా మండలాల్లో ఎర్రకాలువ వరదలకు సుమారు 14 వేల ఎకరాల్లో 4,500 మంది రైతులకు చెందిన వరి, చెరకు, ఉద్యాన పంటలు ముంపునకు గురయ్యాయి. గత వైకాపా పాలనలో కాలువ నిర్వహణకు కనీస పనులను చేపట్టకపోవడంతో ఎర్రకాలువ పొంగిన సందర్భంలో గట్లకు గండ్లు పడి పంటచేలను ముంచెత్తింది. ఆ సమయంలో రైతులను ఓదార్చేందుకు వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పంటలు నష్టపోయిన రైతులను అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఆ మేరకు మంత్రి దుర్గేష్ పలు సందర్భాల్లో పంటలు నష్టపోయిన రైతులకు ఉత్పాదక రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) అందించాలని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడం, ఇటీవల జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలోనూ ఈ విషయం ప్రస్తావనకు రావడతో సీఎం స్పందించి ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్థికశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తుంది. పూర్తిగా వరిపంట నష్టపోయిన రైతులకు హెక్టారుకు రూ.17 వేలు నష్టపరిహారం అందించనున్నారు. ఈ సొమ్ము అందితే తమ కష్టాలు కొంత వరకు తీరుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**నిడదవోలు మండలంలోనే అధిక నష్టం...**

ఎర్రకాలువ వరద ప్రభావం నిడదవోలు మండలంలోని కోరుమామిడి, తాడిమళ్ల, ఉనకరమిల్లి, కంసాలిపాలెం, రావిమెట్ల, శంకరాపురం, సింగవరం, నిడదవోలు, తాళ్లపాలెం, శెట్టిపేట గ్రామాలపైనే ఎక్కువగా ఉంటుంది. వీటిలో సింగవరం, తాళ్లపాలెం, కంసాలిపాలెం గ్రామాల్లో మరింత అధికం. ఒక్క సింగవరంలోనే 575 హెక్టార్లలో వరిపంటకు నష్టం వాటిల్లింది. నిడదవోలులో 359, శంకరాపురంలో 145, శెట్టిపేటలో 396 హెక్టార్లలో నష్టపోయారు. ఉండ్రాజవరం మండలం కాల్దారి, సూర్యారావుపాలెం, పసలపూడి, దేవరపల్లి మండలం త్యాజంపూడి, నల్లజర్ల మండలంలో గుండేపల్లి, తెలికిచర్ల, అనంతపల్లి, నబీపేట, చోడవరం, పోతవరంలో ప్రభావం చూపుతుంది.

# చెరువులు వెలవెల.. రైతన్న విలవిల

జగిత్యాల : జిల్లాలోని పలు సాగు భూములకు, చేపల పెంపకానికి, భూగర్భ జలమట్టం స్థిరత్వానికి దోహదపడే చెరువులు, కుంటలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. అయితే జిల్లాలో జూన్‌లో 21 శాతం, జులైలో 25 శాతం లోటు వర్షపాతం నమోదు కావడంతో చిన్న నీటి వనరుల్లోకి నీరు చేరక వెలవెలబోతున్నాయి. మొత్తం 1226 చెరువులు, కుంటలకుగాను కేవలం జగిత్యాల అర్బన్, జగిత్యాల రూరల్ మండలాల్లోని 21 చెరువులు మాత్రమే పూర్తిగా నిండాయి.



జిల్లాలోని 110 చెరువులు 75 శాతం వరకు నిండగా.. మిగిలినవి అంతకన్నా తక్కువే ఉండటంతో సగటు భూగర్భ జలమట్టం పెరగడం లేదు. ఈ క్రమంలో ఎస్సారెస్పీ నీటిని విడుదలచేసి గొలుసుకట్టు చెరువులోకి తరలించాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఇటీవల విన్నవించారు. భారీ వర్షాలు కురిస్తే లేదా ఎస్సారెస్పీలోకి మరికొంత నీరు చేరితేనే చెరువులు కళకళలాడే అవకాశముంది.


# పరిశోధనలకు 'ప్రయాస్'

ఆత్మకూరు : ఉన్నత పాఠశాల విద్యార్థులను శాస్త్రీయమై పరిశోధన, ఆవిష్కరణల్లో ప్రోత్సహించేందుకు, పరిశోధనల్లో జిజ్ఞాస పెంచేందుకు జాతీయ విద్య, పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్టీ) ప్రయాస్ (ప్రమోషన్ ఆఫ్ రీసెర్చ్ ఆటిట్యూడ్ అమాంగ్ యంగ్ అండ్ యాస్పిరింగ్ స్టూడెంట్స్) అనే పథకాన్ని ప్రారంభించింది. అందులో భాగంగా 2025-26 విద్యా సంవత్సరానికి విద్యార్థుల నుంచి పరిశోధన ప్రాజెక్టు ప్రతిపాదనలను ఆహ్వానిస్తూ ఇటీవలే ప్రకటన విడుదల చేసింది.

**ఏం చేయాలంటే..**

విద్యార్థులు ఒక స్థానిక సమస్యను అధ్యయనం చేసి, ఆ సమస్యకు గల కారణాలను శాస్త్రీయంగా పరిశీలించాలి. పరిష్కారాలను కనుగొనేందుకు శాస్త్రీయ విజ్ఞానంతో కృషిచేయాలి. ప్రాజెక్టును ప్రారంభించి ఏడాదిలోపే పూర్తిచేయాలి.

ఎంపికైన పరిశోధన కోసం రూ.50వేల గ్రాంటు లభిస్తుంది. అందులో




విద్యార్థులకు రూ.10 వేలు, పాఠశాల ఉపాధ్యాయులు, ఉన్నత విద్యాసంస్థ నిపుణుడికి రూ.20 వేల చొప్పున అందుతాయి. పూర్తి వివరాల కోసం %https:///ncert.nic.in% వెబ్‌సైట్‌లో ప్రయాస్ గైడ్‌లైన్స్‌పై క్లిక్ చేసి పరిశీలించవచ్చు

**అర్హతలు, నిబంధనలు..**

తొమ్మిది నుంచి 11వ తరగతి వరకు చదువుతున్న అన్ని పాఠశాలల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు ఒక విద్యాలయం నుంచి ఒకరు లేదా ఇద్దరు విద్యార్థులు, ఆ పాఠశాలలో భౌతిక, రసాయన, జీవ శాస్త్రం లేదా గణితం బోధించే ఒక (పీజీటీ/టీజీటీ) ఉపాధ్యాయుడు, ఏదైనా ఒక ఉన్నత విద్యాసంస్థ, పరిశోధన సంస్థ నిపుణుడితో కలిసి పరిశోధన ప్రాజెక్టు సమర్పించాలి.ఒక పాఠశాల నుంచి ఒక దరఖాస్తును మాత్రమే అనుమతిస్తారు.

**ముఖ్యమైన తేదీలు..**దరఖాస్తు చేసేందుకు చివరి తేదీ 17 ఆగస్టు 2025 దరఖాస్తుల స్క్రీనింగ్ తేదీ సెప్టెంబరు 15

జ్యూరీ ఎంపిక గడువు సెప్టెంబరు 30

ఫలితాల ప్రకటన అక్టోబరు 15

# కట్టలు తెంచి.. కలిపేసుకుంటున్నారు

జహీరాబాద్ : అంతర్రాష్ట్ర సరిహద్దు పట్టణం జహీరాబాద్‌లో నాలాలు, వాగులకు రక్షణ కరవైంది. కొందరు స్థిరాస్తి వ్యాపారులు వాటిని దర్జాగా ఆక్రమిస్తూ.. వెంచర్లలో కలిపేస్తున్నారు. భూదందా యథేచ్ఛగా కొనసాగుతున్నా.. అడ్డుకునేవారు కరవయ్యారు. ఆక్రమణలను అడ్డుకోవాల్సిన మున్సిపల్, నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోని తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**అడ్డగోలుగా ఎన్‌వోసీలు** జలవనరుల్లో నిర్మాణాలు చేపట్టవద్దని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. జహీరాబాద్ పట్టణ పరిధిలోని వాగులు, జల సంరక్షణ కోసం నిర్మించిన చెక్‌డ్యాంలు ఆక్రమణకు గురవుతున్నాయి. వెంచర్ల నిర్మాణానికి అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి నీటిపారుదలశాఖ అధికారులు ఇష్టానుసారం ఎన్‌వోసీలు జారీ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే నిరభ్యంతర ధ్రువపత్రాల జారీతో చెరువు శిఖం, చెక్‌డ్యాంలు, నాలాల ఆక్రమణలకు అడ్డుకట్ట పడటం లేదు. ఆక్రమణలను అడ్డుకునేందుకు జిల్లా అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టి జలవనరులు కాపాడాల్సిన అవసరం ఉందని పట్టణవాసులు కోరుతున్నారు.

**పట్టణం వేగంగా విస్తరిస్తుండటంతో..**

పారిశ్రామికవాడలు, నిమ్జ్, పవన, సౌర విద్యుత్తు కేంద్రాలతో జహీరాబాద్ పట్టణానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోంది. దీంతో పట్టణం శరవేగంగా విస్తరిస్తోంది. పురపాలికలో విలీనమైన గ్రామాల్లోనూ వందల ఎకరాల్లో కొత్తగా స్థిరాస్తి వ్యాపారులు వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. చెక్‌డ్యాంలు, వాగులు, నాలాలను కబ్జా చేసి.. వెంచర్లలో కలిపేసుకుంటున్నారు. అధికారులూ.. ఇటు చూడండిజహీరాబాద్-అల్గోల్ రోడ్డు పక్కన వెంచర్ నిర్వాహకులు వాగును కబ్జా చేసి గోడ నిర్మించారు.పస్తాపూర్ బైపాస్ రోడ్డు పక్కన వాగును ఆక్రమించి పైపులు వేసి దారి నిర్మించుకున్నారు.దిడ్గి శివారులో వెంచర్ మధ్యలో ఉన్నాయని రెండు చెక్‌డ్యాంలను స్థిరాస్తి వ్యాపారులు పూడ్చేశారు. రైతులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో పూడ్చిన మట్టిని తొలగించారు. ఇక్కడ రూ.50 లక్షలతో నిర్మించిన భారీ చెక్‌డ్యాంలు పూర్తిగా దెబ్బతిన్నాయి.

# ఎస్సారెస్పీ భూములకు ఎసరు!



పెద్దపల్లి : జిల్లాలో ఎస్సారెస్పీ భూములకు కబ్జాదారులు ఎసరు పెట్టారు. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎక్కడికక్కడే కబ్జాలకు పాల్పడుతున్నారు. కొందరు హద్దురాళ్లు తొలగించి సాగు చేయటం, భవన నిర్మాణాలు చేపట్టడం తదితర అక్రమాలకు పాల్పడుతున్నారు. వీటిపైనే ప్రతి సోమవారం జరిగే ప్రజావాణిలో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అక్రమాలలో నీటిపారుదల, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం లోపం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. భూములకు పక్కాగా హద్దులను నిర్ణయిస్తేనే రక్షణగా ఉంటాయి.

**కనీసం గుర్తించటం లేదు**

జిల్లాలో డీ-83 కింద ధర్మారం, జూలపల్లి, పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్, రామగుండం, మంథని, కమాన్‌పూర్, ముత్తారం, పాలకుర్తి, అంతర్గాం, రామగిరి, ఎలిగేడు మండలాల పరిధిలో 1.25 లక్షల ఎకరాలు, డీ-86 కింద జూలపల్లి, ధర్మారం, సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, పెద్దపల్లి మండలాల పరిధిలో 70 వేల ఎకరాలకు ఎస్సారెస్పీ ప్రాజెక్టు నీరు కాలువల ద్వారా సరఫరా అవుతోంది. అయితే కాలువలకు కుడి, ఎడమ వైపులా ఖాళీ స్థలాల్లో హద్దు రాళ్లు ఉండగా అక్రమార్కులు వాటిని తొలగిస్తూ కబ్జా చేస్తున్నారు. భూసేకరణకు సంబంధించి సక్రమంగా రికార్డులు లేకపోవడంతో కనీసం కబ్జాలను గుర్తించటం లేదు.

**చదును చేస్తూ..**

సుల్తానాబాద్ మండలం సుద్దాల తదితర ప్రాంతాల్లో కాలువ భూముల్లో భవనాలు నిర్మిస్తున్నారు. రైతులు, గ్రామస్థులు పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు లేవు. పెద్దపల్లి మండలం పెద్దబొంకూరు కాలువలో ఉపాధిహామీ పనులు జరుగుతుండగా.. కబ్జాదారులు అడ్డుకున్నారు. పెద్దకల్వల, నిట్టూరు, తుర్కలమద్దికుంటలో భూములను చదును చేస్తూ.. పొలాలుగా మార్చుతున్నారు. కాల్వశ్రీరాంపూర్, ఓదెలలో ఇదే పరిస్థితి ఉంది. పాలకుర్తి మండలం కన్నాలలో హద్దులు తేల్చకపోవడంతో అటవీశాఖ అధికారులు మొక్కలు నాటారు. క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లిన నీటిపారుదల శాఖ అధికారులు పాత రికార్డులను తిరిగేస్తున్నారు.

**నోటీసులు జారీ చేస్తున్నాం**

ఎస్సారెస్పీ కాలువ భూముల ఆక్రమణదారులు, హద్దురాళ్లు తొలగించిన వారిపై చర్యలు తీసుకుంటున్నాం. వారికి నోటీసులు జారీ చేస్తున్నాం. భూములను తమ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. కబ్జాకు గురికాకుండా వనమహోత్సంలో మొక్కలు నాటుతున్నాం. సత్యరాజ్ చంద్ర, నీటిపారుదల శాఖ ఎస్ఈ

# చెరువులను చెరబట్టి.. బఫర్‌జోన్‌లోకి చొరబడి



ఎల్లారెడ్డిపేట : సాగునీటి వనరులు కబ్జా కోరల్లో చిక్కుకుంటున్నాయి. ఎక్కువ సంఖ్యలోని సాగునీటి వనరులు గొలుసుకట్టుగా ఉన్నాయి. దాదాపు 12 వేల కిలోమీటర్ల పొడవునా పెద్ద కాలువలు విస్తరించి ఉండగా పిల్ల కాలువలు అంతకు రెట్టింపుగానే ఉండగా కొందరు అక్రమార్కులు చెరబడుతున్నారు. శిఖం భూములను ఆక్రమించడంతోపాటు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోకి చొరబడుతున్నారు. రెవెన్యూ, నీటిపారుదలశాఖల నడుమ సమన్వయ లోపం వల్ల జలవనరులు, కాల్వల ఆక్రమణ పర్వం యథేచ్ఛగా సాగుతోంది. వందల ఎకరాల విస్తీర్ణంలో సర్కారు భూములు పరాధీనమవుతున్నాయి. అయినప్పటికీ అధికారులు చర్యలు తీసుకున్న పాపానపోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**పరిశీలనకే పరిమితం**

శిఖం భూములను కబ్జా చేయడం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోకి చొరబడటం, విలువైన ప్రదేశాల్లో ఆయకట్టు కాల్వలను కలిపేసుకోవడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు మిన్నంటుతున్నాయి. నీటి పారుదలశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనకే పరిమితమవుతున్నారు. చర్యలు తీసుకునే అధికారం వారి చేతుల్లో లేకపోవడంతో ఏమీ చేయలేక మిన్నకుండిపోతున్నారు. కబ్జా ఆరోపణల నేపథ్యంలో నీటి వనరులు, ఆయకట్టు కాల్వలను రెవెన్యూ అధికారులు సర్వే చేసి, హద్దులు నిర్ణయించాల్సిన అంశం కార్యరూపం దాల్చడం లేదు. ఎఫ్‌టీఎల్ పరిధిలో పట్టాభూలున్న వారు ఆ ప్రాంతాన్ని చదును చేయడం, ఎత్తయిన గట్ల నిర్మాణాలు తదితర పనులు చేపట్టవద్దనే నిబంధనలు అమలు కావడం లేదు. కానీ కొందరు వ్యక్తులు ఈ భూమి తమదేనంటూ చెరువులు, కుంటల్లోని భూములను కమతాలుగా మలిచి, ఎత్తుగా మట్టిని పోస్తుండటంపై అధికార యంత్రాంగం దృష్టి సారించి శాశ్వత పరిష్కార మార్గాలు చూపాల్సి ఉంది.

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి పరిధిలోని సంగం చెరువు మత్తడి ఇది. చెరువు లోపలి వైపు పట్టా భూములున్న కొందరు వ్యక్తులు మత్తడి ప్రాంతంలోని భూమిని కమతాలుగా చేసి, ఎత్తుగా గట్లను నిర్మించారు. వెడల్పుగా ఉండాల్సిన మత్తడి కుచించుకుపోయింది.

ఎల్లారెడ్డిపేటలో కనిపించకుండా మారిన కాల్వ ఇది. ఓ వ్యక్తి కాల్వను కబ్జా చేసి, గోడను నిర్మించాడనే స్థానికుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు పరిశీలించి, గోడను కూల్చివేశారు. గతంలోనూ నేరుగా ఉండే ఈ కాల్వను అక్కడి స్థలదారులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పూడ్చివేసి, వంకరగా రోడ్డు పక్కగుండా తవ్వించారు. ఒకప్పుడు వెడల్పుతో ఉండే ఈ కాల్వ కబ్జాతో ఇప్పుడు ఇలా తయారైంది.

# అంజన్న చెంత తీరని దాహార్తి



జగిత్యాల : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయాన్ని ఏటా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన లక్షలాది మంది భక్తులు దర్శించుకుంటారు. భక్తుల కానుకలు, దుకాణ లీజు టెండర్ల ద్వారా ఏటా రూ.25 కోట్లకు పైగా ఆదాయం సమకూరుతోంది. ఏటికేడు భక్తుల రద్దీ పెరుగుతున్నా వసతులు సమకూరడం లేదు. ఆలయం వద్ద తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం దిశగా అడుగు ముందుకు పడటం లేదు. దశాబ్ద కాలం కిందట నిర్మించిన ఎత్తిపోతల పథకం నాణ్యతా లోపంతో మూతపడగా రెండేళ్ల కిందట ప్రారంభించిన పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి.

**నాడు నాణ్యత లోపం.. నేడు నిర్లక్ష్యం**

అంజన్న చెంత నీటి ఎద్దడి నివారణకు పదేళ్ల కిందట దాదాపు రూ.2.20 కోట్లతో తాటిపల్లి శివారులోని కొంపల్లె చెరువు వద్ద ఎత్తిపోతల పథకం నిర్మించారు. అక్కడి నుంచి కొండపైకి పైపులైన్ ద్వారా నీటిని సరఫరా చేశారు. అయితే పనుల్లో నాణ్యత లోపంతో కొద్ది రోజులకే పథకం విఫలమైంది.

దీంతో కొండపై నీటి ఎద్దడి శాశ్వత నివారణకు రెండేళ్ల కిందట భారాస ప్రభుత్వ హయాంలో భూమిపూజ చేశారు.

ముత్యంపేట శివారులోని వరద కాలువ నుంచి కొండపైకి నీటిని సరఫరా చేయడానికి రూ.13.43 కోట్లు మంజూరు చేశారు. పథకం పూర్తయితే వచ్చే 50 ఏళ్ల వరకు కొండపైన నీటి ఎద్దడి తలెత్తదని నిపుణులు చెబుతున్నారు.

**నిల్వ సామర్థ్యం పెరిగితేనే ప్రయోజనం**

సంతొల్లలొద్ది చెక్‌డ్యాంలో ప్రస్తుతం 2.15 మిలియన్ ఘనపుటడుగుల(క్యూబిక్ ఫీట్ల) నీటిని నిలువ చేసే అవకాశం ఉంది. దాన్ని 30 మిలియన్ క్యూబిక్ ఫీట్ల నిలువ సామర్థ్యానికి విస్తరించాల్సి ఉంది. దీంతో నిర్మాణ వ్యయం పెరుగుతుండటంతో ఇంజినీరింగ్ అధికారులు అంచనా వ్యయం పెంచాలని కోరుతూ ప్రతిపాదనలు పంపించారు.

**నిలిచిన పనులు**

ఎత్తిపోతల పథకంలో భాగంగా వరద కాలువ 81 కి.మీ. హద్దు వద్ద ఇన్‌టేక్ వెల్ తవ్వాలి. అక్కడి నుంచి 1.70 కి.మీ.ల దూరాన ఉన్న కొండగట్టు గుట్టల్లోని సంతొల్లలొద్ది చెక్‌డ్యాంలోకి నీటిని తరలించాలి. అక్కడి నుంచి కొండపైకి సరఫరా చేయాలి. ఈ మేరకు వరద కాలువ పక్కన ఇన్‌టేక్ వెల్ నిర్మాణం ప్రారంభించారు. ఆ తర్వాత అర్ధంతరంగా పనులు నిలిపివేశారు.

**రూ.22.97 కోట్లతో ప్రతిపాదనలు**

వరద కాలువ నుంచి చెక్‌డ్యాంలోకి నీటిని తరలించేందుకు చేపట్టిన ఎత్తిపోతలు పూర్తి చేసేందుకు అంచనా వ్యయాన్ని రూ.22.97 కోట్లకు పెంచుతూ ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు పూర్తి చేసి పథకాన్ని వినియోగంలోకి తీసుకొస్తాం. తిరుపతి, నీటిపారుదల శాఖ డీఈ, జగిత్యాల

# పట్టణ సుందరీకరణ.. పట్టని కార్యాచరణ?

కోరుట్ల : జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో 2019లో సుందరీకరణ పనులు చేపట్టాలని అప్పటి పాలకులు నిర్ణయించారు. ఇందుకోసం టీయూఎఫ్ఐడీసీ కింద ఒక్కో పట్టణానికి రూ.50 కోట్ల నిధులను గత ప్రభుత్వం మంజూరు చేసింది. రూ.25 కోట్ల చొప్పున రెండు విడతల్లో అభివృద్ధి పనులను చేపట్టారు. 63వ నంబరు జాతీయ రహదారి జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లోని ప్రధాన రహదారి గుండా వెళ్లడంతో.. ఈ రహదారి మధ్యలో అధునాతన డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, కూడళ్లు నిర్మించారు. ఇందులో భాగంగా కోరుట్ల పట్టణంలో సుమారు రూ.3.58 కోట్లతో సుందరీకరణ పనులను చేపట్టారు. రహదారిపై 4 కిలోమీటర్ల పొడవునా డివైడర్ల మధ్యలో కోనోకార్పస్, ఇతర మొక్కలను నాటించారు. అయితే గతేడాది కోనోకార్పస్ మొక్కలతో శ్వాసకోస వ్యాధులు సంక్రమిస్తాయనే ప్రచారంతో మున్సిపల్ అధికారులు వాటిని పూర్తిగా తొలగించారు. అనంతరం ఇతర నామమాత్ర మొక్కలు నాటించారు. దీంతో ఆకర్షణీయంగా ఉండే డివైడర్లు సుందరీకరణ కోల్పోయాయి.

**కళావిహీనంగా డివైడర్లు**

జగిత్యాల పట్టణంలో సుమారు 5 కిలోమీటర్ల పొడవునా డివైడర్ల మధ్యలో ఏర్పాటుచేసిన కోనోకార్పస్, ఇతర మొక్కల నిర్వహణ సక్రమంగా చేపట్టకపోవడంతో కూడళ్లు కళావిహీనంగా మారాయి. కొన్నేళ్లపాటు మొక్కల నిర్వహణ సక్రమంగా చేపట్టి నిర్లక్ష్యంగా వదిలేశారు. మరోవైపు మెట్‌పల్లి పట్టణంలో 3 కిలోమీటర్ల పొడవునా డివైడర్ల మధ్యలో నాటిన మొక్కల నిర్వహణ సక్రమంగా చేపట్టడంతో అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. క్రమం తప్పకుండా నిర్వహణతో పచ్చదనం సంతరించుకొని ప్రజలను ఆకట్టుకుంటుంది.

# సర్వేతో సరిపెట్టొద్దు

భద్రాచలం : వానాకాలంలో మన్యం అంటే గుర్తొచ్చేది కీటక జనిత వ్యాధులు. ప్రధానంగా మలేరియా.. అడవులు, తేమ వాతావరణం, కనీస సదుపాయాల లేమి.. ఏటా ఏజెన్సీలో దోమల వృద్ధికి కారకాలుగా మారుతున్నాయి. మన్యాన్ని మంచమెక్కిస్తున్నాయి. ఏళ్లు గడుస్తున్నా తూతూమంత్రం సర్వేలతో కాలంవెలిబుచ్చుతుండటంతో ఏటా విషజ్వరాలు బాధిస్తూనే ఉన్నాయి. మలేరియా, డెంగీ విస్తరిస్తూనే ఉన్నాయి. ఈ నెల 7 నుంచి 17 వరకు మన్యంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ర్యాపిడ్ ఫీవర్ సర్వే చేపడుతున్న నేపథ్యంలో కేసుల గుర్తింపులో పారదర్శకత పాటించాలి. జ్వరం ఉందంటే దాన్ని దాచి పెట్టకుండా నివేదికలను సిద్ధం చేస్తేనే లక్ష్యం సాకారం అవుతుంది. లేకుంటే పాత పరిస్థితులే పునరావృతమవుతాయి.

**ఎలా సాగుతుంది?**

జిల్లాలోని సిబ్బంది క్షేత్ర స్థాయిలో ప్రతీ రోజు 50 ఇళ్లను సందర్శిస్తారు. ఇలా 11 రోజులపాటు, ప్రతీ ఇంటికి నేరుగా వెళ్లి ఆరోగ్య సమాచారం సేకరిస్తారు. జ్వర లక్షణాలుంటే రక్త పూతలను సేకరించి ప్రాథమికంగా వ్యాధిని నిర్ధారిస్తారు. జ్వరాలు ఎక్కువగా ఉంటే ఆ ప్రాంతంలో వైద్య శిబిరాలను ఏర్పాటుచేస్తారు. ఇంకా ఎక్కువ స్థాయిలో సేవలు అవసరం అనిపిస్తే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి బాధితులను తరలిస్తారు.

**ఇవన్నీ లోపాలే**



దోమలు కుట్టకుండా నియంత్రించటంలో దోమతెరలది కీలక పాత్ర. అయిదేళ్ల క్రితం 51వేల దోమతెరలు పంచారు. నాలుగేళ్ల క్రితం 1.6 లక్షల తెరలు వచ్చాయి. 2023 వర్షాకాలం వరకు వీటిని సర్దుబాటు చేశారు. మళ్లీ లక్ష దోమతెరలు అవసరమని ప్రతిపాదనలు పంపినా, రెండేళ్లు దాటినా వీటి జాడే లేదు.

దోమల మందు పిచికారీలోనూ లోపాలున్నాయి. ఇప్పటికే తొలి విడత ప్రక్రియ పూర్తయింది. సాధారణంగా మలాథియాన్ హైరిస్క్ గ్రామాల్లోని గిరిజనుల ఇళ్లలో చల్లి మిన్నకుంటున్నారు. దీంతో ప్రయోజనం ఉండదు. వారు ఉండే సామూహిక ప్రదేశాల్లోనూ పిచికారీ చేయాలి. రెండో విడతలో అయినా ఈ జాగ్రత్త పాటించాలి.

వెయ్యిమంది జనాభా ఉన్న గ్రామాల్లో రెండు కేసులు నమోదైతే వాటిని హైరిస్క్‌గా గుర్తిస్తారు. ఈ ఏడాది 119 గ్రామాలను ప్రకటించారు. ప్రైవేటు వైద్యశాలల్లో నమోదైన కేసులను పరిగణలోకి తీసుకుంటే బాధిత గ్రామాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. గొత్తికోయ ఆవాసాలు, ఇటుక బట్టీల్లో పని చేసే వలసవాసుల వద్దకు వెళ్లి పూర్తి స్థాయి పరీక్షలు నిర్వహించినా ఈ విషయం అర్థమవుతుంది.

గ్రామాల్లో ప్రతి విధిగా ఫ్రైడే డ్రైడే నిర్వహించాలి. పరిసరాల శుభ్రంతోపాటు రక్షిత నీళ్ల ట్యాంకులను బాగుచేయాలి. ఈ ప్రక్రియ అధ్వానంగా సాగుతోంది. కొన్నిపంచాయతీల్లో నిధులలేమి కారణంగా చెబుతున్నారు. గంబూషియా చేప పిల్లలను ఎక్కడా వదలట్లేదు. వర్షాకాలంలో అయినా విధిగా ఇవన్నీ చేస్తే విష జ్వరాలను అడ్డుకోగలం.

ఈ ఏడాది నమోదైన జ్వరాలు

డెంగీ: 45

మలేరియా: 45

జిల్లాలో పాల్వంచ, చర్ల, దుమ్ముగూడెం, ఇల్లెందు, అశ్వారావుపేట, మణుగూరు, భద్రాచలం వంటి చోట్ల జ్వర కేసులు నమోదవుతూనే ఉన్నాయి. సర్వే తర్వాత బాధితుల సంఖ్యపై మరింత స్పష్టత రానుంది.

'ర్యాపిడ్ ఫీవర్ సర్వేకు అన్ని ఏర్పాట్లు చేశాం. సిబ్బంది క్షేత్ర స్థాయిలో ప్రతీ ఇంటికి వెళ్లి పరీక్షలు చేస్తారు. కేసుల నమోదులో పూర్తి పారదర్శకత పాటించేలా నిర్దేశించాం. ప్రభుత్వ ఆసుపత్రిల్లో తగిన పరీక్షలతో పాటు చికిత్సలు అందిస్తాం.

డా.సైదులు, భద్రాచలం అడిషనల్ డీఎంహెచ్ఓ

# ఉచితం.. ఇలా సద్వినియోగం

సత్తుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. మొదటి విడతలో ఖాళీ స్థలాలు ఉండి ఇళ్లు లేని పేదలకు ప్రాధాన్యమిచ్చింది. దీంతో కష్టమైనా లబ్ధిదారులు గృహాలు నిర్మించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. మొన్నటి వరకు ఆషాఢ మాసం కావటంతో కొందరు పనులు ప్రారంభించలేదు. తాజాగా శ్రావణమాసం ప్రవేశించటంతో ఉత్సాహంగా ముగ్గులు పోసుకోవడం, పునాదులు నిర్మించుకునే పనిలో ఉన్నారు. అధిక సంఖ్యలో నిర్మాణాలు ఉండటంతోపాటు తొలి విడతలో ఎక్కువమంది పేదలే కావటంతో వారికి లబ్ధి చేకూరేలా ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇవ్వాలని నిర్ణయించింది.

ఆయా మండలాలకు సమీపంలో వాగులను గుర్తించి ఉచితంగా ఇసుక సరఫరా చేసేలా అధికారులనూ ఆదేశించింది. ఇంతవరకూ బాగానే ఉన్న ఉచితంగా ఇసుకను పొందేందుకు సరైన విధానం తెలియక చాలామంది లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. విషయం ఏమిటంటే పంచాయతీ కార్యదర్శులు కూడా ఈ విషయంలో అయోమయానికి గురవుతున్నారు.

**ఇసుక పొందే విధానం ఇలా...**

ఒక్కో ఇందిరమ్మ ఇంటికి ప్రభుత్వం పది ట్రాక్టర్ల వరకు ఇసుక అందిస్తుంది.

ముగ్గు పోసుకున్న తర్వాత పునాది దశలో రెండు ట్రాక్టర్లు, గోడల నిర్మాణానికి రెండు, స్లాబ్‌కు నాలుగు, ప్లాస్టింగ్‌కు రెండు ట్రాక్టర్ల చొప్పున అందిస్తారు.

ఇందుకు అనుమతి కోరుతూ తొలుత హౌసింగ్ ఏఈ నుంచి లేఖను తీసుకోవాలి. దాన్ని స్థానిక మండల రెవెన్యూ అధికారికి ఇస్తే కార్యాలయంలో టోకెన్ అందిస్తారు.

టోకెన్ తీసుకుని కేటాయించిన వాగు వద్ద స్టాక్ యార్డుకు వెళ్లి ప్రతి ట్రక్కుకు మహిళా సంఘాల గ్రూపులకు రూ.200 చొప్పున చెల్లించాలి. ప్రయాణ ఛార్జీలు, ఇసుక లోడింగ్, అన్‌లోడింగ్ ఖర్చులను కూడా లబ్ధిదారుడే భరించాలి.

మొదటి దశ ఇళ్లు ఇలా..

ఖమ్మం: 16,153

భద్రాద్రి: 15,260

'లబ్ధిదారులు ఉచిత ఇసుకను సద్వినియోగం చేసుకోవాలి. సమీపంలో ఉన్న ప్రభుత్వ యార్డు నుంచి తెచ్చుకునే అవకాశం ఉంది. ఎంత త్వరగా నిర్మించుకుంటే అంత త్వరగానే బిల్లులు కూడా ఖాతాలకు జమవుతున్నాయి.'

బి.శ్రీనివాస్, హౌసింగ్ ఈఈ, ఖమ్మం

చురకలు



# గ్రేటర్‌లోకి మేడ్చల్ జిల్లా మున్సిపాలిటీలు!

మేడ్చల్ : గ్రామాలు లేని జిల్లాగా రూపు మార్చుకున్న మేడ్చల్ జిల్లాను గ్రేటర్‌లో విలీనం చేసేందుకు పురపాలక శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. వేగంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు, సికింద్రాబాద్ నుంచి తూంకుంట, సికింద్రాబాద్ నుంచి కొంపల్లి వరకు నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ల పనులు తొందరగా పూర్తిచేసేందుకు అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఆ జిల్లాలోని 4 శాసనసభ నియోజకవర్గాలు గ్రేటర్ పరిధిలో ఉన్నాయి. వీటికి అదనంగా 10 మున్సిపాలిటీలు, 4 కార్పొరేషన్లు జిల్లాలో ఉన్నాయి. వీటిని మినహాయిస్తే 34 పంచాయతీలు మాత్రమే ఉండగా అన్నింటినీ కలిపి 3 (అలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపేట) మున్సిపాలిటీలుగా మార్చారు. రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల రికార్డులను పురపాలకశాఖకు అప్పగించారు.

**అధికారులు.. సిబ్బంది పురపాలక, మాతృశాఖలకు**

పంచాయతీల్లో కార్యదర్శులుగా విధులు నిర్వహించినవారు, ఎంపీడీవోలను నేరుగా పురపాలకశాఖలో కలిపేసుకుంటున్నారు.



ఇప్పటివరకూ వారు విధులు నిర్వహించిన సంవత్సరాలను సర్వీసుగా పరిగణించారు. అధికారులు, సిబ్బంది ఎక్కువగా ఉన్న మున్సిపాలిటీల్లో మాత్రం పంచాయతీరాజ్ శాఖ అధికారులను, సిబ్బందిని మాతృశాఖకు పంపుతున్నారు. ఇక పంచాయతీల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహించిన వారిని వార్డుల్లో పనివిధానం, ఇతర కార్యకలాపాలను దృష్టిలో ఉంచుకొని ఉద్యోగం ఇస్తున్నారు. సర్వే కేంద్రాలు, పంచాయతీల్లోని పన్నుల వసూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ గ్రామాల్లో పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందికీ ఉద్యోగాలు ఇస్తున్నారు.

**ఉపాధిహామీ లేనట్లే**

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ కింద ఏటా 110 పనిదినాల్లో పనికల్పిస్తుంటారు. 34 పంచాయతీలు మున్సిపాలిటీలుగా మారడంతో ఉపాధిహామీ వర్తించదు. జిల్లాలో 17 వేల జాబ్ కార్డులుండగా క్రియాశీలకంగా పనిచేసే 6 వేల మందికి రూ.3 కోట్ల వరకు చెల్లించే వారు. ఉపాధిహామీ లేనందున మున్సిపల్ అధికారులు పట్టణ అభివృద్ధి నిధుల కింద మొక్కలు నాటించి కూలీ చెల్లించనున్నారు.

# కాసుల కక్కుర్తి.. గర్భవిచ్ఛిత్తి

భువనగిరి : జిల్లా కేంద్రంలో గర్భవిచ్ఛిత్తి నిర్భయంగా చేస్తున్నారు. జనరల్ ఆసుపత్రి సమీపంలో ప్రైవేటు ఆసుపత్రి కేంద్రంగా లింగ నిర్ధారణ, భ్రూణహత్యల దందాకు తెరదీశారు. లింగనిర్ధారణ పరీక్షలు చేసి మరీ ఆయువు తీస్తున్నారు. భువనగిరిలో గాయత్రి ఆసుపత్రిలో ఇద్దరు మహిళలకు గర్భవిచ్ఛిత్తి చేస్తూ ఇద్దరు వైద్యులు పోలీసులకు పట్టుబడిన నేపథ్యంలో జిల్లాలో అధికారులు పర్యవేక్షణపై కథనం.

**కొరవడిన పర్యవేక్షణ**

జిల్లాలో ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలపై నిఘా లేకపోవడంతో లింగ నిర్ధారణ చేసి గర్భవిచ్ఛిత్తి(అబార్షన్)కి పాల్పడుతున్నారు. ఒకవేళ పట్టుబడినా అధికారులు అండతో మరోపేరుతో స్కానింగ్ కేంద్రాలు, ఆసుపత్రులు ప్రారంభిస్తున్నారు. తాజాగా గాయత్రి ఆసుపత్రిలో అబార్షన్లు చేసిన డాక్టర్ శివకుమార్ గతంలో స్వాతి ఆసుపత్రిలో ఇదే విధంగా చేయడంతో ఆసుపత్రిని సీజ్ చేశారు. మరొకరి పేరుతో ఆసుపత్రిని నిర్వహిస్తున్నారు. భువనగిరితో పాటు, తుర్కపల్లి, బొమ్మలరామారం, వలిగొండలో గతంలో సీజ్ చేసిన కేంద్రాలు మరోపేరుతో కొనసాగుతూ లింగ నిర్ధారణకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో అబార్షన్‌కు రూ.30 వేల నుంచి రూ.70 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఆర్ఎంపీలు గుట్టుచప్పుడు కాకుండా లింగనిర్ధారణ, అబార్షన్లు చేసే ఆసుపత్రుల వద్దకు గర్భిణులను




తీసుకొస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. పీసీపీఎన్‌డీటీ(ప్రీ కన్‌సెప్షన్స్ ప్రీనెటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్) ప్రత్యేక తనిఖీలో భాగంగా జిల్లాలో బృందం ఇటీవల ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేసింది. జిల్లాలో అనుమతి పొందినవి 57 కేంద్రాలు ఉండగా ప్రస్తుతం 41 మాత్రమే నడుస్తున్నాయి. వాటిలో 38 కేంద్రాల్లో బృందం తనిఖీలు నిర్వహించింది.

**చట్టం ఏం చెబుతోంది**

భ్రూణ హత్యలను నిలువరించేందుకు ప్రభుత్వం 1994లో పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని తీసుకొచ్చింది. దీని ప్రకారం లింగ నిర్ధారణ నిర్వహించే స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులకు, గర్భవిచ్ఛిత్తి(అబార్షన్) చేసిన వైద్యులు, ప్రోత్సహించిన కుటుంబ సభ్యులకు గరిష్ఠంగా ఏడేళ్ల జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా విధించే అవకాశం ఉంది. అయినా బెదరకుండా అధికారులు అండతో అనుమతులు పొంది మరోపేరుతో ఆసుపత్రులు తెరచి లింగనిర్ధారణ, భ్రూణహత్యలు చేస్తున్నారు.

**తనిఖీలపై సందేహాలెన్నో..**

భువనగిరిలోని గాయత్రి ఆసుపత్రి నిర్వహిస్తున్న డాక్టర్ శివకుమార్ విదేశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. భారతదేశంలో నేషనల్ మెడికల్ కమిషన్ నిర్వహించే విదేశీ వైద్య పరీక్ష(ఎఫ్ఎంజీఈ) ఉత్తీర్ణత సాధించలేదు. శివకుమార్ భార్య గాయత్రి విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసినట్టు ఆమె ఆసుపత్రి డైరెక్టర్‌గా ఉన్నారు. పీసీపీఎన్‌డీటీ ప్రోగ్రామ్‌లో భాగంగా ఆసుపత్రిలో ఇటీవల అధికారుల బృందం తనిఖీలు చేసి నెలరోజులు కూడా కాలేదు. అన్నీ సవ్యంగానే ఉన్నాయని బృందం తేల్చడం పలు అనుమానాలకు తావిస్తోంది.

# కుదిరిన సయోధ్య



హైదరాబాద్: కంటోన్మెంట్‌లో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి మార్గం సుగమమైంది. రూ.960 కోట్లతో పనులు చేపట్టేందుకు రక్షణ శాఖ, బల్దియా మధ్య సయోధ్య కుదిరింది. బల్దియా కమిషనర్ ఆర్వీ.కర్ణన్ అధ్యక్షతన ఆయన కార్యాలయంలో జరిగిన సమావేశంలో జీహెచ్ఎంసీ, రక్షణశాఖ, రెవెన్యూ అధికారులు సుదీర్ఘంగా చర్చించారు. పైవంతెన పనులకు వారంరోజుల్లో టెండర్లు పిలవాలని ఇంజినీర్లను కర్ణన్ ఆదేశించారు. 2 నెలల్లో పనులు మొదలవుతాయి.

**ఏళ్లనాటి సమస్య..**సఫిల్‌గూడ, మల్కాజిగిరి, ఆర్కేపురం, సైనిక్‌పురి, ఈసీఐఎల్ ప్రాంతాల నుంచి సికింద్రాబాద్‌కు రాకపోకలకు ఆర్మీ ఆర్డినెన్స్ సర్కిల్(ఏఓసీ) రహదారుల నుంచి వెళ్లాలి. అయితే ఈస్ట్‌మారేడుపల్లి ఏఓసీ గేటును అప్పుడప్పుడు సైన్యాధికారులు మూసేస్తుంటారు. దీంతో ప్రజలు 5 కి.మీ అదనంగా ప్రయాణించి మల్కాజిగిరి మీదుగా మెట్టుగూడ వద్ద సికింద్రాబాద్ చేరుకుంటున్నారు.

**భూమికి బదులు భూమి..:** ఏఓసీలోని 4 రోడ్ల పొడవు 8.8 కి.మీ. వాటికి ప్రత్యామ్నాయంగా జీహెచ్ఎంసీ 6 కి.మీ ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించనుంది. ఈక్రమంలో 35 ఎకరాల భూమిని రక్షణ శాఖ కోల్పోతోంది. కొన్ని భవనాలను కూడా కూల్చాలి. అందుకు రూ.442 కోట్ల నష్టపరిహారం చెల్లిస్తామని జీహెచ్ఎంసీ ప్రతిపాదించగా ఆ ధరతో సమానమైన భూమి ఇవ్వాలని రక్షణ శాఖ కోరింది. దీనిపై ఇన్నాళ్లూ ఏకాభిప్రాయం కుదరలేదు. తాజా అల్వాల్, శామీర్‌పేట, జవహర్‌నగర్, తదితర మండలాల పరిధిలో 100 ఎకరాలు రక్షణశాఖకు ఇవ్వనున్నారు. మరో 7 ఎకరాల భూమికి పరిహారం ఇవ్వకుండా ఏటా లీజు రుసుము చెల్లించేట్టు ఒప్పందం కుదిరింది.

కారిడార్ పొడవు.. 6 కి.మీ, వెడల్పు.. 100 అడుగులు
భూసేకరణ చేపట్టాల్సిన ఆస్తులు.. 11
అంచనా వ్యయం.. రూ.498.10 కోట్లు
వాటి విస్తీర్ణం.. 42.202
ఎకరాల రక్షణ శాఖ భూమి, 3,451.98
చ.గజాల రైల్వే భూమి, 1,477 చ.గజాల ప్రైవేటు భూములు

# భూములు అరకొర.. పనులకు తొందర



హైదరాబాద్: పెరుగుతున్న ఆకాశహర్మ్యాలు.... అవుటర్‌చుట్టూ విస్తరిస్తున్న వాణిజ్య కేంద్రాలు... ప్రాంతీయ వలయ రహదారి వరకు విద్యాసంస్థలు, పరిశ్రమలు, డేటా కేంద్రాలు, ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలతో వేగంగా నగరం విస్తరిస్తోంది. వీటికి తగినట్టు పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్‌ను తట్టుకునేందుకు కొత్తగా 33/11కేవీ ఉపకేంద్రాల నిర్మాణాలకు దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) ప్రణాళికలు రూపొందించింది. వీటి నిర్మాణానికి పలుచోట్ల ప్రభుత్వ స్థలాలు కేటాయించినా.. మెట్రోజోన్, రంగారెడ్డి జోన్‌లో టైటిల్ వివాదాలతో అడుగు ముందుకు పడటం లేదు. ఉపకేంద్రాల నిర్మాణానికి మూడుసార్లు గ్లోబల్ టెండర్లు పిలిచినా స్థలాలు లేనిదే కట్టేదెలా అని ఏ సంస్థ సిద్ధం కావడం లేదు.

**డిమాండ్ పెరిగినా..:** నగరంలో 5వేల మెగావాట్ల డిమాండ్ తట్టుకునేలా విద్యుత్తు ఉపకేంద్రాలు, లైన్లు ఉన్నాయి. ఈ ఏడాది వేసవిలో డిమాండ్ ఐదువేల మెగావాట్లకు తాకే అవకాశం ఉందనే అంచనాతో ఇప్పటికే ఉన్న ఉపకేంద్రాల్లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచారు. లేనిచోట కొత్త ఉపకేంద్రాలను ప్రతిపాదించారు. వచ్చే ఐదేళ్లకు 61 ఉపకేంద్రాల అవసరం ఉందని గత ఏడాది అంచనా వేశారు. ఆ తర్వాత ఈ సంఖ్య మరో 20కి పెరిగింది. ఉపకేంద్రం ఏర్పాటుకు డిస్కం గుర్తించిన స్థలాలు రెవెన్యూశాఖతో పాటూ అటవీ, జీహెచ్ఎంసీ, పోలీసు శాఖలకు చెందినవి ఉన్నాయి. ఆయా సంస్థలకు డిస్కం గతంలో లేఖలు రాసింది.

మెట్రోజోన్‌లో 18 చోట్ల, రంగారెడ్డి జోన్‌లో 25 చోట్ల ప్రతిపాదించారు. ఈ మేరకు కొన్నిచోట్ల స్థలాలను ఆయా విభాగాలు కేటాయించగా.. మరికొన్ని చోట్ల కేటాయించిన భూములపై వివాదాలు నడుస్తున్నాయి. అత్తాపూర్‌లో 33/11కేవీ ఉపకేంద్రం నిర్మాణం కోసం కేటాయించిన స్థలంపై వివాదం నెలకొనడంతో..మరోచోట స్థలానికి విద్యుత్తు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

పాతబస్తీలో స్థలాల కొరత అధికంగా ఉంది. కొన్నిచోట్ల కోర్టు కేసులున్నాయి.

ఈ రెండు జోన్లలో స్థలాల లభ్యత ఉన్న ఆరేడు చోట్ల ఉపకేంద్రాల నిర్మాణాలు వేర్వేరు దశలో ఉన్నాయి.

ఇండోర్‌తో సరిపెట్టుకోవాల్సిందేనా..?

ఒక్కో 33/11కేవీ ఉపకేంద్రానికి 1500 నుంచి 2000 చదరపు గజాల భూముల అవసరం ఉంటుందని ఇంజినీర్లు చెబుతున్నారు. ఇక్కడ అవుట్‌డోర్ ఉపకేంద్రాన్ని తక్కువ వ్యయంతో రెండు నెలల్లో నిర్మించుకునేందుకు వీలు ఉంటుంది. భవిష్యత్తులో విస్తరణను తగినట్టు ఆయా ప్రాంతాల్లో విద్యుత్తు కార్యాలయాల ఏర్పాటుకు కూడా స్థలాలను వినియోగించుకునేందుకు కోరుతున్నారు. పెద్దగా విస్తీర్ణం అవసరం లేకపోయినా.. అందులో నాలుగోవంతు ఇచ్చినా ఇండోర్ సబ్‌స్టేసన్ కట్టేస్తామని అధికారులు చెబుతున్నారు.

# హద్దులు మీరి ఆక్రమణలు



సిరిసిల్ల: జిల్లాలోని సగానికిపైగా చెరువుల్లో ఆక్రమణదారులు నకిలీ పట్టాలు సృష్టించి సాగుకు యోగ్యంగా మార్చుకున్నారు. పట్టణాలు, మండల కేంద్రాల్లో ఏకంగా ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు ఆరు వందల చెరువులు ఉన్నాయి. జిల్లాలో సాగుకు యోగ్యంకాని సుమారు 30 వేల ఎకరాలను ప్రభుత్వం గుర్తించింది. ఆక్రమణదారులు ఇప్పటికే రైతుబంధు పేరిట రూ.లక్షల్లో ప్రజాధనాన్ని స్వాహా చేశారు. అదీ చాలదన్నట్లు ప్లాట్లుగా చేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అమాయకులను మోసం చేస్తున్నారు.

**వరదకాల్వలు పూడ్చి.. వెంచర్లు వేసి**

పట్టణ ప్రాంతాల్లో నీటిపారుదల, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లేమితో జల వనరులు ఆక్రమణ యథేచ్ఛగా జరుగుతోంది. చెరువుల శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలోని భూములకు అక్రమ పట్టాలు సృష్టిస్తున్నారు. చెరువుల్లోకి వచ్చే వరదకాల్వలను పూడ్చివేసి నీరు రాకుండా చేస్తున్నారు. ఈ చెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతాల్లో చదును చేస్తూ ప్లాట్లుగా మార్చుతున్నారు. దీంతో పలు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. ఇలాంటివి వేములవాడ, సిరిసిల్ల పట్టణాల్లో 12 వెంచర్లలో వందల ఎకరాలు ఉన్నట్లు గుర్తించారు. 8 వెంచర్లకు అనుమతులు ఇవ్వకుండా అధికారులు పక్కన పెట్టారు. కొన్నిచోట్ల వరదకాల్వలలోనే ప్లాట్ల చేశారు. అలాంటి వాటికి అధికారులు ఇంటి అనుమతులు ఇవ్వకుండా నిషేధిత జాబితాలో ఉంచారు. కొన్ని చెరువులకైతే వాటి విస్తీర్ణం, ఎఫ్‌టీఎల్ పరిధి తదితర అంశాలపై సరైన పత్రాలు కూడా లేవు.

ఇటీవల భూభారతి చట్టంలో భాగంగా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. గతంలో పట్టాలు పొంది.. స్థానికంగా భూములు చూపక ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న వారు.. పట్టాలు లేకుండా సాగు చేసుకుంటున్న వారు.. హద్దులు లేకుండా ఇబ్బందులు పడుతున్న వారు దరఖాస్తులు పెట్టుకున్నారు. వీరంతా సర్వేనంబర్ల వారీగా భూముల విస్తీర్ణం.. హద్దులు తేలక ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని ఆక్రమణలు కొనసాగుతున్నాయి.

**సర్వేతో సమస్యలు దూరం**

చెరువులు, ప్రభుత్వ భూములను సర్వే చేసి, చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణాలు చేపట్టాలని గతంలో రాష్ట్ర నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

హద్దులు నిర్ణయించేందుకు సర్వేయర్ల కొరత, నిధుల కేటాయింపుల్లేక అవి బుట్ట దాఖలయ్యాయి. ప్రస్తుతం భూభారతి చట్టం అమల్లో భాగంగా రెవెన్యూ గ్రామానికి ఒకరి చొప్పున జీపీవోల నియామకం చేపట్టనున్నారు. అలాగే సర్వే వ్యవస్థ బలోపేతం చేసేందుకు జిల్లాలో అర్హులైన సర్వేయర్లకు శిక్షణ ఇస్తున్నారు. అది ఈ నెల 20తో ముగియనుంది. భూభారతి అర్జీలలోని ఆక్రమణలకు గురైన చెరువులు, ప్రభుత్వ భూములను సర్వేచేసి.. హద్దులు నిర్ణయిస్తే జిల్లాలో సగానికి పైగా భూసమస్యలు తీరుతాయి.

# అరకొర సేవలే

హైదరాబాద్ – సికింద్రాబాద్, కాప్రా, కార్వాన్, పేట్‌బషీరాబాద్, అమీర్‌పేట్, న్యూస్‌టుడే: పేదలకు వ్యాధి నిర్ధారణ పరీక్షల భారం తగ్గించాలని గ్రేటర్‌లో ఏర్పాటు చేసిన డయాగ్నస్టిక్ మినీహబ్‌ల్లో అరకొర సేవలే అందుతున్నాయి. ఏరియా ఆసుపత్రులకు, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు అనుసంధానంగా 18 ప్రాంతాల్లో ఏర్పాటు చేసి మొత్తం 53 రకాల సేవలు అందుబాటులోకి తెచ్చారు. రక్త, మూత్ర పరీక్షలతోపాటు ఎక్స్‌రే, థైరాయిడ్ పరీక్షలను అక్కడే నిర్వహించి గాంధీ, ఉస్మానియా ఆసుపత్రులపై భారం తగ్గించాలనేది వీటి ఉద్దేశం. చాలాప్రాంతాల్లో సజావుగా సాగడం లేదనే ఫిర్యాదులపై 'ఈనాడు' పరిశీలించగా ఎక్కడా అన్నిరకాల పరీక్షలు చేయడం లేదని తేలింది.

**వివిధ కేంద్రాల్లో సేవలు ఇలా..**

అమీర్‌పేట్‌లో ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో డయాగ్నస్టిక్ కేంద్రంలో స్కానింగ్, ఎక్స్‌రే, ఈసీజీ మాత్రమే చేస్తున్నారు. మిగిలిన పరీక్షలకు రక్త నమూనాలను నారాయణగూడలోని ఐపీఎంకు పంపుతున్నారు. సీతాఫల్‌మండి ఆసుపత్రిని 70 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు



నిర్మాణాలు చేపట్టడంతో ప్రస్తుతం థైరాయిడ్ ప్రొఫైల్, విటమిన్ బి12, విటమిన్ డి3 పరీక్షలు చేయడం లేదు.

కార్వాన్ పన్నీపురాలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి అనుసంధానంగా డయాగ్నస్టిక్ హబ్‌ను అందుబాటులోకి తెచ్చారు. ల్యాబ్ టెక్నీషియన్ ఒక్కరే ఉన్నారు. షాపూర్‌నగర్‌లో రక్త పరీక్షల పరికరాలు లేవు. ఫలితంగా కంప్లీట్ బ్లడ్ పిక్చర్ (సీబీపీ) చేయడం లేదు. కుషాయిగూడ పీహెచ్‌సీలో తెలంగాణ డయాగ్నస్టిక్ మినీ హబ్‌ను 2022లో ఏర్పాటు చేశారు. అల్ట్రాసౌండ్ స్కానింగ్ సోమ, బుధ, గురువారాల్లో నిర్వహిస్తున్నారు. ఈసీజీ, ఎక్స్‌రే, డెంగీ, మలేరియా, హిమోగ్లోబిన్, హెచ్ఐవీ, హెపటైటిస్, వీడీఆర్ఎల్, ప్రెగ్నెన్సీ, మూత్రం, కళ్లె పరీక్షలు చేస్తున్నారు. థైరాయిడ్, లిపిడ్‌ప్రొఫైల్, కిడ్నీ, లివర్, ఆర్ఎఫ్‌టీ, ఎల్ఎఫ్‌టీ కోసం బయటకు పంపుతున్నారు.

# ఎదుగుదలలేని మొక్కలు.. వృథాగా నిధులు

సారంగాపూర్: ఏటా వన మహోత్సవంలో భాగంగా సమయానికి గ్రామాల్లో మొక్కలు నాటడంతో వాటి ఎదుగుదల లేకపోవడంతో నిధులు వృథా అవుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని వచ్చే ఏడాది మొక్కలు నాటేందుకు ప్రభుత్వం ఇప్పటినుంచే దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఇప్పటికే గ్రామాల్లోని నర్సరీల్లో ప్రక్రియ ప్రారంభించి లక్ష్యాన్ని నిర్దేశించారు. జిల్లా వ్యాప్తంగా నీడనిచ్చే 13 రకాలకుపైగా మొక్కలను ఎంపిక చేసి విత్తనాలు విత్తుతున్నారు.

**17 లక్షల పెంపకం**

జిల్లాలో 17 లక్షల మొక్కలను పెంపకం చేపట్టేందుకు మండలాల వారీగా ప్రక్రియ ప్రారంభించారు. జిల్లాలో 383 పంచాయతీలుండగా..



279 పంచాయతీలలో స్థలాలను ఎంపిక చేశారు. ఇందులో 278 ప్రభుత్వ స్థలాలు, ఒకటి ప్రైవేట్ స్థలంలో పెంచుతున్నారు. 17.02 లక్షల కవర్లలలో మట్టిని నింపి సిద్ధం చేయగా 9,18,300 కవర్లలలో వివిధ రకాల నీడనిచ్చే విత్తనాలు విత్తారు.

**మీటరుకు పైగా పెరగాల్సిందే**

గ్రామాల్లో పెంచుతున్న మొక్కల పెంపకం కేవలం నామమాత్రంగా, వర్షాలు ప్రారంభానికి కొద్దినెలల ముందు నుంచి ప్రక్రియ ప్రారంభించి పెంచుతుండడంతో పెరగడంలేదు. దీంతో ఏడాది ముందు నుంచే ప్రణాళికాబద్ధంగా పెంపకం చేపట్టాలని అధికారులు భావించారు. కనీసం ప్రతి మొక్క మీటరుకు పైగా పెరిగేలా చూడాల్సి ఉంటుంది. ఇందుకు మూడుసార్లు కవర్లలలో పెరిగిన మొక్కను మార్చాల్సి ఉంటుంది. రహదారుల పక్కన నాటేందుకు రావి, అల్లనేరడి, ఇప్ప, రేలా, వేప తదితర వంటి మొక్కల విత్తనాలను విత్తుతున్నారు.

**ఏపుగా పెరిగే అవకాశం**

ఏటా ముందస్తుగా మొక్కల పెంపకం లేకపోవడంతో సరైన ఎత్తులో అవి పెరగకపోవడంతో లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నాం. దీంతో ఇప్పటినుంచే వచ్చే ఏడాదికి సంబంధించినవి పెంచేందుకు నర్సరీల్లో ప్రణాళిక తయారుచేసి గ్రామాల వారీగా లక్ష్యాన్ని నిర్దేశించాం. ప్రస్తుతం మట్టి నింపే ప్రక్రియ పూర్తికాగా.. నీడనిచ్చే మొక్కల విత్తనాలు విత్తుతున్నాం. మదన్‌మోహన్, అదనపు డీఆర్డీవో

# అడ్డగోలుగా తవ్వుతున్నా.. వారికి మామూలే..!

కనగల్ : మంత్రి ఇలాకాలో ఇసుక దందా జోరుగు సాగుతోంది. అభివృద్ధి పథకాల పేరిటి రాత్రింబవళ్లు అక్రమంగా రవాణ చేస్తున్నారు. రాత్రి వేళల్లో పొక్లెయిన్‌లు వాగులో వాలుతున్నాయి. ఇలా 10 నుంచి 15 వరకు ఆయా గ్రామాల్లో పొక్లెయిన్‌లు నడుస్తున్నాయి. ఇసుక అక్రమ రవాణాదారులు వంతెనల కిందనే ఇసుకను తోడేస్తూ.. ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. నిత్యం గ్రామం నుంచి జిల్లా స్థాయి అధికారులు కనగల్ వంతెన నుంచే వెళ్తున్నా.. పోలీస్‌స్టేషన్, తహసీల్ కార్యాలయాలు కూత వేటు దూరంలో ఉన్నా.. ఆయా అధికారులకు ఇది 'మామూళ్లు' విషయంగానే పట్టించుకోవడంలేదు. వంతెన వద్ద 15 అడుగుల మేరకు గుంతలు తవ్వి ఇసుకను రాత్రివేళల్లో తరలిస్తుంటే వంతెనకే కాక.. గుంతలు ప్రమాదకరంగా మారాయి. ఇలా ఆయా గ్రామాల్లోని వాగుల్లో పెద్దపెద్ద గుంతలు దర్శనం ఇస్తున్నాయి. కనగల్ వంతెన వద్ద ఇసుకను తరలిస్తుండటంతో భూగర్భజాలాలు అడుగంటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొక్లెయిన్‌లతో ఇసుకను నింపుతుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని యువత సామాజిక మాధ్యమాల్లో ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధి పథకాల పేరిట అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న విషయం అధికారులకు తెలిసినా పట్టుకుంటే ఎక్కడ బదిలీ బహుమతి వస్తుందోనని చూసీచూడనట్లుగా వెళ్తున్నారు. వాగులో తవ్వకాలు చేస్తున్న యంత్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

చురకలు



# పట్టాలు సృష్టించి.. నట్టేట ముంచి

కర్నూలు : ఓర్వకల్లులో రూ.50 కోట్ల విలువైన ప్రభుత్వ భూమికి కొందరు దొంగ పట్టాలు సృష్టించి విక్రయించారు. గత ప్రభుత్వ హయాంలో అక్రమాలు జరగ్గా తాజాగా వెలుగులోకి వచ్చాయి.
ఓర్వకల్లు పోలీసుస్టేషన్, తహసీల్దారు కార్యాలయ సమీపంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆనుకుని ఉన్న ఐదెకరాల ప్రభుత్వ భూమికి కొందరు అక్రమంగా పట్టాలు పుట్టించి అమ్మేశారు. సర్వే నంబరు 471/సిలో రెండెకరాలు, 614లో మూడెకరాలు, ఆదర్శ పాఠశాల సమీపంలో రెండెకరాలు, తహసీల్దారు కార్యాలయం ఎదురుగా సర్వే నంబరు 532/సిలో రెండెకరాల భూమికి పట్టాలు సృష్టించారు.

**సీల్, స్టాంపులు తయారుచేసి..** తహసీల్దారు కార్యాలయ సీల్, స్టాంపును తయారుచేసి పట్టాలపై ముద్రలు వేశారు. తహసీల్దారుగా గతంలో పనిచేసిన కృష్ణవేణి సంతకా న్ని ఫోర్జరీ చేశారు. ప్రభుత్వ స్థలంలో అనధికారిక లేఅవుట్ వేశారు. సెంటు రూ.2.50 లక్షలు, మరికొన్ని రూ.1.50 లక్షల చొప్పున అమ్మేశారు.

**ఒప్పందాలు చేసుకుని..**

కొన్ని ప్లాట్లు విక్రయించేందుకుగాను 2019 నుంచి ఒప్పందాలు కుదుర్చుకోవడం ప్రారంభించారు. ఎంత భూమిని.. ఎంత మొత్తానికి విక్రయిస్తున్నామన్న విషయాన్ని ఒప్పంద పత్రాల్లో రాసుకున్నారు. వీటికి 2019, 2020, 2021, 2022లో కుదుర్చుకున్నారు. 2006, 2011లో పట్టాలను జారీ చేసినట్లు చూపడం గమనార్హం.
ఓర్వకల్లు మండలంలో 2011లో పేదలకు పట్టాలిచ్చారు. ఆ



సంవత్సరంలో పట్టాలిచ్చినట్లు చూపితే ఎవరికీ అనుమానం రాదన్న ఉద్దేశంతో 2011లోనే పట్టాలిచ్చినట్లు చూపారు. వాస్తవానికి ఆ సంవత్సరంలో సర్వే నంబరు 532/సిలో పట్టాలు పంపిణీ చేశారు. నకిలీ పట్టాల్లో మాత్రం ఆ సర్వే నంబరు వేయలేదు.

**బాధితులకు మళ్లీ దొంగ పట్టాలు**

ఓర్వకల్లులో సర్వే నంబరు 614లోని ప్రభుత్వ భూమిని జూనియర్ కళాశాలకు ప్రభుత్వం కేటాయించింది. దీనిని ఆ కళాశాల ప్రిన్సిపల్ స్వాధీనం చేసుకున్నారు. ఆ భూమిలో స్థలాలు కొన్నవారు తాము మోసపోయినట్లు గుర్తించారు. స్థలాలు అమ్మినవారిని నిలదీశారు. దీంతో మరోచోట స్థలాలిస్తామని నచ్చజెప్పారు. వేరేచోట ఉన్న ప్రభుత్వ స్థలానికి తాజాగా మళ్లీ దొంగ పట్టాలు పుట్టించి బాధితుల చేతిలో పెట్టారు. నకిలీ పట్టాల వ్యవహారం వివాదాస్పదం కావడంతో కొందరు కొనుగోలుదారులు అక్రమార్కులను నిలదీశారు. దీంతో సుమారు 15 మందికి డబ్బులు వెనక్కి ఇచ్చేశారు.

# విద్యుక్తధర్మం విస్మరించారు!

కర్నూలు : ఇంట్లో వెలుగులు నింపుతూ.. పొలంలో పంటలకు తడులు అందించే విద్యుత్తే పలు కుటుంబాల్లో చీకట్లు నింపుతోంది. వివిధ ప్రమాదాల్లో మనుషుల ప్రాణాలు పోతున్నాయి. కొన్ని సందర్భాల్లో పశువులు మృత్యువాత పడుతున్నాయి. బాధిత కుటుంబాలు తీవ్రంగా నష్టపోయినా.. వారికి పరిహారం అందించి న్యాయం చేయడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. బాధితులకు అవగాహన లేకపోవడంతో పరిహారానికి దూరమవుతున్నారు. విద్యుత్తు ప్రమాదాల్లో అయినవారిని, జీవనాధారమైన పశువులను కోల్పోయిన ఎందరికో ఇప్పటికీ ప్రభుత్వ సాయానికి దూరంగా ఉన్నారు.

**సాయానికి ఎదురుచూపులు**

కర్నూలు జిల్లాలో 2023- 24, 2024- 25 జులై వరకు 53 మంది మృతి చెందినట్లు అధికారులకు సమాచారం అందింది. 33 బాధిత కుటుంబాలకు పరిహారం అందింది. మరో 20 కుటుంబాలకు అందాల్సి ఉంది. 35 పశువులు మృతిచెందగా 19 కుటుంబాలకు నష్ట పరిహారం మంజూరైంది. 16 కుటుంబాలకు కావాల్సి ఉంది.
నంద్యాల జిల్లాలో 30మంది మరణించగా 17 కుటుంబాలకే పరిహారం అందింది. 25 పశువులు మృత్యువాత పడ్డాయి. వీటిలో 12పశువులకు సంబంధించి బాధితులకు ఆర్థిక సాయం అందింది. మిగతా బాధితులకు పరిహారం అందించే ప్రక్రియ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

**చెల్లింపులు ఇలా..**

విద్యుత్తు ప్రమాదంలో వ్యక్తి మరణిస్తే రూ.5 లక్షలు పరిహారం వస్తుంది.



ఇందులో రూ.4 లక్షలు బ్యాంకులో డిపాజిట్ చేస్తారు. రూ.లక్ష నేరుగా అందిస్తారు. క్షతగాత్రులకు చికిత్స నిమిత్తం పరిహారం ఇస్తారు.
పశువులు మరణిస్తే ఒక్కోదానికి రూ.40 వేలు, గొర్రెలు, మేకలకైతే రూ.7 వేలు చొప్పున చెల్లిస్తారు. ఈ ప్రక్రియ జరగక ముందు విద్యుత్తుశాఖ విజిలెన్స్ అధికారులు దర్యాప్తు చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాల్సి ఉంది.

**అవసరమైన పత్రాలు**

విద్యుత్తు ప్రమాదాల్లో నష్టపోయిన కుటుంబాలు పరిహారం పొందాలంటే కింది పత్రాలను సమర్పించాలి.
ఎఫ్ఐఆర్ నకలు పంచనామా పత్రం పోస్ట్‌మార్టం రిపోర్టు
మరణ ధ్రువీకరణ పత్రం న్యూస్‌పేపర్ క్లిప్పింగ్ ఆధార్‌కార్డు(మనుషులకైతే)
బ్యాంకు ఖాతా పుస్తకం

**త్వరగా నిధులు మంజూరు చేస్తాం: ఎం.ఉమాపతి, ఎస్ఈ**

కర్నూలు జిల్లా ఎప్పటికప్పుడు బాధిత కుటుంబాలకు పరిహారం అందిస్తున్నాం. సకాలంలో ధ్రువపత్రాలు అందించకపోవడం.. అవి సరిగ్గా లేకపోవడం వంటి కారణాలతో కొన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దరఖాస్తు ప్రక్రియపై అవగాహన కోసం స్థానిక విద్యుత్తు కార్యాలయంలో అధికారులను సంప్రదించాలి.

# తడ'బడి'న ప్రయోగం




కొత్తచెరువు : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాలవైపు అడుగులు వేసేలా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అటల్ టింకరింగ్ ప్రయోగశాలలను ఏర్పాటు చేశారు. వీటికి ఇంటర్‌నెట్, త్రీడీ ప్రింటర్, రోబోటిక్స్, మెకానిక్ పరిశోధనకు అవసరమైన పరికరాలను సమకూర్చారు. విద్యార్థుల ఆలోచనలకు పదును పెడుతూ దిశానిర్దేశం చేయడానికి శిక్షకులను నియమించారు. ఈ ప్రయోగశాలల ద్వారా సొంత పరిశోధనలే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించే ప్రయోగాల్లో ప్రత్యక్షంగా పాల్గొనే అవకాశం విద్యార్థులకు లభిస్తుంది.

**నిర్వహణకు రూ.2.08 కోట్లు**

కొత్తచెరువు బాలురు, తాడిమర్రి ప్రభుత్వ పాఠశాల, కదిరి, హిందూపురం సోషల్ వెల్ఫేర్ బాలురు, బాలికల కళాశాలలు, సీకేపల్లి, నల్లచెరువు, అమడుగూరు, రామగిరి, ధర్మవరం ఆదర్శ పాఠశాలలు, లేపాక్షి జవహర్ నవోదయ, చిలమత్తూరు బీసీ వెల్ఫేర్, హిందూపురం ప్రైవేటు పాఠశాలలో అటల్ టింకరింగ్ ప్రయోగశాలలు ఏర్పాటు చేశారు. ఒక్కో దానికి పరికరాలకు రూ.10 లక్షలు, నిర్వహణకు రూ.2 లక్షలు మొదటి విడతలో మొత్తం రూ.12 లక్షల చొప్పున మంజూరు చేశారు. రెండో విడతలో మరో రూ.4 లక్షలు అందించారు. జిల్లాలోని 13 ప్రయోగశాలలకు మొత్తం రూ.2.08 కోట్లు వెచ్చించారు.

**ఆశించిన ఫలితం శూన్యం**

కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అత్యాధునిక ప్రయోగశాలలను ఏర్పాటు చేసినా ఫలితం శూన్యం. విద్యార్థుల్లో ఉత్సాహం ఉన్నా పర్యవేక్షణ లోపం కారణంగా ప్రోత్సాహం కరవైంది. దీంతో గత ఐదేళ్లుగా శాస్త్ర విజ్ఞాన ప్రదర్శనలకు కనీస స్థాయిలో కూడా ప్రాజెక్టులు వెళ్లకపోవడం గమనార్హం. ప్రైవేటు ఏజెన్సీ ఆధ్వర్యంలో ల్యాబ్‌లకు పరికరాలు మంజూరు చేశారు. అయితే వాటిలో ఏమిచ్చారో తెలియని పరిస్థితి.

**నోడల్ టీచర్లు స్పందిస్తే సత్ఫలితాలు**

తనూజ్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి

అటల్ ల్యాబ్‌లలో వారంలో ఒక పాఠశాలలో శిక్షకుడు హాజరై విద్యార్థులకు తరగతి నిర్వహిస్తున్నారు. ఆతరువాత నోడల్ టీచర్లు బాధ్యత తీసుకుని విద్యార్థులను ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు వస్తాయి. ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో ప్రాజెక్టులు ప్రదర్శనకు రాలేదు. త్వరలో 13 ల్యాబ్‌ల నిర్వాహకులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.

జిల్లా: సత్యసాయి
అటల్ ల్యాబ్‌లు : 13
ప్రారంభం : 2021 ఒక్కో ల్యాబ్ ఏర్పాటు, నిర్వహణ వ్యయం : రూ.16 లక్షలు వెచ్చించిన మొత్తం : రూ.2.08 కోట్లు

# మూసుకున్నాయ్ కళ్లు.. లేచాయ్ అక్రమ అంతస్తులు!



విశాఖపట్నం: అతనో వైకాపా నాయకుడు.. ప్రభుత్వ భూమిని ప్రైవేటుగా చూపించి బహుళ అంతస్తులు నిర్మిస్తున్నాడు. అంతేకాకుండా ప్లాన్‌ను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా కట్టేస్తున్నాడు.. అయినా జీవీఎంసీ అధికారులు కళ్లు మూసుకున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ వైకాపా నాయకుడి హవా కొనసాగుతుండడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.


**రూ.అరకోటి స్థలం హాంఫట్:** జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో సర్వే నెంబరు 91లో ప్రభుత్వ భూమి ఉంది. దీన్ని గతంలో ఏపీఐఐసీకి అప్పగించారు. ఈ పక్కనే సర్వే నెంబరు 92/2లో ప్రైవేటు భూమి ఉంది. ప్రభుత్వ భూమిలోని సుమారు 97 గజాల స్థలాన్ని ప్రైవేటుగా చూపించి అపార్టుమెంట్ నిర్మాణం చేపట్టారనే ఆరోపణలున్నాయి. దాని విలువ సుమారు రూ.అర కోటి ఉంటుందని అంచనా. ఇక్కడ భవన నిర్మాణానికి 2013లో జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు అనుమతులు జారీ చేశారు. ప్రభుత్వ భూమి ఆక్రమణపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో 2016లో బిల్డర్ పనులు నిలిపేశాడు. తర్వాత వైకాపా ప్రభుత్వం రావడంతో ఆ నాయకుడు రోజుల వ్యవధిలో రెండతస్తులు నిర్మించేశాడు. మళ్లీ అభ్యంతరాలు తెరపైకి రావడంతో పనులు నిలిచిపోయాయి.

**సర్వేలో వాస్తవాల వెల్లడి:**

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ పనులు ప్రారంభం కావడంతో స్థానికులు 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఆయన జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. డిజిటల్ సర్వే చేసిన సర్వేయర్ నివేదిక సైతం కమిషనర్‌కు ఇచ్చారు. నిర్మాణం జరిగిన భవనం సర్వే నెంబరు 91, 92-2లో ఉందని, రికార్డుల ప్రకారం 91 సర్వే నెంబరులోని 7.93 ఎకరాల పోరంబోకు భూమిని ఏపీఐఐసీకి కేటాయించినట్లు తేల్చారు. వైకాపా నాయకుడి భవన నిర్మాణం సర్వే నెంబరు 91 పరిధిలో ఉందంటే, ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనట్లేనని భావిస్తున్నారు.

**ప్లాన్‌కు ఎలా అనుమతులు ఇచ్చారు?:** కేవలం 12 అడుగుల రోడ్డులో ఆ నిర్మాణానికి అనుమతులిచ్చారు. భవనం దక్షిణం వైపు రోడ్డు కోసం, సెట్‌బ్యాక్‌లకు కలిపి 5.74మీటర్ల స్థలం, మిగిలిన మూడు వైపులా రెండేసి మీటర్ల చొప్పున స్థలం వదలాలనే నిబంధనలను ఇక్కడ పాటించలేదు. ఇండస్ట్రీయల్, నివాసాల మధ్య బఫర్ జోన్ ఉండాలి. ఇక్కడ ఎలాంటి బఫర్ జోన్ లేకుండా ఏపీఐఐసీ భూములను ఆనుకుని నిర్మాణం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో టీపీవోపై ఆరోపణలు వస్తున్నాయి. భారీగా డబ్బులు అందడం వల్లే నిబంధనలు ఉల్లంఘిస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. దీనిపై గాజువాక జెడ్సీ శేషాద్రి వివరణ కోరగా సర్వే నివేదికను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# హెచ్చెల్సీ.. భద్రం!



అనంతపురం : గత వైకాపా ప్రభుత్వ పాలనలో కూలిన వంతెనలు.. బలహీన గట్లతో అభద్రంగా తయారైన జిల్లా జీవనాడి హెచ్చెల్సీ పటిష్ఠం దిశగా అడుగులు వేస్తోంది. జగన్ సర్కారు పైసా నిధులు విదల్చకపోవడంతో హెచ్చెల్సీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు అత్యవసర పనులకు రూ.35 కోట్లు మంజూరు చేశారు. ప్రస్తుతం పనులు పూర్తి కావడంతో కొత్త రూపు సంతరించుకొంటోంది.

**నాడు శిథిలం.. నేడు పటిష్ఠం**

గత ఐదేళ్ల పాలనలో హెచ్చెల్సీ పరిస్థితి దినదిన గండంగా తయారైంది. జీవో 365 తీసుకొచ్చి అసంపూర్తి ఆధునికీకరణ పనులు నిలిపివేసింది. ఫలితంగా నాగలాపురం, డి.హెన్నూరు, మీనహళ్లి, కణేకల్లు చెరువు అవుట్‌ఫాల్ రెగ్యులేటర్, నాగేపల్లి వద్ద పాత వంతెనలు కాలం చెల్లి కూలిపోయాయి. పంట పొలాలకు, ఇతర ప్రాంతాలకు రాకపోకలు నిలిచి రైతులు, ప్రజలు అవస్థలు పడ్డారు. యర్రగుంట వద్ద యూటీ, మైలాపురం తదితర చోట్ల గండ్లు పడి నీరు వృథా కావడంతో పాటు హెచ్చెల్సీలో ప్రవాహం నిలిచిపోయి సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఏ క్షణాన ఎక్కడ గట్టు తెగుతుందో, వంతెన కూలుతుందోనన్న భయంతో రైతులు గడిపారు.

**వంతెనలు త్వరలోనే అందుబాటులోకి..**

కూటమి ప్రభుత్వం హెచ్చెల్సీని శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధికి సంకల్పించింది. అధికారంలోకి వచ్చిన 10 రోజుల్లోనే రూ.కోటితో పనులు చేపట్టి ఆయకట్టుకు నీరు అందించారు. అత్యవసర పనులకు రూ.35 కోట్లు మంజూరు చేశారు. మూడు నెలల కిందట పనులు ప్రారంభించారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్ సహకారంతో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ప్రత్యేక చొరవ తీసుకొని యూటీ, లైనింగ్ వంతెనల నిర్మాణ పనులు 80 శాతం మేర పూర్తి చేశారు. పీఏబీఆర్, ఎంపీఆర్ రెగ్యులేటర్ నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. నీటి రాకతో కణేకల్లు చెరువు అవుట్‌ఫాల్ రెగ్యులేటర్ పనులు నిలిపివేశారు. 165 కి.మీ. మీనహళ్లి వంతెన ప్రారంభించలేదు. మల్లికేతి, నాగలాపురం, నాగేపల్లి వంతెనలు త్వరలోనే అందుబాటులోకి రానుండటంతో రైతులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# బిల్లుల్లో అ'ధనం'.. రవాణా భారం

ఆత్మకూరు : అరకొర వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఎరువుల విషయంలోనూ సమస్యలు ఎదుర్కొంటున్నారు. నిబంధనల ప్రకారం కంపెనీలు నిర్ణయించిన ధరకు డీలర్లు ఎరువులను విక్రయించాలి. కానీ కొందరు డీలర్లు బిల్లుపై అదనంగా రవాణా ఛార్జీలు వసూలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రతి డీలరు దుకాణం వద్ద ధరల పట్టిక ప్రదర్శించాలి. పలు ప్రాంతాల్లో పేరుకు ధరల పట్టిక ఉన్నా వాటిపై ధరలు కనిపించవు. కొన్ని దుకాణాల వద్ద బోర్డులను మూలన పెట్టేశారు. అయినా వ్యవసాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

**నగదు వెనక్కి ఇప్పించి..** ఆత్మకూరుకు చెందిన ఓ రైతు పట్టణంలోని డీలరు వద్ద 4 సంచుల పొటాష్ కొనుగోలు చేయగా రూ.6,200 బిల్లు వేశారు. రవాణా ఛార్జీల పేరిట రూ.200 అదనంగా వసూలు చేశారు. రైతు ఆరా తీయగా రవాణా ఛార్జీలు మీరే చెల్లించాలని



డీలరు చెప్పారు. ఈ విషయాన్ని వ్యవసాయాధికారి దృష్టికి తీసుకెళ్లగా రూ.200 వెనక్కి ఇచ్చారు.

**తనిఖీలు అవసరం**

జిల్లాలోని పలు ప్రాంతాల్లో యూరియా సరిపడా లభించక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఆర్ఎస్‌కేలు, సొసైటీలకు వచ్చిన యూరియా నిమిషాల్లో అయిపోతుండటంతో రైతులు బారులుదీరుతున్నారు. యూరియా కొనుగోలు చేసే సమయంలో కొందరు ప్రైవేటు డీలర్లు ఏదో ఒక ఎరువు అంటగడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ధరలు పెరిగిన నేపథ్యంలో పాతవాటిని కొత్త ధరలతో చూపే అవకాశముంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపడితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. బిల్లులను సైతం సమగ్రంగా పరిశీలించాల్సి ఉంది.

# ప్రతిభకు పట్టం.. విజ్ఞాన్ మంథన్

డోన్ : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను, కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు వెలికి తీసేందుకు కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్(వీవీఎం) పేరుతో జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్షను నిర్వహిస్తోంది. ఇందులో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, దేశంలో సీఎస్ఐఆర్, ఇస్రో, బార్క్, డీఆర్‌డీవో ప్రముఖ జాతీయ ప్రయోగశాలలు, పరిశోధనా సంస్థలను చూసే అవకాశం, ఇంటర్న్‌షిప్, ఉపకార వేతనం పొందే అవకాశాన్ని కలిగిస్తోంది.

**కేంద్ర సంస్థల ఆధ్వర్యంలో..**

కేంద్ర ప్రభుత్వ సంస్థలైన నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ ట్రైనింగ్, శాస్త్ర, సాంకేతిక విభాగం సంయుక్త ఆధ్వర్యంలో పరీక్ష ఉంటుంది. దేశవ్యాప్తంగా 6 నుంచి 11వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో పరీక్ష పాల్గొనవచ్చు. ఆసక్తి ఉన్న విద్యార్థులు వీవీఎం అధికారిక వెబ్‌సైట్‌లో రూ.200 రుసుం చెల్లించి వివరాలను నమోదు చేసుకోవాలి.

**వివిధ స్థాయిల్లో పరీక్ష**

వివిధ స్థాయుల్లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, గణితం, సామాన్యశాస్త్రం, విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయ మేధావుల కృషి, సత్యేంద్రనాథ్ బోస్ జీవిత చరిత్ర, లాజికల్ థింకింగ్, రీజనింగ్ తదితర సబ్జెక్టుల్లో బహుళైచ్ఛిక విధానంలో ప్రశ్నలు ఉంటాయి.
వీవీఎం పరీక్షకు సంబంధించి విద్యార్థులు మొదట పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయుల్లో అంతర్జాలం ద్వారా పరీక్ష రాయవచ్చు. విద్యార్థి ఇంటి నుంచే ఆన్‌లైన్ విధానంలో, చరవాణి, ట్యాబ్, డెస్క్‌టాప్, ల్యాప్‌ట్యాప్‌ల ద్వారా పాల్గొనవచ్చు. ఆంగ్లం, హిందీతో పాటు 9 ప్రధాన ప్రాంతీయ భాషల్లో పరీక్షను నిర్వహిస్తారు. విద్యార్థులు తమ



ఆసక్తిని బట్టి నచ్చిన భాషలో పరీక్ష రాయవచ్చు.
ప్రతిభ చూపిన విద్యార్థులకు స్థాయిని బట్టి ధ్రువపత్రాలు, నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందజేస్తారు.

దరఖాస్తు, పరీక్షల వివరాలు ఇలా..
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 30
నమూనా పరీక్షలు: సెప్టెంబరు 1 నుంచి.
పాఠశాల స్థాయి పరీక్ష: అక్టోబరు 28 నుంచి 30వ తేదీ వరకు.
జిల్లా స్థాయిలో..: నవంబరు 19వ తేదీన.
రాష్ట్రస్థాయిలో..: డిసెంబరు 21 లేదా 28 లేదా జనవరి 4వ తేదీల్లో ఏదో ఒక రోజు.
జాతీయ స్థాయి పరీక్ష: 2026 మే నెలలో.

ప్రధానోపాధ్యాయుల కృషి అవసరం : వి.కుమార్‌బాబు, వీవీఎం జిల్లా సమన్వయకర్త, నంద్యాల


విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని కలిగించి నూతన ఆవిష్కరణల వైపు ప్రోత్సహించేందుకు వీవీఎం పరీక్ష ఉపయోగపడుతుంది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలి. సందేహాలుంటే 9491342263 చరవాణిని సంప్రదించాలి.

# రైల్వేజోన్ అడుగులు... వడివడిగా..!

విశాఖపట్నం: దక్షిణ కోస్తా రైల్వేజోన్ కార్యకలాపాలను త్వరితగతిన పట్టాలెక్కించడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. తాత్కాలికంగా సిరిపురంలో వీఎంఆర్డీఏకు చెందిన డెక్ భవనంలో జోన్ జనరల్ మేనేజర్ (జీఎం) కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. ఇది వరకే జీఎం సందీప్ మాథుర్ భవనాన్ని పరిశీలించారు. త్వరలో ఫర్నీచర్, ఇంటీరియర్ పనులకు టెండర్లు పిలవనున్నారు. 45 రోజుల్లోగా పూర్తిచేసి దసరా నాటికి జీఎం కార్యాలయాన్ని అధికారికంగా అందుబాటులోకి తీసుకురానున్నట్లు సమాచారం.

**రెండంతస్తుల్లో ఏర్పాటు..:** ప్రస్తుతం ముడసర్లోవ ప్రాంతంలో జీఎం కార్యాలయం శాశ్వత భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అది పూర్తయ్యేలోపు 'డెక్' భవనం నుంచి సేవలందించనున్నారు. ఇందులో మొదట ఒక ఫ్లోర్‌ను పరిశీలించగా సరిపోదని భావించిన అధికారులు రెండు ఫ్లోర్లను తీసుకోవాలని నిర్ణయించారు. దాదాపు 41వేల చదరపు అడుగుల స్థలాన్ని ఉపయోగించుకోనున్నారు. ఇందులోనే సుమారు 450 కార్లు, 600 ద్విచక్ర వాహనాలను నిలిపేలా పార్కింగ్ స్థలం ఉండడంతో ఈ భవనానికే ప్రాధాన్యమిచ్చారు.

**హెచ్‌వోడీల కార్యాలయాలు ఇక్కడే..:** జీఎం కార్యాలయంతో పాటు అనుబంధంగా 15 మంది ప్రిన్సిపల్ హెచ్‌వోడీల కార్యాలయాలు



అక్కడే రానున్నాయి. ఇప్పటికే దక్షిణ కోస్తా జోన్ ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ (పీసీఎంఈ)గా అమిత్‌గుప్తాను నియమిస్తూ రైల్వేబోర్డు ఉత్తర్వులిచ్చింది. కొద్ది రోజుల్లోనే టెలికాం, సివిల్, కమ్యునికేషన్ ఇతర విభాగాల ప్రిన్సిపల్ హెచ్‌వోడీల నియామకం చేపట్టనుంది. వీరికి అదనంగా మరో 30మంది అధికారులు, వెయ్యి మంది ఉద్యోగులు ఇందులో కార్యకలాపాలు చేపట్టనున్నారు.

గతంలో భువనేశ్వర్ కేంద్రంగా ఏర్పడిన తూర్పుకోస్తా జోన్ పూర్తి స్థాయి కార్యకలాపాలు ప్రారంభించడానికి ముందు రెండేళ్ల పాటు తాత్కాలిక భవనంలోనే సాగింది. ఆ తర్వాత శాశ్వత భవనంలోకి తరలింది. అదే తరహాలో దక్షిణ కోస్తా జోన్ కార్యకలాపాలు కూడా తాత్కాలిక భవనంలో కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నారు. ముందుగా ఉద్యోగుల సర్దుబాటు, ఆస్తుల పంపకాలు చేపట్టాలి. ఆ తర్వాత పూర్తిస్థాయిలో జోన్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయి.

**క్షేత్రస్థాయి సిబ్బంది**

మారే అవకాశం: సవరించిన రైల్వేజోన్ డీపీఆర్‌కు రైల్వేబోర్డు ఇటీవల ఆమోదం తెలిపింది. అందులో కొత్తగా జీఎం పోస్టు మినహా మరే పోస్టులపై స్పష్టత ఇవ్వలేదు. అయితే కొత్త జోన్ ప్రధాన కేంద్రం, విశాఖ డివిజన్‌కు అవసరమైన సిబ్బంది కోసం చేసిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. ఆయా సెక్షన్లలో ఎక్కడ పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది అక్కడే అన్న విధానంలో కేటాయించారు. క్షేత్రస్థాయి సిబ్బందిని మార్చే అవకాశం ఉంది. అధికారుల కోసం నివాసాలను అద్దెకు తీసుకోవాలనే ప్రతిపాదనపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

# అప్పన్న అన్నదానం.. దాతలకు భాగస్వామ్యం

సింహాచలం : అన్ని దానాల కన్నా.. అన్నదానం ఎంతో పవిత్రమైనదని భారతీయ సంస్కృతి చెబుతోంది. ఆకలితో ఉన్న వారికి కడుపునిండా ఆహారం అందించడంలో వచ్చే తృప్తి మరెందులోనూ ఉండదంటే అతిశయోక్తి కాదు. అందుకే అప్పన్న స్వామి నిత్యప్రసాదానికి భారీగా భక్తులు విరాళాలు ఇవ్వడానికి ముందుకొస్తుంటారు. 1989లో ఆగస్టు 14న సింహాచలం దేవస్థానం ఉద్యోగుల విరాళాలతో ప్రారంభమైన అన్నప్రసాద పథకం 36 ఏళ్లుగా నిర్విరామంగా కొనసాగుతోంది. ప్రకృతి విపత్తుల్లో సైతం అప్పన్న అన్నదానం నుంచి అన్నార్తులకు ఆహారం సరఫరా చేసిన ఘనత ఉంది.

**దాతలకు ప్రాధాన్యం:** అన్నప్రసాద పథకానికి విరాళాలు సమర్పించే దాతలకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పిస్తున్నారు. దాతలను నాలుగు కేటగిరీలుగా విభజించారు.

రూ.10 వేలు పైబడి విరాళాలు అందించిన దాతలకు ధ్రువపత్రంతో పాటు విరాళం కార్డు అందజేస్తారు. ఈ కార్డు ద్వారా దాత కుటుంబ సమేతంగా ఏడాదిలో ఒకసారి స్వామి దర్శనం చేసుకోవచ్చు. విరాళం అందజేసిన రోజున అంతరాలయంలో దర్శనం కల్పించి వేద పండితులతో ఆశీర్వచనం చేయిస్తారు. స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలతో సత్కరిస్తారు. భక్తులు కోరిన రోజున ఏడాదిలో ఒకరోజు వారి గోత్రనామాలతో భక్తులకు అన్నదానం చేస్తారు. ఆ రోజు దాతల వివరాలను బోర్డుపై ప్రదర్శిస్తారు. భక్తులు విరాళాలు సమర్పించేందుకు సింహగిరిపై మూడు చోట్ల విరాళాల కౌంటర్లున్నాయి. దర్శనం ఆలయం వెలుపలకు



వచ్చే మార్గం, పీఆర్వో కార్యాలయంతో పాటు అన్నప్రసాద భవనం వద్ద ఈ కౌంటర్లున్నాయి. విరాళాలకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం 93987 34612 నంబర్‌లో సంప్రదించవచ్చు.

**బ్యాంకులో 36.45 కోట్ల డిపాజిట్లు:** సింహాద్రి అప్పన్న స్వామికి భక్తులు విరాళాల రూపంలో సమర్పించిన రూ.36,45,41,720 ప్రస్తుతం బ్యాంకులో డిపాజిట్ల రూపంలో ఉంది. దీనిపై సుమారు రూ.2 కోట్ల మేర వడ్డీ వస్తుంది. ఈ మొత్తంతో ఏడాదంతా భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తారు. భక్తులు సమర్పించిన విరాళాలను ఇతర అవసరాలకు వినియోగించరు. రూ.10 వేలు పైబడి వచ్చిన విరాళాలను శాశ్వత పథకం కింద బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తారు. నెలకు లక్ష మంది చొప్పున ఏటా 12 లక్షల మందికి ఉదయం, రాత్రి అన్నప్రసాదం అందిస్తున్నారు.

మహారాజ పోషకులు – రూ.లక్ష పైబడి విరాళ దాతలు

రాజ పోషకులు – రూ.50 వేలు పైగా

పోషకులు – రూ.10 వేలు దాటి

దాతలు – రూ.1,116 ఆపై విరాళమిచ్చిన వారు

# భూ సమస్యలు తీర్చేదెవరు?



అనంతపురం : జిల్లాలో భూ సమస్యలు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. చిన్న సమస్యలు సైతం పరిష్కారానికి నోచుకోని దుస్థితి నెలకొంది. ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లోనూ సింహ భాగం అర్జీలు భూ సమస్యలపైనే దాఖలు అవుతున్నాయి. ఏళ్లకొద్దీ బాధితులు కాళ్లరిగేలా తిరుగుతున్నా స్పందించే నాథుడే కరవయ్యాడు. నిషేధిత 22ఏ, చుక్కల భూములే కాదు.. అసైన్డ్, మ్యుటేషన్ వంటి సాధారణ సమస్యల దస్త్రాలు సైతం మండల, డివిజన్ రెవెన్యూ కార్యాలయాలు దాటడం లేదు. ఫ్రీ హోల్డ్ భూముల వ్యవహారం దారుణంగా మారింది. నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న క్షేత్ర రెవెన్యూ అధికారులపై కొరఢా ఝుళిపించాల్సిన జిల్లా అధికారులు మెతక వైఖరి అవలంబిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

**'ఫ్రీహోల్డ్' పై తేల్చరే..**గత వైకాపా ప్రభుత్వంలో భారీ ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారన్న ఉద్దేశంతో ఫ్రీ హోల్డ్ భూముల క్రయ, విక్రయాలను పూర్తిగా ఆపేశారు. కనీసం 20 ఏళ్లకుపైగా అనుభవంలో ఉన్న అసైన్డ్ భూముల యజమా నులకు శాశ్వత హక్కులు కల్పిస్తామంటూ 2023 డిసెంబరు లో అప్పటి ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకొచ్చింది. ఈ ప్రక్రియలో భారీ ఎత్తున గోల్‌మాల్, రూ.కోట్లల్లో ముడుపులు చేతులు మారాయన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. జిల్లాలో 36 వేల ఎకకరాలను ఫ్రీ హోల్డ్ చేసినట్లు నిర్ధారణ కాగా.. ఇందులో 24 వేల ఎకరాలు సక్రమం అని, మిగతా 12 వేల ఎకరాల్లో అక్రమాలు జరిగినట్లు తేలింది. దాదాపు ఏడాది కావస్తున్నా ఈ భూములపై ఏమీ తేల్చలేదు.

**22ఏ, చుక్కల్లో అంతులేని నిర్లక్ష్యం**

22ఏ, చుక్కల భూముల దస్త్రాలు కొందరు రెవెన్యూ అక్రమార్కులకు కల్పతరువుగా మారాయి. వీటిని పరిష్కరించాలంటే రూ.లక్షల్లోనే బేరసారాలు సాగుతాయి. అన్ని సక్రమంగా ఉన్నా ఏదొక కొర్రీతో దస్త్రాలను పక్కన పెడుతున్నారు. ఈ తరహా దస్త్రాలు జిల్లాలో 5,191 ఉన్నట్లు తేలింది. అత్యధికంగా కళ్యాణదుర్గం, తాడిపత్రి, ఉరవకొండ, అనంత గ్రామీణం, గుత్తి, రాప్తాడు, గార్లదిన్నె, గుంతకల్లు, రాయదుర్గం మండలాల్లో దస్త్రాలు పరిష్కారానికి నోచుకోలేదు. అనంత రెవెన్యూ డివిజన్‌లోనే ఎక్కువగా మూలనపడ్డాయి.

**అటకెక్కిన అసైన్డ్, మ్యుటేషన్**

1954కు ముందు డి.పట్టా, అసైన్డ్ భూముల క్రయ, విక్రయాలపై నిషేధం విధించారు. దీంతో తాత ముత్తాతల కాలం నాటి భూములను అమ్ముకోలేని దుస్థితి ఉంది. ఒక్క అసైన్డ్ భూమి జిల్లాలో 2.23 లక్షల ఎకరాలు ఉంది. 78 వేల మంది యజమానులు ఆ భూమి క్రయ, విక్రయాలు కాని.. తల్లిదండ్రుల నుంచి కొడుకు, కుమార్తెలకు మార్పిడి (మ్యూటేషన్) చేయించుకోలేని పరిస్థితి ఉంది. ప్రతి సోమవారం వందలాది మంది భూ బాధితులు అర్జీలు ఇస్తున్నా స్పందన శూన్యం.

# భూముల లెక్క.. ఇక పక్కా

అనంతపురం : సాధారణంగా పంటల వివరాలను మాత్రమే ఈ–పంట కింద నమోదు చేసేవారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఏడాది సాగులో లేని భూములను కూడా ఈ–పంట కింద నమోదుకు శ్రీకారం చుట్టాయి. గత వైకాపా ప్రభుత్వం రూపొందించిన యూనిఫైడ్ డిజిటల్ ప్లాట్ ఫారం (యూడీపీ) యాప్‌ను రద్దు చేశారు. ప్రస్తుతం జాతీయ సమాచార కేంద్రం (ఎన్‌ఐసీ) ద్వారా ఖరీఫ్–2025లో 'ఈ–పంట డిజిటల్ క్రాప్ సర్వే' పేరుతో కొత్త యాప్‌ను రూపొందించారు. ఈ సర్వేతో సాగు భూముల వివరాలు కచ్చితంగా, పారదర్శకంగా ఉండేలా మార్గదర్శకాలు జారీ చేస్తూ తాజాగా ఉత్తర్వులు ఇచ్చారు.

**పంటల సర్వే పరిశీలనకు ప్రత్యేక చర్యలు**

వ్యవసాయ పంటలకు మండల వ్యవసాయాధికారి, ఉద్యాన పంటలకు ఉద్యాన అధికారి, ప్రభుత్వ/వ్యవసాయేతర భూములకు తహసీల్దార్లకు బాధ్యతలు అప్పగించారు. ఆయా భూములు, పంటల సాగు, భూమి రికార్డులు పరిశీలిస్తారు. వారు తిరస్కరించిన రికార్డులను సరైన కారణాలు చూపుతూ ఆన్‌లైన్ నమోదు చేయాలి. తిరస్కరించిన భూముల రికార్డుల ఆధారంగా రైతు సేవా కేంద్రాల సిబ్బంది క్షేత్రస్థాయిలో సర్వే చేయాలి. రీసర్వే చేసిన రికార్డులను డివిజన్ వ్యవసాయాధికారి, జిల్లా ఉద్యానశాఖ అధికారి ఆమోదించాలి.

ఎకరా కన్నా తక్కువ భూమి ఉంటే జియోట్యాగ్ చేసి ఫొటో తప్పనిసరిగా తీయాలి. పంట ఉన్నా లేకపోయిన ప్రతి ఎకరా ఫొటో తీయాల్సిందే. మండలంలోని ప్రతి రైతు సేవా కేంద్రం, సిబ్బంది రెవెన్యూ గ్రామాలకు తిరిగి మ్యాపింగ్ చేయాలి. వారి ఫోన్లను మ్యాప్ చేసుకోవాలి. అప్పుడే యాప్ పని చేస్తోంది.

ఏపీఐఐసీ భూముల్లో సాగు చేసిన పంటల సర్వే వివరాలను సంయుక్త కలెక్టర్ అనుమతి తర్వాతే నమోదు చేయాలి.

**మార్గదర్శకాలు ఇలా..**

ఎన్‌ఐసీ వెబ్‌ల్యాండ్ ద్వారా సాగు చేయలేని, ప్రభుత్వ భూములను తొలగిస్తారు. సాగుకు యోగ్యమైన భూముల వివరాలను మాత్రమే సర్వేకు అనుసంధానం చేస్తారు.

వెబ్‌ల్యాండ్ నుంచి ఏదైన ప్రభుత్వ భూమి లేదా అభ్యంతరకర సర్వే నంబరు, ఖాతా నంబరు డౌన్‌లోడ్ అయితే.. అటువంటి సర్వే, ఖాతా నంబరుతో వ్యవసాయ భూమి కాకుండా వ్యవసాయేతర భూమిగా పరిగణించి నమోదు చేస్తారు.

గతేడాది బహువార్షిక/ ద్వివార్షిక పంటలకు ఫార్వర్డ్ ఆప్షన్‌ను రద్దు చేశారు. ఆయా పంటలను సర్వే చేసి తాజాగా జియో ఫెన్సింగ్ ఫీల్డ్ సర్వే చేసి ఫొటో తీస్తారు.

ప్రతి రెవెన్యూ గ్రామంలో రికార్డులను డౌన్‌లోడ్ చేసుకుని, ప్రతి ఎకరా జియో ఫెన్సింగ్‌తో ఫీల్డ్ సర్వే, ఫొటో తప్పనిసరిగా తీయాలి.

వెబ్‌ల్యాండ్, అటవీ భూముల్లో పంటలున్నా.. లేకపోయినా ఫీల్డ్ సర్వే చేయాలి.

ప్రతి ప్లాట్ ఫీల్డ్ సర్వే చేసి అనుమతించబడిన 20 మీటర్లలో జియో ఫెన్సింగ్ ఫొటో తీయాలి.

బీడు భూములను మూడు రకాలుగా వర్గీకరించారు. అందులో ఐదేళ్లకుపైగా సాగు చేయని భూములు, 1–5 ఏళ్ల మధ్య సాగు చేయనివి, ఈ ఏడాది సాగు చేయలేనివి. పొలం గట్టుపై చెట్లు, పంట సర్వే తప్పనిసరి చేయాలి.

# ఆటల కోటకు బీటలు..!



విశాఖపట్నం: **అప్పట్లో..:** పాఠశాలలో చివరి గంట కొట్టగానే ఇంటికి పరుగున వెళ్లి.. పుస్తకాల సంచి విసిరేసి.. చీకటి పడేదాకా స్నేహితులతో కలసి ఆరుబయట ఆటలు ఆడుకునేవారు. ఆదివారం, సెలవు రోజుల్లో అయితే.. ఆటలో పడితే ఆకలి కూడా గుర్తుండేది కాదు.

**మరిప్పుడో..:** ఉదయం లేచిన దగ్గరి నుంచి పుస్తకాలు, ఫోన్లతోనే కాలం గడుపుతున్నారు. చాలా పాఠశాలల్లో ఆటల కోసం ఒక పీరియడ్ ఉంటుందనే సంగతి మరచిపోయారు. సాయంత్రం హోంవర్క్ పూర్తయ్యాక.. ఫోన్ ప్రపంచంలో మునిగిపోతున్నారు. ఆటలు ఆడుకోవాలన్నా ఫోన్‌లోనే. 50శాతం తగ్గిన ఆటల సమయం: శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదం చేసే క్రీడలకు చాలా మంది విద్యార్థులు దూరమవుతున్నారు. ఆటల ద్వారా పిల్లలు అనేక నైపుణ్యాలు, కొత్త విషయాలు నేర్చుకుంటారు. కానీ, కొన్నేళ్లుగా చదువుల ఒత్తిడి పెరుగుతోంది. ఫలితంగా ఆటకు కేటాయిస్తున్న సమయం తగ్గుతూ వస్తోంది. 'రైజింగ్ ది నేషన్ ప్లే కమిషన్' నివేదిక ప్రకారం ప్రస్తుత తరం పిల్లలు ఆరుబయట ఆడుకునే సమయం 50 శాతం తగ్గింది.

**పేరుకే మైదానాలు..:** జిల్లాలో 569 ప్రభుత్వ ఉన్నత పాఠశాలు ఉండగా, సుమారు 300 పాఠశాలల్లో మైదానాలున్నాయి. అక్కడ సరిపడా క్రీడా పరికరాలు లేక విద్యార్థులు సాధనకు దూరమవుతున్నారు. ఆటలకు సమయం కేటాయించట్లేదని, వ్యాయామ ఉపాధ్యాయులు సైతం నామమాత్రంగా పనిచేస్తున్నారనే విమర్శలున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం, ఇతర ప్రత్యేక రోజుల్లో పోటీల వరకే క్రీడలు పరిమితమవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు 1000కి పైగా ప్రైవేటు పాఠశాలలు నడుస్తున్నాయి. వీటిలో ఆడుకోవడానికి మైదానం సదుపాయాలున్నవి చాలా తక్కువ. ఎక్కువ శాతం స్కూళ్లు అపార్ట్‌మెంట్లు, ఇరుకు భవనాల్లో ఉన్నాయి.

**ఆటస్థలాలు కనుమరుగు:** ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 30శాతానికి పైగా చిన్నారులకు రక్షిత బహిరంగ ఆట స్థలాలు అందుబాటులో లేవు. నగరంలో చాలా చోట్ల ఖాళీ స్థలాల్లో వాణిజ్య సముదాయాలు, ఇతర కార్యకలాపాలు మొదలయ్యాయి. బహిరంగ ప్రదేశాల్లో ఆడుకునే సురక్షిత వాతావరణం లేకపోవడంతో కొందరు తల్లిదండ్రులు పిల్లలను బయటకు పంపడానికి భయపడుతున్నారు. బాల్యంలో ఆటలు ఆడకపోతే భవిష్యత్తులో శారీరక, మానసిక సమస్యలు తలెత్తే ప్రమాదం తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. క్రీడా పరికరాల కొనుగోలుకు రూ.30వేలు: జిల్లాలోని పెద్ద పాఠశాలల్లో చంద్రపాలెం ఉన్నత పాఠశాల ఒకటి. ఇటీవల బడి మైదానాన్ని చదును చేశారు. నాణ్యత లేకపోవడంతో వర్షం పడితే చిత్తడిగా మారుతోంది. క్రీడా పరికరాలు పూర్తి స్థాయిలో లేవు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పాఠశాలల్లో క్రీడా పరికరాలకు రూ.30వేల వరకు ఇండెంట్ పెట్టుకోవడానికి అవకాశం కల్పించారు. ఈ నెలలో ఆ మొత్తం వచ్చే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

# పారిశ్రామిక నడవ పరుగు

నక్కపల్లి : పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా నక్కపల్లి పరిధిలో కారిడార్ పనులు ఊపందుకున్నాయి. మూడు నెలల్లో రోడ్డు నిర్మాణ ప్రాంత రూపురేఖలు మారిపోయాయి. తీరప్రాంత గ్రామాల్లో సేకరించిన భూముల్లో బల్క్‌డ్రగ్ పరిశ్రమతోపాటు ఆర్సెలార్ మిత్తల్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకా నున్నాయి. ఇందుకు సంబంధించి భూముల కేటాయింపు చేపట్టగా, బల్క్‌డ్రగ్ పార్కు మౌలిక సదుపాయాల కల్పన పనులు జనవరిలో ప్రారంభమయ్యాయి. పరిశ్రమలు ఏర్పాటయ్యే ప్రాంతానికి చేరుకునేందుకు అవసరమైన రహదారి నిర్మాణాన్ని జాతీయ రహదారిపై కాగిత సమీపం నుంచి ర.భ.శా. అధికారు లు మే నెలలో చేపట్టారు. ఇందులో భాగంగా 20 ఎకరాలను ఏపీఐఐసీ సేకరించింది. రోడ్డు నిర్మాణానికి ఏడాది గడువున్నా.. అత్యవసరంగా పూర్తి చేయాల్సి ఉండటంతో పరిశ్రమల శాఖ ఉన్నతాధికారి, కలెక్టర్ తదితరులు తరచూ పరిశీలన చేస్తూ ప్రగతి నివేదికలను ప్రభుత్వానికి పంపుతున్నారు. ప్రస్తుతం చేపట్టిన పనుల్లో గ్రావెల్ రహదారి నిర్మాణం తుది దశకు చేరుకుంది. కల్వర్టుల నిర్మాణం జరుగుతోంది. పరిశ్రమల నీటి అవసరాల నిమిత్తం రహదారిని వెంబడి భారీ పైపులైన్లు వేస్తున్నారు. ఈ ఏడాది చివరిలోగా పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనులు చేస్తున్నారు. ప్రస్తుతం కాగిత నుంచి పాటిమీద కూడలి వరకు రోడ్డు వేస్తున్నారు. అక్కడి నుంచి ఏపీఐఐసీ ఆధ్వర్యంలో పారిశ్రామిక వాడలో జరుగుతున్న రహదారులకు అనుసంధానం చేయనున్నారు.

**గడువుకు ముందే పూర్తి**

పరిశ్రమల అవసరాల నిమిత్తం ఈ రహదారే ప్రధానమైనది. వేగంగా పూర్తి చేయాలన్న ఆదేశాలున్నాయి. మూడు నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా. వీవీ రమణ, ఆర్డీవో

# పదేళ్ల ప్రగతి

ఏర్పేడు : తిరుపతి భారతీయ విజ్ఞాన శిక్షణ, పరిశోధన సంస్థ(ఐసర్) పదేళ్లలో ఆదర్శనీయ ప్రగతిని సాధించింది. ఏర్పేడు మండలం శ్రీనివాసపురం సమీపంలోని 253 ఎకరాల్లో ఏర్పడిన ఐసర్ వివిధ పరిశోధనలతో ప్రపంచ దేశాల్లో ఉత్తమ ర్యాంకును కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో పదోఏట ఆరో స్నాతకోత్సవాన్ని శాశ్వత ప్రాంగణంలో విద్యార్థులు, తల్లిదండ్రుల మధ్య ఘనంగా నిర్వహించుకునేందుకు సిద్ధమైంది.

**వేల మందిని తీర్చిదిద్ది**

2015లో తిరుపతిలో అద్దె భవనంలో 80 మంది విద్యార్థులతో ఏర్పడిన ఐసర్‌లో ప్రస్తుతం 1,200 మంది విద్యార్థులు బీఎస్, ఎంఎస్ చదువుతున్నారు. పరిశోధనలు అందుబాటులో ఉండటంతో 150కి పైగా వివిధ ప్రాజెక్టులు తయారు చేశారు. దేశవిదేశాలకు చెందిన వివిధ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నారు. ఇప్పటి వరకు 1400 మంది విద్యార్థులు యువ శాస్త్రవేత్తలుగా వివిధ సంస్థల్లో పనిచేస్తుండటం గమనార్హం. పక్షులు, పాములు, వ్యవసాయం, రోగనిరోధక



మందులు తయారీపై దృష్టి సారించడంలో ఆదర్శంగా నిలుస్తున్నారు. బయాలజికల్ డేటా సైన్స్, ప్రొఫెషనల్ మాస్టర్స్ ఇన్ డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీ, ఎం.ఎస్ రీసెర్చ్ వంటివి అదనంగా ప్రవేశపెట్టారు. కాగా దేశంలోనే మొదటిసారి ఈ ఏడాది ఎకనామిక్స్, స్టాటిస్టికల్ సైన్స్‌తో బీఎస్ ప్రారంభించడం గమనార్హం.

**255 మందికి పట్టాల ప్రదానం**

తిరుపతి ఐసర్‌లో 2024–25లో విద్య పూర్తి చేసుకున్న 255 మంది విద్యార్థులు పట్టాలు అందుకోనున్నారు. వీరిలో పీహెచ్‌డీ 22, ఐపీహెచ్‌డీ 08, ఎంఎస్ 03, బీఎస్–ఎంఎస్ 141, ప్రొఫెషనల్ మాస్టర్స్ 69, బీఎస్ 06, బీఎస్సీ 06 మంది ఉన్నారు.

**ఆకట్టుకునే అందాలు, మౌలిక సదుపాయాలు**

ఐసర్‌లో ఎటుచూసిన పచ్చదనంతో ఆకట్టుకుంటోంది. భవనాలపై శాస్త్రవేత్తల నామకరణం, సైన్స్ ఫార్ములా ఉండటంతోపాటు సాంకేతిక విధానంతో తరగతి గదులు అందుబాటులో ఉన్నాయి. ఇండోర్ స్టేడియం, వ్యాయామశాలలు, వసతిగృహాలు, సమావేశం మందిరాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. రూ.9.5 కోట్లతో ఎనిమిది వరుసల అథ్లెటిక్ స్టేడియం ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మరిన్ని నిధులు రానుండడంతో ఐసర్ త్వరలోనే ఆదర్శవంతమైన అభివృద్ధిని సాధించనుంది.

# వసతులున్నా.. సేవలు అంతంతమాత్రమే..!

పలమనేరు : పలమనేరు ఏరియా ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయి సదుపాయాలు ఉన్నా.. సేవలు మాత్రం అంతంతమాత్రంగానే అందుతున్నాయి. ప్రభుత్వం రూ.56 కోట్లతో ఇక్కడ వంద పడకల కోసం భవనాన్ని సమకూర్చింది. అందులో ఆధునిక వైద్య సదుపాయాలు, పడకలు, గదులు ఉన్నాయి. రెండు ఆక్సిజన్ ప్లాంట్లు కూడా ఏర్పాటు చేశారు. అయితే సరిపడా వైద్యులు లేకపోవడంతో సేవలు అందడం లేదు.

**ఈ పోస్టులు ఖాళీగా..**వైద్యులు, సిబ్బంది మొత్తం 96 పోస్టులుండాలి కానీ 13 ఖాళీగా ఉన్నాయి. అందులో సివిల్ సర్జన్ స్పెషలిస్టు, డిప్యూటీ సివిల్ సర్జన్–2, సివిల్ అసిస్టెం ట్ సర్జన్–3, ఇతర సిబ్బంది 7 పోస్టులు ఖాళీ ఉ న్నాయి. ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు గదులు, వసతులున్నా.. సంబంధిత సిబ్బంది, వైద్యులు లేరు. ఓ స్వచ్ఛంద సంస్థ ఇక్కడ డయాలసిస్ కేంద్రం నిర్వహించడానికి సిద్ధంగా ఉండగా.. ఆ సంస్థను ఇక్కడికి తెప్పించడానికి ప్రభుత్వం చొరవ



చూపాల్సిన అవసరం ఉంది.

**సమస్యలివే...**ఆస్పత్రిలో అంబులెన్స్ ఎందుకూ ఉపయోగపడటం లేదు. కేవలం అది ప్రొటోకాల్ కోసం ఉంచిన అంబులెన్స్ కావడంతో దాన్ని రెగ్యులర్ రోగులను తరలించడానికి వీలుండదు. రెండు అంతస్తులు ఉన్న ఆసుపత్రికి ముఖ్యంగా లిఫ్టు సౌకర్యం లేకపోవడంతో రోగులు వార్డులకు వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు.

**సమస్యలు పరిష్కరిస్తాం–** మమతారాణి, ఆస్పత్రి సూపరింటెండెంట్, పలమనేరు ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తాం. లిఫ్టు సమస్యను ఎమ్మెల్యే అమరనాథరెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

# ఆయు'కటకటే'

ఉయ్యాలవాడ: కర్నూలు–కడప ప్రధాన కాలువ పరిధిలోని ఉప కాలువలు అధ్వానంగా ఉన్నాయి. ఫలితంగా నీరు ముందుకు సాగక పంటలకు నీరందడం లేదు. ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలో సుమారు 60 కి.మీ. మేర ప్రధాన కాలువ విస్తరించి ఉంది. దీని పరిధిలో కొన్ని కిలోమీటర్ల మేర పెద్దఎత్తున ఉప కాలువలు నిర్మించారు.

**పొలాలకు నీరందక..**

ఉయ్యాలవాడ మండల పరిధిలోని ఇంజేడు–కొండుపల్లె గ్రామాల మధ్య దశాబ్దాల కిందట ఉప కాలువలు ఏర్పాటుచేశారు. ఆ తర్వాత నిర్వహణ లేకపోవడంతో రూపు కోల్పోతున్నాయి. పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి నీరు ముందుకు ప్రవహించడం లేదు. కాలువ లైనింగ్ దెబ్బతింటోంది. ఫలితంగా అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేసీ ప్రధాన కాలువ నుంచి కొండుపల్లె మీదుగా పెద్దయమ్మనూరు వరకు 7 కి.మీ. మేర ఉప కాలువ విస్తరించి ఉంది. దీని పరిధిలో 500 ఎకరాలకుపైగా ఆయకట్టు విస్తరించి ఉంది. ఏళ్ల తరబడి ఉప కాలువ నిర్వహణను పట్టించుకోలేదు. ఫలితంగా చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది. సమస్యను రైతులు విన్నవించినా ఎవరూ దృష్టి సారించలేదు. చివరికి పొలాలు బీళ్లుగా మారుతున్నాయి.

**నివేదికలు పంపితే..**

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సాగు నీటి ప్రాజెక్టులకు ఎనలేని ప్రాధాన్యమిస్తోంది. పంట కాలువల బాగుపై ప్రత్యేక దృష్టి సారించింది. రూ.కోట్ల నిధులు కేటాయిస్తోంది. ఈ నేపథ్యంలో జలమండలి అధికారులు స్పందించి ప్రభుత్వానికి నివేదికలు పంపి నిధులు వచ్చేలా చూడాలని ఆయకట్టు రైతులు విన్నవిస్తున్నారు.

చురకలు



# మల్లన్న సన్నిధి కావాలి ప్రగతి పెన్నిధి

శ్రీశైలం : శ్రీశైల క్షేత్రానికి రోజురోజుకు భక్తుల రాక పెరుగుతోంది.. ఏటా కోట్లాది మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు తరలొస్తున్నారు. భ్రమరాంబ మల్లికార్జునస్వామివార్ల ఆలయంతోపాటు ప్రకృతి రమణీయత, సుందరమైన కృష్ణానది వంటివి పర్యాటకాభివృద్ధికి ప్రధాన వనరులు. కానీ ఆశించిన స్థాయిలో పనులు ముందుకు సాగడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీశైలానికి వస్తున్న నేపథ్యంలో పనులపై సమీక్షించి వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**సీప్లేన్ ఎగిరితే ఎంత బాగుండో**

శ్రీశైలానికి సీప్లేన్ రాకపోకలు సాగించేలా సీఎం చంద్రబాబు ఆసక్తి చూపారు. ఆయన విజయవాడ నుంచి శ్రీశైలానికి సీప్లేన్‌లో వచ్చారు. ట్రయల్ రన్ విజయవంతం కావడంతో ఇది అమలవుతుందని భావించారు. ఏడాది గడిచినా జాడ లేకపోయింది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే పర్యాటకులు, భక్తులను ఆకట్టుకునేందుకు సీప్లేన్ ఎంతగానో ఉపయోగపడుతుంది.

**వీటిపై దృష్టి పెట్టాలి మరి**

శ్రీశైల ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందేందుకు విస్తృత అవకాశాలున్నాయి. శ్రీశైల దేవస్థానం పరిధిలో మరిన్ని వసతి సముదాయాలు అవసరం. భక్తులు, పర్యాటకులకు విస్తృత సౌకర్యాలు కల్పించడం ద్వారా ఆదాయాభివృద్ధికి వీలుంటుంది. సున్నిపెంటలో త్రీస్టార్, ఫైవ్



స్టార్ హోటళ్లు నిర్మించడం ద్వారా సౌకర్యాలు పెరుగుతాయి.

శ్రీశైల మహాక్షేత్రంలో వివాహాలకు భక్తులు ప్రాధాన్యమిస్తారు. వారి సౌకర్యార్థం క్షేత్ర పరిధిలో మరిన్ని కల్యాణ మండపాలు నిర్మించాలి. ఆలయానికి సమీపంలో భక్తులకు పార్కింగ్ ప్రదేశాల సంఖ్యను పెంచాలి. అక్కడి నుంచి బస్సులను ఏర్పాటు చేసేందుకు దేవదాయ శాఖ చొరవ చేపట్టాలి. సున్నిపెంట–శ్రీశైలం మధ్యన వంతెనకు చర్యలు చేపట్టాలి. రూ.20 కోట్లతో 2.2 కి.మీ. పొడవు, 18 మీటర్ల వెడల్పుతో వంతెన నిర్మించాలనుకున్నారు. ప్రస్తుతం సున్నిపెంటలో దేవస్థానం సిబ్బంది నివాస గృహాల నిర్మాణం జరుగుతోంది. దేవస్థానం ఉద్యోగులు త్వరగా శ్రీశైలం చేరుకొని విధులు నిర్వర్తించేందుకు దీన్ని గతంలో ప్రతిపాదించారు.

**మాస్టర్ ప్లాన్ అమలవ్వాలి**

శ్రీశైల దేవస్థానం అభివృద్ధి కోసం దేవాదాయ శాఖ మాస్టర్‌ప్లాన్‌ను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా వివిధ పనులు చేపట్టాల్సి ఉంది. రూ.100 కోట్లతో నూతన క్యూకాంప్లెక్స్, సాలుమండపాల నిర్మాణ పనులు టెండర్ల దశ వరకు వెళ్లి ఆగిపోయాయి. నూతన క్యూకాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు చేపట్టాల్సి ఉంది.

శ్రీశైల దేవస్థానం భూముల సరిహద్దుల సమస్య పునరావృతమవుతోంది. గత ప్రభుత్వ హయాంలో దేవస్థానం భూములపై అటవీ, రెవెన్యూ, సర్వే, ల్యాండ్స్ రికార్డ్స్ శాఖ సంయుక్త సర్వేలు నిర్వహించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. సంయుక్త సర్వే ప్రకారం దేవస్థానం భూములపై అటవీశాఖ అభ్యంతరం వ్యక్తం చేయకుండా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

ప్రస్తుతం ఉన్న క్యూకాంప్లెక్స్ సాధారణ రోజుల్లో అనుకూలంగా ఉన్నా...బ్రహ్మోత్సవాల్లో ఇరుకుగా మారుతోంది. ఆర్జిత సేవలు, దర్శనాల నిర్వహణకు నూతన క్యూకాంప్లెక్స్ నిర్మాణం తప్పనిసరి.

# ఆక్వా వర్సిటీకి నిధుల గండం

భీమవరం : ప్రయోగశాలల నిర్మాణానికి వేములదీవిలో 350 ఎకరాల భూమిని గుర్తించారు. భూసేకరణ పూర్తికాకపోవడంతో వర్సిటీకి అప్పగించలేదు. దీంతో విద్యార్థులు ప్రయోగాలు, క్షేత్ర పరిశీలన నిమిత్తం సుమారు 30 కిలోమీటర్ల దూరాన ఉన్న ఉండిలోని కృషి విజ్ఞాన కేంద్రానికి వెళ్తున్నారు. నరసాపురం పరిధి సరిపల్లి వద్ద ఆక్వా యూనివర్సిటీ భవన నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. నిధుల విడుదల, బిల్లుల మంజూరులో జాప్యంతో మూడేళ్లుగా పునాదులకే పరిమితమయ్యాయి. భవనాలు లేకపోవడంతో లక్ష్మణేశ్వరంలోని తుపాను షెల్టర్‌లో తరగతులు నిర్వహించాల్సి వస్తోంది.

అద్దె భవనంలోకి.. ప్రస్తుత నిర్వహిస్తున్న ఒక కోర్సులో బ్యాచ్‌కు 60 మంది చొప్పున రెండేళ్లకు 120 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ ఏడాది కొత్తగా వచ్చే మరో బ్యాచ్‌కు అవసరమైన తరగతి గదులు తుపాను షెల్టరులో లేవు. దీంతో తరగతులను సీతారాంపురంలోని



స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలోకి మార్చనున్నారు. దీనికి నెలకు రూ.1.20 లక్షలు అద్దె చెల్లించనున్నారు.

**ఒక కోర్సుకే పరిమితం..** రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఆక్వా యూనివర్సిటీ మంజూరు చేసింది. 2022 నవంబరులో నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి శంకుస్థాపన చేసి ఏడాది తర్వాత భవనాలు ప్రారంభిస్తామంటూ బీరాలు పలికారు. 2023లో మొదలైన పనులు 2024 మే నాటికి పూర్తి కావాల్సి ఉండగా పునాది దశ దాటలేదు. పేరుకు యూనివర్సిటీ అయినా భవనాలు లేకపోవడంతో ఒక్క బీఎఫ్ఎస్సీ కోర్సుకే పరిమితం చేశారు. పూర్తి స్థాయిలో తరగతులు నిర్వహిస్తే ఉన్నతీకరణలో భాగంగా ఫిషరీస్ డిప్లొమో, ఎంఎఫ్ఎస్సీ, ఇతర అనుబంధ కోర్సులు అందుబాటులోకి వస్తాయి.

**బకాయిలు రూ.25 కోట్లు..** వర్సిటీ నిర్మాణానికి నరసాపురం పరిధి సరిపల్లి, లిఖితపూడి గ్రామాల మధ్య 40 ఎకరాల భూమిని సేకరించారు. రూ.332 కోట్లతో డీపీఆర్ ఆమోదించి తొలి విడతగా రూ.100 కోట్లు మంజూరు చేశారు. మొదటి దశలో పరిపాలన భవనం, విద్యార్థులకు వసతిగృహాలు, వీసీ బంగ్లా, రైతు శిక్షణ కేంద్రాల నిర్మాణాలు పూర్తిచేయాలని నిర్ణయించారు. 2023 బడ్జెట్లో రూ.40 కోట్లు కేటాయించినట్లు ప్రచారం చేసినా తాత్కాలిక రహదారులు, మట్టి పనులు తప్ప ఇంకేం చేయలేదు. నాటి సర్కారు రూ.16 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకొంది. కూటమి ప్రభుత్వం వచ్చాక పెండింగ్ బిల్లులు రూ.7 కోట్లు విడుదల చేసింది. మరో రూ.25 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

# భక్తజనం వెంట రాగా... కదలనున్న పుష్పరథం



సింహాచలం : ఎంతో ప్రతిష్ఠాత్మకమైన సింహాచలం గిరి ప్రదక్షిణ మహోత్సవానికి సమయం ఆసన్నమైంది. ఆషాఢ పౌర్ణమి సందర్భంగా చతుర్దశి నాడు లక్షలాది మంది భక్తులు సింహగిరి ప్రదక్షిణ చేయడం ఆనవాయితీ. సింహాచలం తొలిపావంచా వద్ద నుంచి భక్తులు బయలుదేరనున్న నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఈవో వేంద్ర త్రినాథరావు తెలిపారు.

**మధ్యాహ్నం 2 గంటలకు:** ఈ నెల 9న సింహాచలం కొండ దిగువన తొలిపావంచా వద్ద నుంచి అప్పన్న స్వామి నమూనా విగ్రహంతో పుష్పరథం ప్రారంభమవుతుంది. రథాన్ని ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు జెండా ఊపి ప్రారంభిస్తారు. రథం వెంట లక్షలాది మంది భక్త జనం గిరి ప్రదక్షిణకు శ్రీకారం చుడతారు. తొలిపావంచా నుంచి మొదలయ్యే ప్రదక్షిణ పాత అడివివరం మీదుగా పైనాపిల్ కాలనీ, ముడసర్లోవ, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, అప్పుఘర్, ఎంవీపీ కాలనీ, వెంకోజీపాలెం, ఇసుక తోట, హెచ్‌బీ కాలనీ, సీతమ్మధార, అల్లూరి విగ్రహం, బాలయ్యశాస్త్రి లేఅవుట్, పోర్టు స్టేడియం, కంచరపాలెం, మాధవధార, మురళీనగర్, ఎన్ఏడీ కూడలి, గోపాలపట్నం బంకు, ప్రహ్లాదపురం, పాత గోశాల కూడలి మీదుగా తిరిగి తొలిపావంచా వద్దకు చేరుకోవడంతో 32 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణ పూర్తవుతుంది.

**సాయంత్రం విజయోత్సవం:** ఆషాఢ పౌర్ణమి నాడు భగవద్రామానుజాచార్యులు ఢిల్లీ పాదుషాను పాండిత్యంలో మెప్పించిన ఘట్టాన్ని పురస్కరించుకుని సింహాచలం ఆలయంలో ఢిల్లీ విజయం ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా 10న సాయంత్రం 4 గంటల నుంచి భక్తులకు దర్శనాలు నిలిపి వేస్తారు. తిరిగి 5 గంటల తర్వాత దర్శనాలు కల్పిస్తారు. 10న తెల్లవారుజామున 5.30 గంటల నుంచి భక్తులకు సర్వ దర్శనాలు కల్పిస్తారు. ఉత్సవాల సందర్భంగా 9, 10 తేదీల్లో ఆలయంలో జరిగే అన్ని ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు ఈవో త్రినాథరావు తెలిపారు.

**ఉచిత బస్సు సదుపాయం:** 10న ఆలయ ప్రదక్షిణ పూర్తి చేసుకుని సింహగిరికి వచ్చిన భక్తులను కొండ దిగువకు చేర్చేందుకు ఉచిత రవాణా సదుపాయం కల్పించినట్లు ఈవో తెలిపారు. ఇందుకు 50 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశామన్నారు. మెట్లమార్గంలో, సింహగిరిపైన వివిధ ప్రాంతాల్లో భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ చేసినట్లు వెల్లడించారు.

గిరి ప్రదక్షిణ మార్గంలోని 29 ప్రాంతాల్లోని ప్రత్యేక స్టాళ్లలో విశ్రాంతి తీసుకోవడానికి కుర్చీలు, కార్పెట్లు ఏర్పాటు చేస్తామని ఈవో తెలిపారు.

**10న చందన సమర్పణ, ఆలయ ప్రదక్షిణ:** ఆషాఢ పౌర్ణమి సందర్భంగా 10న సింహాద్రినాథుడికి చివరి విడత చందన సమర్పణ జరుగుతుంది. ఈ సందర్భంగా ఆరోజు వేకువజామున 2 గంటలకే సుప్రభాత సేవ, ప్రాతఃకాల పూజలు నిర్వహిస్తారు. అనంతరం సుగంధ ద్రవ్యాలు మిళితం చేసి సిద్ధం చేసిన మూడు మణుగుల (సుమారు 125కిలోలు) శ్రీగంధాన్ని స్వామికి సమర్పణ చేస్తారు. 32 కిలోమీటర్లు గిరి ప్రదక్షిణ చేయలేని భక్తుల కోసం ఆలయ ప్రదక్షిణకు అవకాశం కల్పిస్తారు. వేకువజామున 3 గంటల నుంచి ఆలయ వెలుపల నుంచి భక్తులు ఆలయ ప్రదక్షిణకు అనుమతిస్తారు. ఉత్తర గోపురం, దక్షిణ గోపురం వద్ద ర్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు.

# అన్నార్తుల ఆకలి తీరేలా..!

ఏలూరు : అన్నార్తుల ఆకలి తీర్చేలా.. అన్న క్యాంటీన్ల విస్తరణకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఉభయ జిల్లాల్లో ఇప్పటికే పలుచోట్ల అన్న క్యాంటీన్లు కొనసాగుతుండగా.. కొత్తగా ఏలూరు జిల్లాలో 4, పశ్చిమ గోదావరిలో 3 ఏర్పాటు చేయనున్నారు.

**నియోజకవర్గానికొకటి చొప్పున..**

ప్రతి నియోజకవర్గానికో అన్న క్యాంటీన్ ఉండేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతం ఏలూరు జిల్లాలో 6, పశ్చిమలో 9 చొప్పున కొనసాగుతున్నాయి. ఇవన్నీ పట్టణ ప్రాంతాల్లోనే కొనసాగుతున్నాయి. మిగతా నియోజకవర్గాల్లోని పట్టణాల్లోనూ వచ్చే జనవరిలో కొత్తగా క్యాంటీన్లు ప్రారంభించనున్నారు. తదనుగుణంగా భవన నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఏలూరులో కొత్త క్యాంటీన్ల ఏర్పాటుకు



అవసరమైన స్థలాలు సేకరించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనరు భానుప్రతాప్ తెలిపారు.

**గ్రామీణ ప్రాంతాల్లోనూ..** కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక, తొలుత పట్టణ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లు నెలకొల్పింది. వీటిని దశలవారీగా అన్ని పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలకూ విస్తరిస్తోంది. ప్రస్తుతం ఏలూరు నగరంలో 4, జంగారెడ్డిగూడెం, నూజివీడులో ఒక్కో అన్న క్యాంటీను నడుస్తోంది. కొత్తగా ఏలూరులో ఒకటి, మిగతా మూడింటిని గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రస్తుతం భీమవరం, తాడేపల్లిగూడెంలో మూడేసి, పాలకొల్లు, నరసాపురం, తణుకులో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. జనవరిలో మరో మూడు కొత్తగా ప్రారంభించనున్నారు.

# వారధి.. దందాల్లో ఆరితేరి..!




తిరుపతి: శాసనసభ్యుల వ్యక్తిగత సహాయకులు (పీఏ) నిర్దేశించిన పనులకే పరిమితం కావాలి. వారి రోజువారీ కార్యక్రమాల పర్యవేక్షణ, ప్రజలు అర్జీలు ఇస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చొరవ చూపాల్సిన బాధ్యత వారిదే. ఒకరకంగా జనాలు, అధికారులు.. ఎమ్మెల్యే మధ్య వారధిగా వ్యవహరించాలి. అటు ప్రభుత్వానికి ఇటు శాసనసభ్యుడికి మంచి పేరు తీసుకురావాలి. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొందరు ఎమ్మెల్యేల పీఏల వైఖరి ఇందుకు భిన్నంగా ఉంది. ప్రైవేటు పీఏలూ, అనుచరులు కొందరు ఇదే బాటలో పయనిస్తున్నారు. నియోజకవర్గం సొంత జాగీరున్నట్లు, ఎవరైనా సరే తమ ఆజ్ఞలు పాటించాల్సిందేనన్నట్టుగా వ్యవహారశైలి ఉంది. ఇసుక, మట్టి, గనులు, మద్యం, ప్రైవేటు లే ఔట్లు ఇలా ప్రతి అంశంలోనూ తలదూర్చుతున్నారు. అందినకాడికి నొక్కుతున్నారు. ఇప్పటికైనా వీరి విషయంలో నష్ట నివారణ చర్యలు చేపట్టకుంటే శాసనసభ్యుల పుట్టి మునగడం ఖాయం.

**అంతకుమించి అంటోన్న పీఏ..**

జిల్లా కేంద్రం తిరుపతికి ఆనుకుని ఉన్న ఓ నియోజకవర్గంలో భూముల విలువ ఎకరా ఎక్కడ చూసినా కోట్ల రూపాయల్లోనే ఉంటుంది. స్వర్ణముఖి నది కూడా ప్రవహిస్తున్నందున ఇసుకా అధికమే. పారిశ్రామికంగా ఈ ప్రాంతం దూసుకెళుతోంది. స్థానిక ప్రజాప్రతినిధి అనధికారిక పీఏ ప్రతి వ్యవహారంలోనూ వేలు పెడుతున్నారు. వైకాపా హయాంలో ఓ కాలనీలో ఇళ్ల నిర్మాణానికి ఇటుకలు తోలిన ఈయన ఇప్పుడూ చక్రం తిప్పుతున్నారు. ఇటీవల ఓ మండలంలో గ్రావెల్ ట్రాక్టరును అధికారులు పట్టుకుంటే.. విడిచిపెట్టాలని హుకుం జారీ చేశారు. నేను చెబితేనే సీజ్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. సబ్ రిజిస్ట్రార్, రెవెన్యూ శాఖలకు సంబంధించిన అంశాల్లో పని చేయాలంటే మరో అనుచరుడు ఆమోదముద్ర వేయాల్సిందే. మద్యం దుకాణాల్లో మామూళ్లు వసూలు చేసే బాధ్యతను మరొకరు భుజాన వేసుకుని.. నాలుగు రాళ్లు సంపాదిస్తున్నారు.

**ప్లాట్లు వేస్తే చుక్కలు చూపిస్తూ..**

చిత్తూరు జిల్లాలోని కీలక నియోజకవర్గంలో ఎమ్మెల్యేకు చెందిన ఇద్దరు అనధికారిక పీఏల ఆగడాలకు హద్దే లేకుండా పోయింది. ఒకరు మున్సిపల్ వ్యవహారాల్లో జోక్యం చేసుకుని తాము చెప్పిన పనులు చేయాలని ముందస్తుగానే అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. టెండర్లు సైతం తమకు కావాల్సిన వ్యక్తులకే కట్టబెట్టాలని చెప్పారు. మరో ప్రైవేటు పీఏ ఎక్కడ ప్లాట్లు వేస్తే అక్కడ వాలిపోయి రియల్టర్లకు చుక్కలు చూపిస్తున్నారు. 'నేను చెబితేనే అనుమతులు ఇస్తారు.. లేదంటే నువ్వు ఇబ్బంది పడాల్సిందే'అని హెచ్చరిస్తున్నారు. గ్రానైట్ అక్రమ తవ్వకాల్లోనూ వేలు పెట్టి చేతి నిండా సంపాదిస్తున్నారు.

**నలుగురిని దూరం పెట్టిన నేత..**

నెల్లూరు జిల్లా నుంచి తిరుపతి జిల్లాలో చేరిన ఓ నియోజకవర్గ శాసనసభ్యుడి అనుచరులు నలుగురు ఏడాదిగా పెత్తనం చెలాయించారు. ప్రైవేటు వెంచర్లు వేస్తే వాటిలో వాటాలు ఇవ్వాలని ఒకరు, మద్యం దుకాణదారులు కప్పం కట్టాలని మరొకరు.. ప్రభుత్వ భూముల ఆక్రమణలో మరో ఇద్దరు బిజీ అయ్యారు. వీరి వ్యవహారం శ్రుతి మించిందని గ్రహించిన నేత నలుగురినీ పక్కనపెట్టారు.

**వైకాపాలోనూ హవా..**

చిత్తూరు జిల్లాలోని ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంలోని ఎమ్మెల్యే పీఏగా ఉన్న వ్యక్తి వైకాపాలోనూ ఓ వెలుగు వెలిగారు. శాసనసభ్యుడు పెద్దగా నియోజకవర్గంలో ఉండకపోవడాన్ని అలుసుగా తీసుకున్నారు. విద్యుత్తు పనులు చేసే గుత్తేదారులను బెదిరించి అభాసుపాలైనా అతని తీరు మారలేదు. ఇసుక, మట్టి అక్రమ రవాణాదారులకు సహకరిస్తున్నాడనే ఆరోపణలున్నాయి.

**మాట తీరుతో అప్రతిష్ఠ**

చిత్తూరు జిల్లాలోని పశ్చిమ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న సీనియర్ ఎమ్మెల్యే అనధికారిక పీఏ మాట తీరుతో అప్రతిష్ఠ మూటగట్టుకుంటున్నారు. అవినీతికి దూరంగా ఉన్నా ప్రజలు ఎవరైనా వస్తే కటువుగా మాట్లాడుతున్నారు. అర్జీదారులకు సరైన సమాధానం చెప్పకుండా తిప్పుకొంటున్నారు.

# తీరంలో వరద గుబులు

ఆచంట : గోదావరి నదిలో వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ఈ నెల 14వ తేదీ నాటికి ప్రవాహం 9 లక్షల నుంచి 10 లక్షల క్యూసెక్కులకు చేరవచ్చని వరద పర్యవేక్షణ అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో జిల్లా అధికారులు లంక గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు ముందు జాగ్రత్త చర్యలకు సన్నద్ధమయ్యారు. జిల్లాలో ఆచంట, పాలకొల్లు, నరసాపురం నియోజవర్గాలు వశిష్ఠ గోదావరి నదికి శివారున ఉన్నాయి. ఆచంట నియోజకవర్గ పరిధిలో గోదావరి మధ్య ఉన్న లంక గ్రామాల్లో 6 వేలకు పైగా నివాసితులు ఉన్నారు. లంక భూముల్లో పెద్ద సంఖ్యలో పశువులు ఉన్నాయి. వరద పెరిగితే పెనుగొండ, ఆచంట, యలమంచిలి మండలాల పరిధిలో ఉన్న లంక భూములపై పడుతుంది. ఈ నేపథ్యంలో లంకభూముల్లో పశువులను సురక్షిత ప్రాంతాలకు




తరలించాలని అధికారులు స్థానికులకు సూచించారు. ఆచంట, యలమంచిలి మండలాల్లో గర్భిణులు, బాలింతలు, వృద్ధుల వివరాలు సేకరిస్తున్నారు. అవసరమైతే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని ప్రజలకు సూచిస్తున్నారు. అన్ని శాఖల అధికారులతో ఆయా మండలాల్లో మంగళ, బుధవారాల్లో సమావేశాలు నిర్వహించనున్నారు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసినందున మరో రెండు మూడు రోజుల్లో వరద నీరు దిగువకు వచ్చే అవకాశం ఉందని ఆచంట తహసీల్దారు కనకరాజు పేర్కొన్నారు. ముందు జాగ్రత్త చర్యలు చేపట్టేలా ఆచంట మండలంలో క్షేత్ర స్థాయి సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

# శ్రావణమాసం.. స్వగృహ యోగం

అనంతపురం : శ్రావణమాసం పేదలకు సొంతింటి ప్రవేశానికి ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. లక్ష్యాలను చేరుకొని పేదలకు స్వగృహ యోగం కల్పించడానికి జిల్లా గృహ నిర్మాణ సంస్థ కసరత్తు ప్రారంభించింది. ప్రస్తుతం ఆషాఢమాసం నడుస్తోంది. ఈనెల 25వ తేదీ నుంచి శ్రావణ మాసం ఉండటంతో ఎక్కువ మంది ఇళ్లలో చేరేందుకు ఆసక్తి చూపుతారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే పైకప్పు పూర్తయిన, పైకప్పు దశకు చేరిన ఇళ్లపై అధికారులు దృష్టిసారించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి కావడానికి చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే ఇసుకను ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలు చేపట్టి నిలిచిపోయినా, వివిధ దశల్లో ఉన్న ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేలు, ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు అదనపు సాయం అందించడం విశేషం.

**చొరవ చూపితేనే.. లక్ష్యానికి చేరువ**

గత వైకాపా ప్రభుత్వం అప్పట్లో ఎన్టీఆర్ గృహ నిర్మాణాలకు నిర్దాక్షిణ్యంగా బిల్లులు ఆపేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కొన్ని నియోజకవర్గాల్లో వైకాపా హయాంలో మంజూరైన ఇళ్లకు బిల్లులు ఇవ్వకూడదన్న అభిప్రాయం వ్యక్తం అవుతుండటంతో ప్రజాప్రతినిధులు కొంత చొరవ చూపడం



లేదు. ఇప్పటిదాకా నిర్ణయించిన లక్ష్యాల్లో సగం మాత్రమే పూర్తి కాగా శ్రావణ మాసంలో కొంత మేరకు పూర్తయితే 75 నుంచి 85 శాతం లక్ష్యానికి చేరువయ్యే అవకాశం ఉంటుంది.

# పేదలది పట్టా.. పెద్దలదే చిట్టా!

ఒంగోలు : సమీపంలోని అన్నవరప్పాడులో ఓ వ్యక్తికి మూడంతస్తుల ఇల్లు ఉంది. పైగా ఆరు వాకిళ్లు ఉండగా నాలుగు వాకిళ్లు అద్దెకు ఇచ్చారు. ఈయనకు ఇంటి పట్టా ఇచ్చారు. ఒంగోలు నగరంలోని ఓ కాలనీకి చెందిన తండ్రీకొడుకులిద్దరికి రెండు ఇళ్లు ఉన్నాయి. పీఎంఏవై కింద గతంలో ఇల్లు తీసుకున్నారు...పైగా నాలుగు చక్రాల వాహనం ఉంది. వీరికి ఇంటి పట్టా మంజూరు చేశారు గత వైకాపా ప్రభుత్వ హయాంలో 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో భాగంగా ఇంటి పట్టాల పంపిణీ నిమిత్తం జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు, ప్రభుత్వ భూములు సేకరించారు. మొత్తం 620 లేఅవుట్లు వేసి సుమారు 84 వేల మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఇవన్నీ శివారు ప్రాంతాల్లో ఉండడంతో నేటికి కొందరు లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోలేదు. వీటిపై ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వేలో జిల్లావ్యాప్తంగా 20 వేల మందికిపైగా అనర్హులు ఉన్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రత్యేకించి ఒంగోలు నగరంలో సుమారు 20,800 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. 2023 చివరిలో ఒంగోలు సమీపంలోని వెంగముక్కపాలెం, ఎన్.అగ్రహారం వద్ద స్థానిక రైతుల నుంచి భూములు సేకరించారు. సార్వత్రిక ఎన్నికల ముందు హడావుడిగా అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదగా పట్టాల పంపిణీ చేశారు. భూ సేకరణ పేరిట కోట్లాది రూపాయలు ఖర్చు చేసినా ఒంగోలు నగరానికి దూరంగా ఉన్న రెండు లేఅవుట్లలోనూ అప్పటి ప్రజాప్రతినిధులు, రెవెన్యూశాఖాధికారులు మాత్రం లబ్ధిదారులకు పొజిషన్ చూపలేదు. అప్పట్లోనే లబ్ధిదారుల జాబితాలో సగం మంది అనర్హులు ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. అనంతరం ఎన్డీయే ప్రభుత్వం అధికారం చేపట్టాక లేఅవుట్లలోని అనర్హుల ఏరివేతపై ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దృష్టిసారించారు. గత ఆరు నెలలుగా రెవెన్యూ, విద్యుత్తుశాఖలతోపాటు నగరపాలకసంస్థ ఉద్యోగులు వారి వద్ద ఉన్న వివరాల ఆధారంగా లబ్ధిదారుల ఇళ్లకెళ్లి వారి పూర్తి వివరాలు సేకరించారు. తద్వారా అనర్హులను గుర్తించారు.

ఆరంచెల విధానంపై క్షేత్ర పరిశీలన

గత వైకాపా పాలనలో ఇంటి పట్టాలకు అర్హులైన వారి జాబితాను మండలాల్లో రెవెన్యూశాఖ, ఒంగోలు నగరంలో నగరపాలక సంస్థ అధికారులు తయారు చేశారు. వీటి ఆధారంగానే స్థానిక రెవెన్యూ అధికారులు ఇంటి పట్టాలు మంజూరు చేశారు. లేఅవుట్లల్లో అప్పటి వైకాపా నాయకులు, కార్యకర్తలే రెండు, మూడు పట్టాలు తీసుకున్నారన్న ఆరోపణలున్నాయి. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిపై విచారణకు ఆదేశించింది. ఈ మేరకు గత ఆరు నెలలగా రెవెన్యూశాఖ అధికారులు విచారణ జరిపారు. నిబంధనల ప్రకారం ఎవరికైనా ఇల్లు ఉంటేనే వారి పేరిటే విద్యుత్తు మీటరు ఇస్తారు. అప్పటికే మీటరు ఉండి ఎక్కువ మంది పట్టాలు తీసుకున్నట్లు గుర్తించారు.

# స్కిట్‌పై ఆశల ఊసులు..!

శ్రీకాళహస్తి : 'శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (స్కిట్) ఇంజినీరింగ్ కళాశాల పునః ప్రారంభంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇంజినీరింగ్ కళాశాలల ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఇప్పటి వరకు స్కిట్ కళాశాలలో ప్రవేశాలకు అనుమతి లభించకపోవడంపై ఉత్కంఠ నెలకొంది.

**విలీనంపై సడలని పట్టు**

కళాశాలను జేఎన్‌టీయూ పరిధిలోకి తేవాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని సాకారం చేసేలా మంత్రి నారా లోకేశ్ సూచనలతో ఉన్నత విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇప్పటికే పలు దఫాలు సమావేశాలు నిర్వహించారు. తాజాగా నెల్లూరు పర్యటనకు వచ్చిన మంత్రి లోకేశ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఇదే విషయమై ఎమ్మెల్యే బొజ్జల




సుధీర్‌రెడ్డి సంక్షిప్త నివేదికను అందజేశారు.

**ఫలించేనా..:** కళాశాల ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం కావాలంటే ఎంసెట్ ప్రవేశాలకు అవకాశం లభించాలి. ప్రస్తుతం ప్రవేశాలకు అన్నీ కళాశాలలు దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టాయి. ఆన్‌లైన్ ద్వారా వెబ్ ఆప్షన్ల ఎంపిక ప్రక్రియ ఈ నెల 13న ప్రారంభం కానుంది. ఆ లెక్కన 12వ తేదీ రాత్రి వరకు అవకాశం ఉంది. ఆలోగా కళాశాల పునః ప్రారంభంపై ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటే వెబ్ ఆప్షన్లకు అవకాశం ఉంటుంది. లేకుంటే ఇక ఈ ఆర్థిక సంవత్సరం కళాశాల ప్రారంభం కష్టసాధ్యమే. అమరావతిలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో అనుకూల ఫలితాలు వస్తాయని కళాశాల అధ్యాపకులు, యాజమాన్యం భావిస్తోంది.

# బెన్నవోలులోనూ అక్రమాల బాగోతాలు

చోడవరం : చోడవరం మండలంలో సహజ వనరుల సంపద దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. బెన్నవోలులో తాగునీటి పథకాలకు సమీపంలో తవ్వకాలు చేపట్టారు. అధికారులు వస్తున్నారు.. తవ్వకాలు చేపడితే ఊరుకోబోమంటూ హెచ్చరించి వెళ్లిపోతున్నారు తప్ప చర్యలు చేపట్టలేదు. రాయపురాజుపేట, నర్సాపురం, వెంకన్నపాలెం, అంభేరుపురం, గోవాడ, బెన్నవోలు, ముద్దుర్తి, గంధవరం పంచాయతీలు కొండలకు సమీపంలో ఉన్నాయి. కొండ దిగువన భూములున్న రైతులతో మాట్లాడుకుని కంకరను పట్టుకెళ్లి అమ్ముకుంటున్నారు. బెన్నవోలులో వారం రోజులుగా రాత్రుళ్లు తవ్వకాలు చేసి ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. గతంలో తవ్వకాలు వల్ల తాగునీటి సరఫరా



గొట్టాలు దెబ్బతింటే పంచాయతీ అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో ఆగమేఘాలపై తవ్వకందారులు గొట్టాలను బాగు చేయించారు. ఇప్పుడు తాగునీటి పథకాన్ని ఆనుకుని కొండను తొలిచేసేస్తున్నారు. దీంతో నీటి పథకాల పునాదులు జారి కూలిపోయే ప్రమాదం పొంచి ఉంది. బీ అక్రమ తవ్వకాలపై తాగునీటి సరఫరా విభాగం డీఈఈ సూర్యనారాయణ వద్ద ప్రస్తావించగా తహసీల్దారుకు లేఖ ద్వారా తెలిపామన్నారు. తాగునీటి పథకాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత పంచాయతీలదేనని స్పష్టం చేశారు. సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు పేర్కొన్నారు.

# దస్త్రాలు మార్చి.. తీరంలో భూఆక్రమణలు

వాకాడు: వాకాడు మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో ప్రభుత్వ భూములు రోజురోజుకు ఆక్రమణలకు గురవుతున్నాయి. గ్రామాల్లో ప్రభుత్వ భూములను ఎవరు, ఎంత ఆక్రమించారు?.. ఏ ప్రాంతం వారు.. సర్వే నంబర్లతో వీఆర్ఏ, వీఆర్వోలకు తెలిసినా పట్టించుకోవడం లేదు.మండలంలోని దుగరాజపట్నం, కొండూరు, రావిగుంటపాలెం, పంబలి, రెడ్డిపాలెం బిట్-1, బిట్-2, పూడిరాయదొరువు రెవెన్యూ గ్రామాల్లో వైకాపా పాలన నుంచి ప్రభుత్వ భూములు ఆక్రమణల్లో చిక్కుకుంటున్నాయి. మండలంలోని పూడిరాయదొరువు రెవెన్యూ గ్రామంలో సర్వే నంబరు 30లో 15.62 ఎకరాల భూమి ఉండగా.. ఇప్పటికే పదెకరాల భూమి ఆక్రమించేశారు. ఆ భూముల్లో భవనంతో పాటు కొందరు రైతులు సాగు చేపట్టారు. కొంత భూమిలో చినతోటకు చెందిన ఓ రైతు ఏకంగా ఓ భవనాన్ని రెండు నెలల కిందట నిర్మించారు. ఇదంతా రెవెన్యూ అధికారులకు తెలిసినా వారి వద్ద మామూళ్లు తీసుకుని పట్టించుకోవడం లేదని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. పంబలిలో రెండేళ్ల కిందట అక్కడి వీఆర్ఏ ప్రభుత్వ,



అసైన్‌మెంట్ భూములను ఆయన కుటుంబీకుల పేరుతో దస్త్రాలను తారుమారు చేసినా ఆ కేసులు అలానే కొనసాగుతున్నాయి. తూపిలిపాలెం వద్ద కొందరు ప్రభుత్వ భూముల్లో రొయ్యలసాగు చేపట్టినా అధికారులు పట్టించుకోవడం లేదు.

**అధికారుల హవా..** మండలంలోని సముద్ర తీర గ్రామాల్లో పనిచేస్తున్న కొందరు గ్రామ రెవెన్యూ అధికారులు, వారితో పాటుగా కొందరు వీఆర్ఏలు ప్రభుత్వ భూముల ఆక్రమణల్లో హవా చూపిస్తున్నారు. కొందరు ఏకంగా దస్త్రాలను వారి వద్ద ఉంచుకుని వారి ఇష్టానుసారంగా మార్పులు చేస్తున్నట్లు సమాచారం. కొందరు వీఆర్ఏలకు మండల అధికారులు తీరంలో విలువైన భూముల దస్త్రాలను అప్పగించడంతో వారు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ రామయ్యను వివరణ కోరగా ప్రభుత్వ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని, విలువైన భూముల దస్త్రాలపై నిఘా ఉంచుతామన్నారు.

# కడుపు 'కోత'కే మొగ్గు!



అనంతపురం : అనంత నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఈఏడాది ఆరంభం నుంచి మే వరకు 385 ప్రసవాలు జరగ్గా అందులో 229 సిజేరియన్లు చేశారు. మరో వైద్యశాలలో నమోదైన కాన్పులు 116 కాగా సిజేరియన్లు 102 చేయడం గమనార్హం. ఇలా జిల్లాలోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో సిజేరియన్లకే అధిక ప్రాధాన్యం ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గర్భిణులకు ప్రభుత్వం మెరుగైన వైద్యసేవలతో పాటు, పౌష్టికాహారాన్ని అందజేస్తోంది. ఏఎన్ఎంలు.. గర్భిణుల ఇంటి వద్దనే పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రసవ సమయంలో ఇబ్బంది పడకూడదని మెరుగైన సౌకర్యాలను సర్కారు కల్పిస్తోంది. దీన్ని బట్టి సాధారణ ప్రసవాలు పెరగాలి. ఇందుకు భిన్నంగా సిజేరియన్లే అధికమవుతుండటం గమనార్హం. కొందరు వైద్యులు కాసుల కోసం కక్కుర్తి పడి సాధారణ కాన్పు అయ్యే పరిస్థితి ఉన్నా చోట సిజేరియన్ చేస్తున్నారు. లేదంటే తల్లీబిడ్డకు ప్రమాదం అంటూ ఆందోళనకు గురి చేస్తూ ఒప్పిస్తున్నారు. 'ఎన్టీఆర్ వైద్యసేవ' కింద ఉన్న కొన్ని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లోనూ ఈ తతంగం సాగుతోంది.

**సమీక్షలకే పరిమితం**

రాష్ట్రంలో సిజేరియన్లు అధికంగా జరుగుతున్న జిల్లాల్లో అనంతపురం మూడవ స్థానంలో ఉంది. ఇంత జరుగుతున్నా అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి నెలా సమీక్ష, సమావేశాలతో సరిపెడుతున్నారు. క్షేత్రస్థాయిలో తరచూ తనిఖీలు చేసి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు.

**ఎలాంటప్పుడు చేయాలంటే..!**

ప్రసవ సమయంలో అధిక రక్తస్రావం, నియంత్రించలేనంతగా ఫిట్స్ వచ్చినప్పుడు, కడుపులో బిడ్డ అడ్డం తిరిగినప్పుడు, బిడ్డకు గుండె సమస్య.. తల్లీబిడ్డకు ప్రాణాపాయం కలుగుతుందన్న సందర్భాల్లో సిజేరియన్ చేయవచ్చని గైనకాలజీ విభాగం నిపుణులు చెబుతున్నారు.

**రూ.వేలల్లోనే వసూలు**

సిజేరియన్ అయ్యాక కోలుకునేందుకు కొంతకాలం పడుతుంది. ఒకవేళ కుట్లు వేసిన చోట ఇన్‌ఫెక్షన్ సోకితే మరింత సమయం పడుతుంది. కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఒక సిజేరియన్‌కు రూ.36 వేల నుంచి రూ.75 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ప్రభుత్వం ఇచ్చే మొత్తానికి అదనంగా వసూలు చేస్తూ.. బాధిత కుటుంబాలపై ఆర్థికభారం మోపుతున్నారన్న ఆరోపణలున్నాయి.

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు**

– డాక్టర్ ఈ.బి.దేవి, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారిణి

కొన్ని ప్రతికూల ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు మాత్రమే సిజేరియన్ చేయాలి. అధిక సిజేరియన్లు చేసిన ఆసుపత్రుల యాజమాన్యాలకు నోటీసులు ఇస్తాం. ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో అదనంగా డబ్బులు డిమాండ్ చేశారని ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటాం.

# నిబంధనల బూచి.. నిర్భయంగా దోచి!!



విశాఖ : మహా విశాఖ నగర పాలక సంస్థ అధికారుల తీరుతో... ప్రజాధనంతో చేపట్టే అభివృద్ధి గాడి తప్పుతోంది. దొడ్డిదారిలో అధికారుల చేతికి కాసులు వచ్చే వాటికి, ప్రజాప్రతినిధులు సూచిస్తున్న ప్రైవేటు వ్యక్తులకు లబ్ధి చేకూరే వాటికే ప్రాధాన్యం ఇస్తుండడం గమనార్హం. మున్సిపల్‌శాఖకు లబ్ధి చేకూర్చే అంశాల కంటే ప్రభుత్వం నుంచి ప్రైవేటు వ్యక్తులు లాభపడేలా ప్రణాళికలు సిద్ధం చేసి, అమలు చేస్తున్నారు. వైకాపా హయాంలో నగరంలో విడుదల చేసిన టీడీఆర్‌లపై ఓవైపు విచారణ జరుగుతుండగా, అదే తీరుగా టీడీఆర్‌లు ఇవ్వడానికే ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**ఖాళీ స్థలం అప్పగింత:** 88వ వార్డు పరిధిలో దశాబ్దాల కిందట ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారికి ఏర్పాటు చేసిన లే అవుట ఖాళీ స్థలాన్ని రియల్ ఎస్టేట వ్యాపారులకు భూబదలాయింపు కింద అందించేలా ఇటీవల మున్సిపల్‌శాఖ మెమో జారీ చేసింది. ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారులకు చెందిన ఎనిమిది ఎకరాల స్థలానికి అనువుగా రహదారి నిర్మించేందుకు ఖాళీ స్థలాన్ని వినియోగించేలా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఆ స్థలాన్ని అప్పగించడం ద్వారా ప్రైవేటు వ్యక్తులకు భారీగా లబ్ధి చేకూరుతుంది. ఈ మొత్తం వ్యవహారంలో స్థానికంగా ఉన్న ఓ ప్రజాప్రతినిధి పాత్ర కీలకమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేపగుంట వద్ద సర్వే నెంబర్లు 75, 76, 77, వెంకటాపురం వద్ద సర్వే నెంబర్లు 76, 82లో రహదారి అభివృద్ధి చేయనున్నారు. ఈ మార్గంలో ఓవైపు కొండ, మరోవైపు గెడ్డ, ప్రభుత్వ స్థలాలే ఉన్నాయి.

అయితే ఆస్తి హక్కులు లేని వారికి అక్రమంగా టీడీఆర్‌లు జారీ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ప్రస్తుతం 60 అడుగుల వెడల్పైన సీసీ రహదారి ఉంది. నివాసాలు తక్కువగా ఉండడంతో పాటు, మూతపడిన ఓ కంపెనీ, పక్కన రైల్వే ట్రాక్, ఆ తరువాత మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ ఉన్నాయి. దీంతో భవిష్యత్తులోనూ ఈ ప్రాంతం అభివృద్ధికి అవకాశాలు తక్కువే. ఇలాంటి పరిస్థితుల్లో టీడీఆర్‌లు దోపిడీ చేయడానికే రహదారి విస్తరణ చేపడుతున్నట్లు పలువురు అనుమానిస్తున్నారు.

**ఎవరి కోసం రహదారి విస్తరణ**

జన సంచారం తక్కువగా ఉండే ప్రాంతంలో రహదారి విస్తరణ పేరుతో ప్రైవేటు వ్యక్తులు టీడీఆర్‌లు దక్కించుకునేందుకు వీలుగా సిద్ధం చేసిన దస్త్రాన్ని జీవీఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులు చకచకా నడిపిస్తున్నారు. మాస్టర్‌ప్లాన్-2041లో భాగంగా నాయుడుతోట కూడలి నుంచి ఆంధ్ర సిమెంట కంపెనీ, పోర్లుపాలెం కూడలి వరకు 2.6 కిలోమీటర్ల రహదారిని 100 అడుగుల మేర విస్తరించేందుకు ఆర్‌డీపీ (రహదారి అభివృద్ధి ప్రణాళిక) తయారు చేశారు.

# పగలు భేటీ.. రాత్రి లూటీ!



అనకాపల్లి : వారంతా ఒక ముఠా! రెండు బృందాలుగా ఏర్పడతారు. పగలు కొందరు బేరాలు ఒప్పుకొని సొమ్ము వసూలు చేస్తుంటే.. రాత్రయితే మరికొందరు పొక్లెయిన్లు, ట్రాక్టర్లతో మూకుమ్మడిగా బయలుదేరి దగ్గరలోని కొండలను, చెరువులను కొల్లగొడుతున్నారు. ఇదీ సబ్బవరం మండలంలో సాగుతున్న గ్రావెల్ దందా! కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా.. సబ్బవరం మండలంలో వైకాపాలోని కొందరి ఆగడాలకు అడ్డుకట్ట పడలేదు. కొండలు, చెరువులు ఇష్టారాజ్యంగా తవ్వేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సబ్బవరం, పరిసర ప్రాంతాల్లో స్థిరాస్తి వ్యాపారం ఊపందుకుంది. లఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వీటితోపాటు ఇళ్ల నిర్మాణాలు సైతం జోరుగా సాగుతున్నాయి. దీంతో మట్టి, గ్రావెల్‌కు డిమాండ్ బాగా ఎక్కువైంది. దీన్ని అవకాశంగా చేసుకుని.. వైకాపా నాయకులు ఓ ముఠాగా ఏర్పడి సమీపంలోని ఎలాంటి అనుమతులు లేకుండా కొండలను తవ్వేస్తున్నారు. అధికార పార్టీ నాయకులు ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిందిపోయి వైకాపా నాయకులతో కుమ్మక్కయి వారికి అండదండలు అందిస్తున్నారు. తనిఖీలు చేసి అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులేమో కార్యాలయాలకే పరిమితం అవుతుండటంతో అక్రమార్కుల దందా మూడు లారీలు.. ఆరు ట్రాక్టర్లుగా కొనసాగుతోంది.

**కన్నుపడితే చాలు:** అసకపల్లి, గంగవరం, బాటజంగాలపాలెం, ఒమ్మివానిపాలెం, గాలిభీమవరం, అంతకాపల్లి, రాయపురఅగ్రహారం, గొల్లలపాలెం తదితర గ్రామాల్లో మట్టి, గ్రావెల్ తవ్వకాల రవాణా పెద్ద వ్యాపారంగా మారింది. ఆయా ప్రాంతాలకు సమీపంలోని ప్రభుత్వ భూములు, కొండవాలు ప్రాంతాలు, పేదల ఇళ్ల కాలనీలకు సమీపంలో రాత్రి వేళల్లో భారీ యంత్రాలతో తవ్వకాలు సాగిస్తున్నారు. దూరాన్ని బట్టి లారీకి రూ. 3,500 నుంచి రూ. 7 వేల వరకు వసూలు చేస్తున్నారు.అసకపల్లి సర్వే నం. 1లోని వజ్రాలకొండ చుట్టూ రోజూ తవ్వకాలు చేస్తున్నారు. న్యాయ విశ్వవిద్యాలయం దగ్గర పేదల ఇళ్లకు ఆనుకుని ఉన్న కొండవాలు మొత్తం అగాధంలా మార్చేశారు. ప్రస్తుతం ఒమ్మివానిపాలెం సమీపంలోని నల్లకొండపై అక్రమార్కుల కన్నుపడింది. దీంతో ఇక్కడ కొద్దిరోజులుగా తవ్వకాలు ఊపందుకున్నాయి.

**చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం:** ప్రభుత్వ స్థలాలు, కొండ వాలుల్లో మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదు. ఫిర్యాదులు వస్తే.. రెవెన్యూ సిబ్బందిని పంపించి తనిఖీలు చేయిస్తున్నాం. రాత్రివేళల్లో కూడా నిఘా పెడుతున్నాం. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ స్థలాల్లో తవ్వకాలు చేస్తే.. వాహనాలను సీజ్ చేస్తాం. అపరాధరుసుం విధిస్తాం. అప్పటికీ ఆపకపోతే.. చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

శ్రీనివాస్, ఏడీ, మైనింగ్, అనకాపల్లి

# అనుమతులతో మాకేం పని?

చిత్తూరు: తన పర్యటనల్లో సొంత పార్టీ కార్యకర్తలు ప్రాణాలు పోతున్నా, సామాన్యులు, పోలీసులకు గాయాలవుతున్నా మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు పట్టడం లేదు. పరామర్శలకు కూడా వైకాపా నేతలు జన సమీకరణ ఆపడం లేదు. ఈ నెల 9న మాజీ సీఎం జగన్.. బంగారు పాళ్యం యార్డుకు వచ్చి మామిడి రైతులతో మాట్లాడతారని వైకాపా నేతలు సమాచారం ఇవ్వడంతో 500 మంది తరలిరావాలని ఎస్పీ మణికంఠ స్పష్టం చేశారు. ఆ స్థలంలో ఎక్కువ మంది ఉండేందుకు సాధ్యం కాదని చెప్పారు. ఇందుకు తగిన విధంగానే జనసమీకరణ చేసుకోవాలని సూచించినా ఫ్యాను పార్టీ నేతలు ఇందుకు విరుద్ధంగా



ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బంగారుపాళ్యం మార్కెట్ ఉన్న పూతలపట్టు నియోజకవర్గం నుంచే 2 వేలు- 3వేల మందికి తగ్గకుండా జనాలు వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. పుంగనూరు నియోజకవర్గంలో ప్రతి పంచాయతీ నుంచి ఒక కారు పెట్టాలని నిర్ణయించుకున్నారు. పలమనేరు, చిత్తూరు, గంగాధరనెల్లూరు, నగరి నియోజకవర్గాలను కలుపుకొంటే కనీసం 10 వేల మందిని తరలించాలని భావిస్తున్నారు.

# చూడదు కన్ను.. వేసేయ్ మన్ను

దేవనకొండ : ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో సాగునీటి చెరువుల్లో జరుగుతున్న పనులు నాసిరకంగా మారాయి. పేరుకు సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్నట్లు చెబుతున్నప్పటికీ ఆయా ప్రాంతాలకు చెందిన కొందరు నాయకుల ఆధ్వర్యంలో సాగుతున్నాయి. మరికొద్ది రోజుల్లో చెరువులకు నీటి విడుదల జరుగుతుండగా.. ఆలోపే పనులు పూర్తి చేయాలన్న తొందరలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

**పేరు ఒకరిది చేస్తున్నది మరొకరు**

కర్నూలు జిల్లాలో 21 పనులకు 1.27 కోట్లు నంద్యాలలో 49 పనులకు రూ.2.68 కోట్లు, ఆళ్లగడ్డ, నందికొట్కూరు నియోజకవర్గాల్లో 10 శాతం కమీషన్‌పై ఐదు చెరువులను ఒక గుత్తేదారుడు చేస్తున్నారు. శ్రీశైలం నియోజకవర్గంలో పనులను విడగొట్టుకుని గ్రామ నాయకులే నిర్వహిస్తున్నారు. పశ్చిమ ప్రాంతం మంత్రాలయంలో ఓ నేత కనుసన్నల్లో జరుగుతున్నాయి. డోన్‌లో ఓ గుత్తేదారుడు రెండు పనులను ముందస్తుగా కుదుర్చుకున్న ఒప్పందం మేరకు చేస్తున్నారు.

**రూ.3.95 కోట్లు మంజూరు**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో మైనర్ ఇరిగేషన్ ఆధ్వర్యంలో ఓఅండ్ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) పనులకు రూ.3.95 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో చెరువులకు సంబంధించిన పంట కాలువలను శుభ్రం చేసి శివారు ప్రాంతాల్లోని పొలాలకు నీళ్లివ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కట్టలను మట్టితో పటిష్ఠం చేయడంతోపాటు చెరువులు, కట్టలపై ఉన్న ముళ్ల పొదలు, కంపచెట్లు తొలగించడం.. స్లూయిజ్‌లలో ఎలాంటి



అడ్డంకులు లేకుండా లేకుండా శుభ్రం చేయాలి. పనులను సాగునీటి సంఘాలకు అప్పగించారు. పేరుకు సంఘాలు ఆధ్వర్యంలో చేస్తున్నట్లు చెబుతున్నా పరోక్షంగా కొందరు నాయకుల ఆధ్వర్యంలోనే ఇవి జరుగుతున్నాయి. మరికొన్నిచోట్ల గుత్తేదారులు పనులు చేస్తున్నారు.

**ముళ్ల పొదలు తొలగించకుండానే**

దేవనకొండ మండలం మాచాపురం చెరువుకు రూ.5 లక్షలు మంజూరయ్యాయి. పనులు ఇటీవలే ప్రారంభమయ్యాయి. కట్ట పటిష్టపరిచేందుకు మట్టి వేస్తున్నారు. కట్టకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలు తొలగించలేదు. త్వరగా పనులు పూర్తి చేయాలన్న ఉద్దేశంతో తూతూమంత్రంగా కానిచేస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు.

**పనులన్నీ నాసిరకమే..**

చెరువుల గట్లపై ముళ్ల పొదలు తొలగించాల్సి ఉండగా ఎక్కడ కూడా పూర్తి స్థాయిలో తొలగించడం లేదు. కొన్నిచోట్ల నిప్పు పెట్టి అలానే వదిలేస్తున్నారు. మరికొన్నిచోట్ల గడ్డి మందు చల్లుతున్నారు. చెరువులో పెద్దఎత్తున వ్యర్థాలు ఉన్నప్పటికీ అలానే ఉంచేస్తున్నారు. చెరువు కట్టలకు నాసిరకం మట్టి వాడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

# చిక్కీలు చిక్కేనా?



తాళ్లూరు : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోషకాహారంలో భాగంగా పంపిణీ చేయాల్సిన చిక్కీలు ఈ నెలలో అందకపోవడంతో విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. ఒకటి నుంచి పదోతరగతి వరకు గల విద్యార్థులకు ప్రభుత్వం ఢొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద ప్రతి విద్యార్థికి వారానికి మూడు చొప్పున ప్రతి పదిహేను రోజులకొకసారి పాఠశాలల వారీగా లెక్కించి సరఫరా చేస్తోంది. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు ప్రస్తుత నెలకు సంబంధించి ఇప్పటివరకు చిక్కీలు సరఫరా కాలేదు. దర్శి నియోజకవర్గంలోని అయిదు మండలాల విద్యార్థులకు దొనకొండకు చెందినవారు నెలకు రెండు పర్యాయాలు చిక్కీలు సరఫరా చేస్తారు. ప్రస్తుత నెలకు సంబంధించి సరఫరా కాకపోవడంతో వారం రోజులుగా చిన్నారులకు చిక్కీల సరఫరా నిలిచిపోయింది. ఈ విషయమై విద్యాశాఖాధికారులు మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, సరఫరా ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడామని, ఒకట్రెండు రోజుల్లో అన్ని పాఠశాలల విద్యార్థులకు అందజేస్తామన్నారు.




## రష్మిక ప్లేస్ కి ఎసరు పెట్టేలా అమ్మడి ప్లాన్..?

కన్నడ పరిశ్రమలో ఆరేళ్ల క్రితమే హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది అందాల భామ రుక్మిణి వసంత్. హిందీలో అప్ స్టార్స్ అనే సినిమాలో ఎన్.జి.ఓ గర్ల్ గా కనిపించిన రుక్మిణి కన్నడలో బర్ బల్ ట్రియాలజీ కేస్ 1 ఫైండింగ్ వజ్రముని సినిమాలో నటించింది. ఆ సినిమాలో రుక్మిణిని చూసి రక్షిత్ శెట్టి సప్త సాగరాలు దాటి సినిమాలో ఛాన్స్ పట్టేసింది. సప్త సాగరాలు దాటి రెండు భాగాల్లో రుక్మిణి వసంత్ యాక్టింగ్ అదరగొట్టేసింది. సినిమాలో ఆమెను చూసిన యూత్ ఆడియన్స్ అంతా ఆమెకు ఫిదా అయ్యారు. సప్త సాగరాలు దాటి సినిమా తర్వాత రుక్మిణి వసంత్ సౌత్ ఆడియన్స్ కి హాలిలిట్ ఫేవరెట్ అయ్యింది. అమ్మడికి వరుసగా ఇతర భాషల నుంచి ఛాన్స్ లు వస్తున్నాయి. ఇప్పటికే తమిళ్ లో విజయ్ సేతుపతితో ఏస్ సినిమా చేసిన రుక్మిణి వసంత్ శివ కార్తికేయన్ తో మదరాసి సినిమాలో



కూడా అవకాశం అందుకుంది. ఇక తెలుగులో నిఖిల్ తో అప్పుడో ఇప్పుడో ఎప్పుడో సినిమాతో వచ్చినా ఆ సినిమా ఎవరు పట్టించుకోలేదు. లేటెస్ట్ గా అమ్మడు ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబో సినిమాలో ఛాన్స్ అందుకుందని తెలుస్తుంది. నీల్ తో సినిమా అది కూడా ఎన్టీఆర్ లాంటి స్టార్ తో ఛాన్స్ అంటే అది మామూలు విషయం కాదు. తప్పకుండా రుక్మిణి సౌత్ సినిమాల్లో తన ఇంపాక్ట్ గట్టిగా చూపించేలా ఉందని అనిపిస్తుంది. తనకు యూత్ ఆడియన్స్ లో ఏర్పడిన క్రేజ్ చూస్తే సరిగ్గా ఒక్క బ్లాక్ బస్టర్ పడితే ఇక అమ్మడిని తీసుకెళ్లి టాప్ ప్లేస్ లో పెట్టేలా ఉన్నారు. ఆల్రెడీ కన్నడ నుంచి వచ్చి రష్మిక టాలీవుడ్ ని మాత్రమే కాదు పాన్ ఇండియా లెవెల్ లో సూపర్ సెన్సేషన్ గా మారింది. ఇక ఇప్పుడు రష్మిక తర్వాత రుక్మిణి అదే రేంజ్ ఫాం కొనసాగించాలని చూస్తుంది. రష్మిక ప్లేస్ కి ఎసరు పెట్టే ప్లానింగ్ లో భాగంగానే రుక్మిణి స్టార్ ఛాన్స్ లు పట్టేస్తుందని అంటున్నారు. ఏది ఏమైనా తప్పకుండా రుక్మిణికి ఆ ఛాన్స్ ఉందనే అనిపిస్తుంది. రుక్మిణి వసంత్ చేస్తున్న ఎన్టీఆర్ సినిమా బ్లాక్ బస్టర్ కొడితే మాత్రం అమ్మడికి ఆపడం ఎవరి వల్లా కాదని చెప్పొచ్చు. ఇదే కాదు మరో రెండు మూడు క్రేజీ ప్రాజెక్ట్స్ కూడా లైన్ లో ఉన్నట్టు తెలుస్తుంది.

## మృణాల్ ను వాడుకుంటారా? సైడ్ చేస్తారా?

కొన్ని సినిమాల్లో కథ కంటే క్యాస్టింగ్ మరింత ఇంట్రెస్ట్ ను కలిగిస్తోంది. బాలీవుడ్ సీక్వెల్స్ అయితే క్యాస్టింగ్ విషయంలో చాలా మిస్టరీగా ఉంటాయి. ఈ నేపథ్యంలో త్వరలో రిలీజ్ కాబోతున్న ఓ బాలీవుడ్ సినిమా క్యాస్టింగ్ విషయంలో ఆసక్తిని కలిగిస్తోంది. జులై లో రిలీజ్ కానున్న సన్ ఆఫ్ సర్దార్2 క్యాస్టింగ్ ఇప్పుడు అందరిలోనూ ఇంట్రెస్ట్ ను పెంచుతోంది. దానికి కారణం ఈ సినిమాతో పంజాబీ స్టార్ నటి నీరూ బజ్వా బాలీవుడ్ లోకి అడుగుపెడుతుంది. ఈ సినిమా సన్ ఆఫ్ సర్దార్ కు సీక్వెల్ గా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. సన్ ఆఫ్ సర్దార్ సినిమా రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన మర్యాద రామన్నకు రీమేక్ గా తెరకెక్కి మంచి హిట్ అందుకుంది. ఇప్పుడు దానికి సీక్వెల్ గా వస్తున్న సినిమా మంచి కథతో ఆడియన్స్ ను మెప్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇక అసలు విషయానికొస్తే సన్ ఆఫ్ సర్దార్2 సినిమాలో అజయ్ దేవగణ్ భార్యగా నీరూ బజ్వా నటిస్తోందని వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి.




పంజాబీ సినీ ఇండస్ట్రీలో నీరూ బజ్వాకు మంచి ఆదరణ ఉంది. ఆ జనాదరణ సన్ ఆఫ్ సర్దార్ ఫ్రాంచైజ్ కు కొత్త ఆడియన్స్ ను తీసుకొస్తుందని, ఈ సినిమాలో నీరూ బజ్వా క్యారెక్టర్ చాలా గణనీయంగా ఉంటుందని అంటున్నారు. నీరూ అజయ్ దేవగణ్ భార్య పాత్రలో నటిస్తుంటే మరి మృణాల్ ఠాకూర్ ఏ పాత్రలో కనిపించనుందని ఇప్పుడు ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. సౌత్ లో మంచి హీరోయిన్ గా పేరు తెచ్చుకుని స్టార్ స్టేటస్ ను తెచ్చుకున్న మృణాల్ కు కూడా భారీ ఎత్తున ఫ్యాన్స్ ఉన్నారు. ఇప్పటివరకు మృణాల్ బాలీవుడ్ లో పలు సినిమాలు చేసినప్పటికీ అమ్మడికి ఇంకా చెప్పుకోదగ్గ హిట్ మాత్రం దక్కలేదు. దీంతో అజయ్ దేవగణ్ తో చేస్తున్న సన్ ఆఫ్ సర్దార్2 ఆమెకు బాలీవుడ్ లో మంచి బ్రేక్ ఇస్తోందని అందరూ భావిస్తున్న టైమ్ లో సడన్ గా అజయ్ దేవగణ్ భార్య పాత్రలో నీరూ నటిస్తుందని అంటున్నారు. అజయ్ దేవగణ్ కు భార్యగా నీరూ నటిస్తే మరి మృణాల్ అతని ప్రేయసి పాత్రలో కనిపిస్తుందా లేక మృణాల్ కు అంతకు మించిన క్యారెక్టర్ ఏమైనా ఇచ్చారా? అదీ లేదంటే మంచి టాలెంట్ ఉన్న మృణాల్ ను కేవలం గ్లామర్ రోల్ కు పరిమితం చేశారా అనేది తెలియాల్సి ఉంది.

## కూలీ.. ఇదేమి బాక్సాఫీస్ ను డ్యామేజ్ చేయదుగా?




ఇండియన్ సినీ ప్రేక్షకులు ఎదురుచూస్తున్న భారీ ప్రాజెక్టుల్లో కూలీ సినిమాకు రోజురోజుకు హైప్ మరింత పెరుగుతోంది. రజనీకాంత్ – లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో వస్తున్న మొదటి సినిమా కావడంతో అన్ని భాషల్లో కూడా కమర్షియల్ గా డిమాండ్ గట్టిగానే ఉంటుందని అనుకున్నారు. తలైవా మాస్ స్టైల్స్‌కు, లోకేష్ డైరెక్షన్ టేకింగ్‌కు, అనిరుధ్ సంగీతానికి ఏ స్థాయిలో క్రేజ్ ఉందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దానికి తోడు స్పెషల రోల్స్ కూడా మరింత బూస్ట్ ఇస్తున్నాయి. ఇందులో నాగార్జున, ఉపేంద్ర, అమీర్ ఖాన్ లాంటి నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారని క్లారిటీ వచ్చేసింది. దర్శకుడు లోకేష్ అన్ని భాషల్లో సినిమాకు హైప్ వచ్చేలా తీసుకున్న జాగ్రత్తలు దాదాపు బాగానే వర్కౌట్ అయ్యాయి. కానీ ఒక్క దగ్గర మాత్రం కూలీ బజ్ ఇబ్బంది పెడుతున్నట్లు అనిపిస్తోంది. మంచి భారీ హైప్ మధ్య, సినిమాకు సంబంధించిన ఒక నిర్ణయం మైనస్ వైబ్ తీసుకొచ్చింది. అది హిందీలో టైటిల్ మార్పు. కూలీ అనే పవర్‌ఫుల్ టైటిల్‌ని బదులు, హిందీలో మజ్దూర్గా మార్చారు. ఈ పేరు పట్ల నార్త్ ఆడియెన్స్‌లో మిక్స్ డ్ రెస్పాన్స్ వస్తోంది. మజ్దూర్ అన్న పదం ఓ క్లాస్ టోన్‌లో ఉండటంతో, రజనీ మాస్ ఆడియెన్స్‌కి కనెక్ట్ కావడం కష్టం అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అమీర్ ఖాన్ తో క్రేజ్ ను బ్యాలెన్స్ చేయవచ్చు అనుకున్నప్పటికి టైటిల్ కాస్త ఇబ్బంది పెట్టే పరిస్థితి తెచ్చింది. ఈ టైటిల్ 1950ల నాటి ఫీలింగ్‌ని తీసుకువస్తుందని కొంతమంది సోషల్ మీడియాలో కామెంట్ చేస్తున్నారు. అయితే ఈ మార్పుకు కారణం కాపీ రైట్స్ సమస్యే అని బలమైన ఊహాగానాలు ఉన్నాయి. 1983లో అమితాబ్ బచ్చన్ నటించిన లెజెండరీ హిట్ కూలీ టైటిల్ రైట్స్ ఇప్పటికీ ఆ నిర్మాత వద్దే ఉన్నాయని సమాచారం. ఆ టైటిల్ రీ యూజ్ చేయాలంటే క్లియర్ పరమిషన్ తీసుకోవాల్సి వస్తుంది. అదే సమస్య ఎదురవడంతో హిందీ వెర్షన్‌కి మజ్దూర్ అని పేరు పెట్టారని ఇన్ సైడ్ టాక్. ఇదంతా జరుగుతున్న టైంలో, కూలీకి ఎదురుగా జూనియర్ ఎన్టీఆర్ – హృతిక్ రోషన్ నటిస్తున్న వార్ 2 కూడా ఆగస్ట్ 14న రిలీజ్ కానుంది. నార్త్ మార్కెట్‌లో థియేటర్లు సంపాదించాలంటే టైటిల్, ప్రమోషన్ల స్థాయిలు కూడా కీలకం. అలాంటి సమయంలో ఇలా పేరు మార్చడంపై ఫ్యాన్స్ అసంతృప్తిగా ఉన్నారు. అయినా కానీ, లోకేష్ స్టైల్, రజనీకాంత్ పవర్ స్క్రీన్ మీద దంచికొడితే.. ఓపెనింగ్స్ గ్యారెంటీ అని అభిమానులు నమ్ముతున్నారు. టీజర్ ఇప్పటికే భారీ అంచనాల్ని పెంచింది. పూర్తి ట్రైలర్ వచ్చాక అసలైన కిక్ అందుతుందనడంలో సందేహమే లేదు. అయితే తమిళ సినిమాలకు అందని ద్రాక్షగా మిగిలిన 1000 కోట్ల మార్క్ ను అందుకోవాలి అంటే హిందీ మార్కెట్ చాలా కీలకం. కొంత ఎఫెక్ట్ పడినా కూడా అది కష్టమే. మరి కూలీ ఎలాంటి కలెక్షన్స్ అందుకుంటుందో చూడాలి.

## విజయ్ స్టైలిష్‌గా.. మరింత పవర్‌ఫుల్‌గా




తమిళ స్టార్ హీరో విజయ్ ప్రస్తుతం చేస్తున్న సినిమా జన నాయగన్. ఆదివారం విజయ్ బర్త్ డే సందర్భంగా అర్ధరాత్రి చిత్ర యూనిట్ జన నాయగన్ నుంచి ఫస్ట్ రోర్ పేరుతో టీజర్ ను రిలీజ్ చేయగా, ఆ టీజర్ కు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. అర్ధరాత్రి రిలీజైన టీజర్, సినిమాపై అంచనాలను మరింత పెంచింది. దీంతో విజయ్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీగా ఉన్నారు. విజయ్ ను డైరెక్టర్ వినోత్ పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ గెటప్ లో చూపించాడు. టీజర్ తోనే ఫ్యాన్స్ ఫుల్ ఆనందంతో కేరింతలు కొడుతుంటే ఫ్యాన్స్ ఉత్సాహాన్ని రెట్టింపు చేయాలని సినిమా నుంచి విజయ్ పోలీస్ లుక్ లో ఉన్న ఓ సరికొత్త పోస్టర్ ను కూడా రిలీజ్ చేశారు మేకర్స్. టీజర్ లో లాగానే విజయ్ ఈ పోస్టర్ లో కూడా చాలా పవర్‌ఫుల్ గా కనిపిస్తున్నాడు. చాలా కాలం తర్వాత తమ అభిమాన హీరో తిరిగి పోలీస్ పాత్ర చేస్తుండటం, దానికి తోడు ఇందులో విజయ్ స్టైలిష్ గా కూడా కనిపిస్తుండటంతో జన నాయగన్ లుక్ కు ఆడియన్స్ నుంచి భారీ ఎత్తున ప్రశంసలొస్తున్నాయి. ఈ సినిమాను దేశ వ్యాప్తంగా ఒకేసారి, ఒకే టైటిల్ తో రిలీజ్ చేయాలనే ఆలోచనతో సినిమాకు జన నాయగన్ అనే టైటిల్ ను ఫిక్స్ చేశారు మేకర్స్. వచ్చే ఏడాది జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాలో పూజా హెగ్డే, బాబీ డియోల్, మమిత బైజు, గౌతమ్ మీనన్, ప్రకాష్ రాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్ లో రూపొందుతున్న జన నాయగన్ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, విజయ్ రాజకీయాల్లోకి వెళ్లబోతూ చేస్తున్న ఆఖరి సినిమాగా ఇది తెరకెక్కుతుంది. విజయ్ నుంచి రాబోతున్న ఆఖరి సినిమా కావడంతో జన నాయగన్ పై అందరికీ భారీ అంచనాలున్నాయి.

## జాన్వి అక్కడ బిజీ అవ్వాలని చూస్తుందా..?

శ్రీదేవి తనయురాలు జాన్వి కపూర్ బాలీవుడ్ లో తన మార్క్ నటనతో ఆడియన్స్ ని ఆకట్టుకుంటుంది. హిందీలోనే కాదు తన మదర్ లానే సౌత్ సినిమాల్లో కూడా రాణించాలని అనుకున్న జాన్వి కపూర్ ఎన్ టీ ఆర్ దేవర తో తెలుగు ఎంట్రీ ఇచ్చింది. కొరటాల శివ డైరెక్షన్ లో తెరకెక్కిన దేవర సినిమాలో తంగం పాత్రలో జాన్వి కపూర్ ఆకట్టుకుంది. సినిమాలో అమ్మడి గ్లామర్ కి తెలుగు ఆడియన్స్ పడిపోయారని చెప్పొచ్చు. ఐతే జాన్వి కపూర్ దేవర తర్వాత దేవర 2 చేయాల్సి ఉంది. ఐతే ఈలోగా రాం చరణ్ పెద్ది ఆఫర్ అందుకుంది. బుచ్చి బాబు డైరెక్షన్ లో చరణ్ లీడ్ రోల్ లో చేస్తున్న పెద్ది సినిమా సంథింగ్ స్పెషల్ గా రానుంది. ఈ సినిమా విషయంలో జాన్వి కపూర్ చాలా కాన్ ఫిడెంట్ గా ఉంది. ఐతే దేవర సినిమా చేసినా కూడా జాన్వికి ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. ఆ సినిమాలో ఆమెను కేవలం గ్లామర్ షోకి మాత్రమే అన్నట్టుగా చూపించారు. ఐతే పెద్ది విషయంలో అలాంటి తప్పు జరగకూడదని ఫిక్స్ అయ్యింది. అందుకే అమ్మడు ఈ పాత్రని ఎంపిక చేసుకుంది. ఇదిలా ఉంటే సౌత్ సినిమాల మీద ఫోకస్ తో అక్కడ బాలీవుడ్ లో అవకాశాలు



మిస్ అవుతున్నాయని భావిస్తున్న జాన్వి కపూర్ ఇక మీదట అక్కడే ఫోకస్ చేయాలని ఫిక్స్ అయ్యిందట. ఎంత చేసినా సౌత్ లో గ్లామర్ కన్నా యాక్టింగ్ తోనే ఇంప్రెస్ చేయాల్సి ఉంటుంది. ఐతే అలాంటి పాత్రలు పడితేనే కానీ జాన్వికి ఇక్కడ సూపర్ స్టార్ డం వచ్చే అవకాశం ఉండదు. అందుకే సౌత్ సినిమాలు అడపాదడపా చేసినా తనకు అనుకువగా ఉండే హిందీ సినిమాలే చేస్తే బెటర్ అని భావిస్తుందట జాన్వి కపూర్. ప్రస్తుతం అమ్మడు పెద్ది సినిమాతో పాటు రెండు బాలీవుడ్ సినిమాలు చేస్తుంది. అందులో ఒకటి పరం సుందరి కాగా మరొకటి సన్నీ సంస్కారి కి తులసి కుమారి సినిమా చేస్తుంది. ఈ రెండు సినిమాలతో మరోసారి బాలీవుడ్ లో తన సత్తా చాటాలని చూస్తుంది జాన్వి కపూర్. ఐతే తెలుగులో మాత్రం పెద్ది హంగామా బాగుండగా ఆ సినిమా సక్సెస్ ఐతే మళ్లీ తెలుగు ఇంకా సౌత్ పరిశ్రమల నుంచి జాన్వి కపూర్ కి ఛాన్స్ లు వచ్చే వీలుంటుంది.

## కళ్యాణి ప్రియదర్శన్.. ది బాస్ లేడీ వైబ్స్

క్యూట్ లుక్స్‌తో కుర్రకారు గుండెల్ని కొల్లగొడుతున్న ఈ బ్యూటీ ఎవరో పరిచయం చేయాలా? .. అసలు పరిచయమే అవసరం లేని పేరు– కళ్యాణి ప్రియదర్శన్. ప్రముఖ దర్శకుడు ప్రియదర్శన్ కుమార్తె. బలమైన సినీనేపథ్యం నుంచి వచ్చిన కళ్యాణి బహుభాషల్లో నటిగా వెలిగిపోతోంది. ఓవైపు మలయాళం, మరోవైపు తెలుగు, తమిళంలోను నటిస్తూ బిజీగా ఉంది. కళ్యాణి ప్రస్తుతం జెనీ అనే తమిళ చిత్రంలో నటిస్తోంది. దీంతో పాటు %–%ఒడం కుతిర చదుం కుతిర – అనే మలయాళ చిత్రం, లోకా– చాప్టర్ 1 (చంద్ర) అనే మలయాళ సూపర్ హీరో ఫిలింలోను నటిస్తూ బిజీగా ఉంది. లోకా చాప్టర్ 1 సినిమాని దుల్కార్ సల్మాన్ సహభాగస్వామిగా నిర్మిస్తున్నారు. కళ్యాణి సోషల్ మీడియాల్లోను బిజీగా ఉంది. ఈ బబ్లీ బ్యూటీ ఇటీవల కొంత ట్రెడిషన్ కి ఆవల ట్రెండీ లుక్స్ లో కనిపిస్తూ ఆకట్టుకుంటోంది. ఇంతకుముందే కళ్యాణి బికినీ లుక్ ఒకటి ఇంటర్నెట్‌లో వైరల్ గా మారింది. ఇప్పుడు ట్రెడిషనల్ వైట్ టాప్, బ్రౌన్ ట్రాక్ ధరించి అదిరిపోయే ఫోజు ఇచ్చింది. ఆ భుజానికి తగిలించిన వైట్ హ్యాండ్




బ్యాగ్, బ్లాక్ గాగుల్స్, ఐఫోన్... కళ్యాణి ఇస్టయిల్ ప్రతిదీ కుర్రకారును ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోగ్రాఫ్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. కళ్యాణి కెరీర్ గ్రాఫ్‌ని పరిశీలిస్తే కొన్ని ఆసక్తికర చిత్రాల్లో నటించింది. ఈ భామ ప్రారంభం అసిస్టెంట్ ప్రొడక్షన్ డిజైనర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించింది. ఆమె తెలుగు చిత్రం హలో (2017)లో కథానాయికగా నటనా రంగ ప్రవేశం చేసింది. ఉత్తమ ఆరంగేట్ర కథానాయికగా ఫిల్మ్‌ఫేర్ సౌత్ అవార్డును గెలుచుకుంది. ఆ తర్వాత హీరో (2019)తో తమిళ సినీ రంగంలో ప్రవేశించింది. వారణే అవశ్యముండ్ (2020)తో మలయాళ సినిమాకు పరిచయమైంది. ఆ తర్వాత చిత్రలహరి (2019), మానాడు (2021), హృదయం (2022), తాళ్ళుమాళ (2022), బ్రో డాడీ (2022) చిత్రాల్లో నటించింది. వీటిలో చివరిదానికి ఆమె మలయాళంలో ఉత్తమ నటిగా సైమా అవార్డును గెలుచుకుంది. ప్రస్తుతం మూడు సినిమాల్లో నటిస్తూ కెరీర్ పరంగా ఫుల్ బిజీగా ఉంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536